మొజాయిక్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-4-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 84 పేజీలు: 10+4 వెల: 6.50

## వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు అరెస్టు 2లో

## సమయం మించిపోతోంది: ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు 5లో



శుక్రవారం సింగపూర్‌లో పర్యటిస్తున్న ఏపి మంత్రుల బృందం

### ప్రజల్లో విశ్వసనీయత పెంచే
# సమగ్ర అభివృద్ధి బాట
### సింగపూర్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై రాష్ట్ర మంత్రుల బృందం అధ్యయనం
### పిఎంఒ మాజీ మంత్రి లిమ్ స్వీసేతో భేటీ

**విజయవాడ,ఏప్రిల్ 24,ప్రభాతవార్తప్రతినిధి:** సింగపూర్ ప్రభుత్వం ఆధునిక ప్రజాస్వామ్యంలో అవలంబిస్తున్న అభివృద్ధి, పారిశ్రామిక, సాంకేతిక, పర్యావరణ అనుకూల విధానాలను మంత్రుల బృందం అధ్యయనం చేస్తోంది. సింగపూర్‌లో మంత్రుల బృందం 4వ రోజు పర్యటన కొన సాగుతోంది. సింగపూర్ ప్రభుత్వం ఆధునిక ప్రజాస్వామ్యంలో అవలంబిస్తున్న అభివృద్ధి, పారిశ్రామిక, సాంకేతిక, పర్యావరణ అనుకూల విధానాలను మంత్రుల బృందం అధ్యయనం చేస్తోంది. సింగపూర్ లోని పరిస్థితులపై సింగపూర్ పీఎంవో మాజీ మంత్రి మిస్టర్ లిమ్ స్వీసే మంత్రులకు సమగ్రంగా వివరించారు.దేశ ప్రయోజనాలే కాకుండా, సమాజంలోని >>2

# మహిళా బిల్లుపై 'ప్రత్యేక అసెంబ్లీ'



### మరో పది రోజుల్లో మూడు రోజుల పాటు సమావేశాల నిర్వహణ
### కాంగ్రెస్ కూటమి విధానాలను ఎండగడతాం
### విజయవాడ, విశాఖ, తిరుపతిలో బహిరంగసభలు, 'స్త్రీశక్తి' సదస్సులు
### పల్లా, మాధవ్, నాదెండ్లతో కమిటీ: ఎన్డీయే పక్షాలతో విసిలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 24,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఇండి కూటమి పక్షాల తీరును ప్రజలకు పూర్తి స్థాయిలో అవగతమయ్యే రీతిలో అన్ని విధాలుగా కార్యచరణను చేపట్టాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదే శించారు.ఇందుకు అనుగుణంగా వచ్చే 10రోజుల్లో అసెంబ్లీని దాదాపు 3రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశపరచాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఇదే క్రమంలో విశాఖ-విజయవాడ-తిరుపతి బహిరంగ సభల నిర్వహణతో పాటు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు సమావేశాలు నిర్వహించి మహిళల్ని చైతన్య పరిచే కార్యక్రమాల పై కార్యాచరణకు త్రిసభ్య కమిటీని నియమించారు. విస్తృత ప్రచారం అవసరం: కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై స్పష్టమైన రాజకీయ దిశా నిర్దేశం ఇచ్చారు. పార్లమెంట్‌లో ఈ బిల్లును అడ్డుకున్న ఇండి కూటమి పక్షాల వైఖరిని ప్రజల ముందుంచాలని ఆయన సూచిం చారు. మహిళలకు జరిగిన అన్యాయాన్ని ప్రతి ఇంటికి చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని నేతలను ఆదేశించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్‌లు చర్చల్లో పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాలతో పాటు త్వరలో 3 ప్రాంతాల్లో సభలు నిర్వహించాలని సీఎం అన్నారు.విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో కూటమి పక్షాల ఆధ్వర్యంలో బహిరంగ సభలు పెట్టాలని నిర్ణయించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని చంద్రబాబు విమర్శించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వం చట్టం చేశారని గుర్తుచేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు మాధవ్, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్ లతో కమిటీ ఏర్పాటు చేశారు. మహిళా హక్కుల విషయంలో ఎన్డీఏ కట్టుబాటును పునరుద్ఘాటించిన చంద్రబాబు, కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పార్టీలు అడ్డంకులు సృష్టించాయని విమర్శిం చారు. 1996 నుంచి మహిళా బిల్లును నిలిపివేస్తూ వచ్చిన ధోరణిని ప్రజలకు వివరించాలని కోరారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వచ్చిన చట్టాన్ని కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు. డీలిమిటేషన్ పేరుతో తప్పుదారి పట్టించే ప్రయత్నాలను బహిర్గతం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి గ్రామ స్థాయి వరకు నిరసనలతో రాజకీయ వేడి పెంచాలని సీఎం పిలుపు నిచ్చారు" స్త్రీ శక్తి" పేరుతో ప్రత్యేక సదస్సులు నిర్వహించి మహి ళల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. >>2

# టిఎంసి గూండాలకు బెంగాల్‌లో చోటివ్వం 5లో
### రెండోదశ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

# హుగ్లీ నదిలో ప్రధాని మోడీ హుషారుగా పడవ షికారు
### మార్నింగ్ వాకర్లతో ముచ్చట్లు.. ప్రకృతి అందాలు కెమెరాలోకి


2లో



# 'ఆప్'కు భారీ షాక్
### రాఘవ్ ఛద్దా, మరో ఆరుగురు ఎంపీలు గుడ్‌బై
### బిజెపిలో చేరిక

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** ఆప్ రాజ్యసభ సభ్యుడు రాఘవ్‌ఛద్దా పార్టీకి రాజీనామాచేసారు. పార్టీ నాయకత్వంతో నెలకొన్న విభేదాలు, పార్ల మెంటులో తనను మాట్లాడనీయకుండా అణగ దొక్కిన వైఖరి వంటి వాటితో నొచ్చుకున్న రాఘవ్ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయిం చుకున్నారు. అంతేకాకుండా తనతోపాటు మరో ఆరుగురు ఎంపిలతో కలిసి బిజెపిలో చేరేందుకు నిర్ణయించుకకున్నట్లు తెలిపి ఆప్‌హైకమాండ్‌కు భారీ షాక్ ఇచ్చారు. ఈమేరకు మీడియా మీట్ నిర్వహించి వివరాలు చెప్పారు. వెనువెంటనే ఏడుగురు సభ్యులతోకూడిన లేఖను బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సింహాకు ఇచ్చి బిజెపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. అలాగే పార్టీకి రాజీనామా లేఖలు, >>2

# గ్రామసభలకు పూర్వవైభవం



### రాష్ట్రంలో కొత్త దిశలో సాగుతున్న పంచాయతీరాజ్
### పల్లెపండుగ విజయవంతం: డిసిఎం పవన్

**విజయవాడ,ఏప్రిల్ 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ నూతన దిశగా ముందుకు వెళ్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం స్పందించారు. గ్రామ స్వరాజ్యం దిశగా ఏపీ వేగంగా అడుగులు వేస్తోం దని అన్నారు.స్వయం ప్రతిపత్తితో ముందుకు సాగుతోందన్నారు. గ్రామ సభలకు పూర్వవైభవం వచ్చిందని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ సమన్వయంతో గ్రామ సభలు, పల్లె పండుగ 1.0 2.0 విజయ వంతం అయ్యాయని అన్నారు.స్వచ్ఛ రథాలు, ఎస్‌ఎల్‌ఆర్‌ఎమ్‌కార్యక్రమాలు, మ్యాజిక్ డ్రైన్స్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నా యన్నారు. ఈ గ్రామ స్వరాజ్యం యాత్రలో భాగస్వాములైన ప్రజలకు, సర్పంచ్‌లకు, వార్డ్ సభ్యులకు, పంచాయతీరాజ్ అధికార యంత్రాం గానికి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సం దర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ధన్య వాదాలు తెలియజేశారు.గత ఏడాది ఒకే రోజు 13,326 గ్రామాల్లో ఏకకాలంలో గ్రామ సభలు నిర్వహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ పంచా యతీరాజ్‌శాఖ వరల్డ్ రికార్డ్స్ యూనియన్ రికార్డు అందుకుంది. ఈ సమావేశాల ద్వారా రూ. 4,500కోట్ల ఉపాధి హామీ పనుల ప్రణా ళికకు రూపకల్పన చేశారు. గ్రామీణప్రజల భాగ స్వామ్యంతో పల్లెల అభివృద్ధి దశగా అడుగులు వేశారు.ఉద్యోగులకు పదోన్నతుల ఉత్సాహం స్తబ్దతతో కూడిన పాలనా వ్యవస్థలో ఉత్సాహాన్ని నింపేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో పదోన్నతుల ప్రక్రియను చేపట్టారు. సుమారు 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. అత్యంత పారదర్శ కతతో చేపట్టిన ఆ ఘట్టం రాష్ట్ర పంచాయతీరాజ్ చరిత్రలో మరపురాని ఘట్టంగా మన్ననలు అందుకుంది. ఈ పదోన్నతులు పొందిన వారిలో పీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఎంపీడీఓలు, డీడీఓలు, జెడ్పీ సీఈవోలు ఉన్నారు. దీని ద్వారా ఉద్యోగస్తులు నిర్లిప్తత వీడి సమర్థవంతంగా విధులు నిర్వహించేలా చేశారు.మౌలిక వసతులు, గ్రామీణ అనుసంధానం, గిరి శిఖర గ్రామాలకు బాటలు వేసిన 'అడవి తల్లి బాట',పల్లెపండుగ వంటి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్ల పండుగ జరిగింది. రూ. 3,853 కోట్లు వెచ్చించి 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 1,331 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించారు. రూ. 1,005 కోట్లు వెచ్చించి 625 గిరిజన ఆవాసాలను కలు పుతూ 1,049 కిలోమీటర్ల రహదారులు నిర్మి స్తున్నారు. రోడ్లు రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలు సులభతరంగా >>2



శుక్రవారం వీడ్కోలు సభలో మాట్లాడుతున్న పదవీ విరమణ చేసిన ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్. చిత్రంలో కొత్త సిజె లీసాగిల్ ఉన్నారు.

# న్యాయసేవలో మేటి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
### వీడ్కోలు సభలో ప్రశంసించిన కొత్త సిజె లీసా గిల్
### హైకోర్టు సిజెగా లీసా గిల్ నేడు బాధ్యతలు

**విజయవాడ, ఏప్రిల్ 24,ప్రభాతవార్తప్రతినిధి:** న్యాయ సేవలో చిరస్మరణీయ సేవాస్ఫూర్తికి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆదర్శంగా నిలిచారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తిగా నియమితులై శనివారం బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లిసా గిల్ ప్రసంశించారు.హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ సందర్భంగా శుక్ర వారం హైకోర్టు మొదటికోర్టు హాల్లో ఫుల్ కోర్టు ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ వీడ్కోలు కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లీసా గిల్ మాట్లా డుతూ ప్రతిభావంతమైన న్యాయవేత్తగా, దూరదృష్టి కలిగిన పరిపాలకుడిగా,వినయం మరియు మాన వీయ విలువల ప్రతిరూపంగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నిలిచారని కొనియాడారు.వారి సేవలు ఆం ధ్రప్రదేశ్ న్యాయ చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తాయని ప్రశంసించారు. 1964 ఏప్రిల్ 25న జన్మిం చిన జస్టిస్ ఠాకూర్ 1989లో న్యాయవాదిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. న్యాయరంగంలో విశేష ప్రతిభకనబరిచి 2011లో సీనియర్ అడ్వకేట్ హోదా >>2

# నేడు ముంబయికి సిఎం
### ఎకనమిక్ టైమ్స్ అవార్డు స్వీకరించనున్న చంద్రబాబు
### పెట్టుబడుల ఆకర్షణలో ఏపికి ప్రశంసలు 2లో

### మద్యం కేసు నిందితుల ఇళ్లల్లో
# ఇడి సోదాలు



తిరుపతిలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంటి వద్ద ఇడి అధికారులు

### చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రాజ్ కేశిరెడ్డి, గోవిందప్ప, కృష్ణమోహన్, ధనుంజయరెడ్డి ఇళ్లలో విస్తృతంగా తనిఖీలు
### హైదరాబాద్, విజయవాడ, తిరుపతిలో రోజంతా సోదాలు

**విజయవాడ,ఏప్రిల్ 24, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కేసు నిందితుల ఇళ్లల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, బాలాజీ గోవిందప్ప, కృష్ణ మోహన్, ధనుంజయరెడ్డి ఇళ్లల్లో శుక్రవారం ఉదయం నుంచి సోదాలు సిట్ నివేదిక ఆధారంగా హైదరాబాద్, తిరుపతి, విజయవాడల్లోనూ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. మద్యం ద్వారా వచ్చిన ముడుపులను షెల్ కంపెనీలకు మళ్లించి లబ్ది పొందినట్లు ఈడీ గుర్తించింది. దాదాపు రూ.1000 కోట్ల మేర ముడుపులు అందినట్లు గతంలో చేసిన దర్యాప్తుల్లో ఈడీ ప్రాథమికంగా గుర్తించింది. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఉచ్చు బిగిస్తోంది. మద్యం కేసు నిందితులకు సంబంధించిన వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు జరుపుతోంది. హైదరా బాద్, తిరుపతి, విజయవాడలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. సుమారు రూ. 3,500 కోట్ల వరకు ప్రజాధనం పక్కదారి పట్టినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ నిర్ధారించింది. సిట్ నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఈడీ మరికొన్ని కీలక విషయాలను గుర్తించింది. మద్యం కుంభకోణంలోని నిధులను షెల్ కంపెనీల ద్వారా మళ్లించి మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు సంచలన విషయాలను బయటపెట్టింది. నిందితులు నెలకు సగటున వంద కోట్ల రూపాయల చొప్పున అక్రమ వసూళ్లకు పాల్ప డినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు కీలక సమాచారం.ఈ క్రమంలో మరింత >>2

### పశ్చిమగోదావరి, కోనసీమ, బాపట్ల జిల్లాలు
# మలేరియా రహితం



### 2024-25 నుంచి రాష్ట్రంలో జ్వరాల కేసులు తగ్గుముఖం
### క్రిమిసంహారక మందుల పిచికారీకి రూ.10కోట్లు
### 2030 నాటికి కేసులు మరింతగా తగ్గిస్తాం: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,ఏప్రిల్ 24, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మలేరియా జ్వరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా బాపట్ల, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాలను మలేరియా రహిత జిల్లాలుగా ప్రకటించేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపబోతున్నామని ప్రకటించారు. 2024- 25 నుంచి మలేరియా జ్వరాల కేసులు రాష్ట్రంలో తగ్గుతూ వస్తున్నా యని తెలిపారు. 2024- 25లో 7,871 మలేరియ కేసులు రాగా, 202526లో 7,199 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు (16 వారాలు) 899 కేసులు నమో దైనట్లు చెప్పారు. కిందటేడాది ఇదే సమయంలో 1,783 కేసులు వచ్చాయన్నారు. 2030 నాటికి మలేరియా కేసులు గణనీయంగా తగ్గించేందుకు పకడ్బందీగా రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా చర్యలు చేడుతున్నామని తెలిపారు. ప్రపంచ మలే రియా దినోత్సవం (శనివారంఏప్రిల్ 25) పురస్కరించుకుని మంత్రి నేడొక ప్రకటన జారీచేశారు రాబోయే వర్షాలు దృష్టిలో ఉంచుకుని ఖఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేఖ కార్యక్రమాన్ని చేబట్టబోతున్నామని మంత్రి తెలిపారు. ఇళ్లల్లోని గోడలు, పైకప్పు భాగంలో క్రిమి సంహార క మందును స్ప్రే చేయడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వీలవుతుందని వెల్లడించారు. క్రిమిసంహారక మందు కొనుగోలు, పిచికారీ, ఇతర ఖర్చుల కింద కలిపి ఏడాదికి రూ.10 కోట్ల వరకు వ్యయం చేస్తున్నామని తెలిపారు. మలేరియా జ్వరాల కేసులు అధికంగా ఉండే ముఖ్యంగా గిరిజన ప్రాంతాలైన అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం జిల్లాల్లో స్ప్రే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సదరు ప్రాంతాల భౌగోళిక పరిస్థి తులకు అనుగుణంగా స్ప్రే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం >>2

## తిరుమల సమాచారం



## బంగారుదేవుడి కంఠాన అలరించనున్న ఏడు పతకాలు

**● రూ.94.80లక్షలు విలువైన బంగారు పతకాలు విరాళం**

**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో భక్తులు, దాతలు తమవంతుగా విరాళాలందిస్తుండటం పరిపాటి. బెంగళూరుకు చెందిన టిటిడి మాజీ సభ్యుడు శశిధర్ సతీమణి డాక్టర్ ఎం.మహదేవమ్మ శుక్రవారం 753 గ్రాములున్న రూ.94.80 లక్షలు విలువైన 7బంగారు పతకాలను తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి విరాళంగా అందించారు. దాత శ్రీవారి ఆలయంలోపల రంగనాయకుల మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి బంగారు పతకాలను అందజేశారు. ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఉన్నారు. కాగా ఇప్పటికే బంగారుదేవుడు తిరుమలేశుడికి దాదాపు 11 టన్నుల ఆభరణాల చెంతకు మరో ఏడు పతకాలు జత కలిశాయి. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రాజుల కాలంలో సమర్పించిన కానుకలు ఉన్నాయి. వాటిని విశేష పర్వదినాల్లో అలంకరణ చేస్తున్నారు.



## భక్తజనసంద్రంగా తిరుమల

**● సర్వదర్శనానికి 26గంటలుపైగానే**

**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులు మొదలవడం... దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు సెలవులు రావడంతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారాయి. వారాంతం శుక్రవారం ఉదయానికే తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడు కిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 26గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. ఈ రద్దీ ఇలాగే జులై 15వరకు కొనసాగుతుందని టిటిడి వర్గాల అంచనా. కాగా నేడు టిటిడి బోర్డు సమావేశం కానుంది. ఈ సమావేశంలో వేసవిసెలవుల్లో సామాన్యభక్తులకు దర్శనాలు, సౌకర్యాలు కల్పన, విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు, లడ్డూల తయారీ వంటి అంశాలపై చర్చించనున్నారు. శుక్రవారం సాయంత్రానికి 43వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా మరో 20వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. సాధారణంగా శని, ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. అయితే వేసవి సెలవులు కూడా కావడంతో కిటకిటలాడుతోంది.

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.20 లక్షలు




**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు తమవంతగా విరాళాలందిస్తున్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ గీతిక సాయి వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,01,116 లక్షలు విరాళంగా అందించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన ఎసిఎస్ టెక్నాలజీస్ సంస్థ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,01,116 లక్షలు విరాళంగా అందించారు. దాతల తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగ నాయకుల మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి డిడిని అందజేశారు.



## శ్రీవారి దర్శనంతో సకల శుభాలు

**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకోవడంతో సకల శుభాలు కలుగుతాయని ప్రముఖులు విశ్వాసం వెలిబుచ్చారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ అభిజిత్ చంద్రకాంత్ సేథ్ స్వామివారి అభిషేకసేవలో పాల్గొనగా, చిత్ర పరిశ్రమ దర్శకుడు బాబి తదితరులు విఐపి బ్రేక్‌లో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనం, శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నేటి నుండి పద్మావతి పరిణయోత్సవాలు



**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు నేటి నుండి 27 తేదీ వరకు మూడురోజులు తిరుమలలో జరుగ నున్నాయి. నారాయణ గిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు మలయప్పస్వామి గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై నారాయణ ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయ నాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి చేరుతారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం ఘట్టం కన్నుల పండుగగా నిర్వహిస్తారు.

**ఆర్జిత సేవలు రద్దు:** పద్మావతి పరిణయోత్సవాలు సందర్భంగా నేటి నుండి 27వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. ఆనాటి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవ ముహూర్తానికి గుర్తుగా ప్రతి వైశాఖ శుద్ధ దశమినాటికి ముందు ఒక రోజు, తరువాత ఒక రోజు కలిపి మొత్తం మూడురోజుల పాటు పద్మావతీ పరిణయోత్సవాన్ని టిటిడి నిర్వహిస్తోంది.

# వైసిపి ఒక కిల్లర్ పార్టీ

**● వారి ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేయాలి**

**● సుదీర్ఘ రాజకీయ జీవితంలో నేరగాళ్లతో ఏనాడు పోరాడలేదు**

**● టిడిపి కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు కాఫీ కబుర్లు**



టిడిపి కార్యకర్తలతో కాఫీ కబుర్లలో చంద్రబాబు

**విజయవాడ. ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పొలిటికల్ వార్స్ ఎన్నో చేశాను కానీ, నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కీలక వ్యాఖ్యలు చేసారు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి రావడం తనకు కొత్తగానే ఉంది" అని చంద్రబాబు ఆసక్తికర చేశారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ ఇంఛార్జిల శిక్షణా తరగతుల్లో భాగంగా ఏర్పాటు చేసిన కాఫీ కబుర్లు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయాలపై పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. వైసీపీని ఒక కిల్లర్ పార్టీగా అభివర్ణించిన చంద్రబాబు, ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ కౌంటర్ ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు.

ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ, వైసీపీ అధికారంలో లేకపోయినా వారి అరాచకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇటీవల కడపలో జరిగిన దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారం వంటి ఘటనలను ఉదాహరణలుగా చూపించారు. "కడపలో ప్రభుత్వ భూముల పంపకాల్లో తేడాలు రావడంతో సొంత పార్టీ కార్యకర్త దస్తగిరినే హత్య చేశారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ఈ దోపిడీకి పాల్పడ్డారు. వాళ్ల మనుషుల్ని వాళ్లే చంపుకుని, ఆ నేరాన్ని మనపై నెట్టే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి వాటి పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలి" అని చంద్రబాబు హెచ్చరించారు. అదేవిధంగా, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య ఉదంతాన్ని గుర్తుచేస్తూ, ఎమ్మెల్సీ అనంతబాబు సాక్షులను సైతం బెదిరించారని ఆరోపించారు. "రోడ్ల మీదకు వస్తారు, రెచ్చగొడతారు, ప్రజలను ఇబ్బందులు పెడతారు. చర్యలు తీసుకుంటే దాన్ని రాజకీయం అంటారు. అన్యాయం జరిగిందని పరామర్శకు వెళ్లి, సొంత కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపుతారు. కానీ తన కారు కింద పడిన కార్యకర్తను మాత్రం పరామర్శించరు. ఇలాంటి పార్టీని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2019- 24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తుచేయాలని, అదే సమయంలో ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను, వాటి అమలులో పడుతున్న కష్టాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. "నన్ను అరెస్టు చేసినా, పార్టీని ఎన్ని ఇబ్బందులు పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నాను. టిడిపిలో కార్యకర్తలే అధినేతలు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతాం. రైట్ రాయల్‌గా బతకాలి. పార్టీ ఇచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని మీరు ఎదగాలి" అని ఆయన పిలుపునిచ్చారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలకు మంచి చేస్తే వారే మనల్ని గుర్తుంచుకుంటారని చంద్రబాబు హితవు పలికారు.

# పెట్రోల్, డీజిల్ కొరత

**● బంకుల ముందు నో స్టాక్ బోర్డులు ● కృత్రిమ కొరత ఒక కారణమే**

**● ఆయిల్ కంపెనీల సరఫరా తక్కువే ● రబీ కోతల సమయంలో యంత్రాలు నిలిచిపోవడం ● రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు**



**కర్నూలు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పెట్రోల్ డీజిల్ కొరత తీవ్ర ప్రభావం చూపుతోంది. వాహన దారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కారణం ఏమిటి అనే విషయంపై పూర్తి స్పష్టత లేదు. ఆయిల్ కంపెనీలు పూర్తిస్థాయిలో సరఫరా చేయడం లేదని పెట్రోల్ బంకుల యజమానులు అంటున్నారు. బ్లాక్లో అమ్ముకునేది కుట్ర పన్నుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా పరిస్థితి రెండు రోజుల్లో చక్కబడు తుందని అధికారులు చెబుతున్నారు. మరి ఈ పెట్రోల్ డీజిల్ కొరత సమస్యకు యుద్ధం కారణం కాదా.. అనే ప్రశ్న కూడా వినిపిస్తుంది. ప్రస్తుత పరిస్థితులు ప్రారంభమేనని కాలక్రమంగా ఈ కొరత తీవ్రమవుతుందా అన్న అను మానాలు ప్రజల్లో నెలకొన్నాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చి వ్యవసాయ రంగంతో పాటు రవాణా వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రబీ సీజన్‌లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న ఈ సమయంలో డీజిల్ లభించకపోవడం రైతులకు పెద్ద సవాలుగా మారింది. వరి కోత యంత్రాలు నిలిచిపోవడంతో కోతలు ఆలస్యమవుతున్నాయి. సాధారణంగా 10 ఎకరాల వరి కోయడానికి యంత్రం 10 నుంచి 15 గంటలు పనిచేయాల్సి ఉండగా, రోజుకు 100 నుంచి 160 లీటర్ల డీజిల్ అవసరం అవుతుంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో సరిపడా డీజిల్ స్టాక్ లేకపోవడంతో యంత్రాలు షెడ్లకే పరిమితమవుతున్నాయి. కొన్ని బంకుల్లో పరిమితంగా సరఫరా ఉన్నప్పటికీ ఒక్కొక్కరికి 50 లీటర్లకు మించి ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. ఇక రవాణా రంగంలో కూడా ఈ కొరత ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. నగరాలు, పట్టణాల్లోని అనేక బంకుల్లో "నో స్టాక్" బోర్డులు కనిపిస్తున్నాయి. స్టాక్ ఉన్న కొన్ని బంకుల వద్ద వాహనదారులు భారీగా బారులు తీరుతున్నారు. గంటల తరబడి వేచి చూసినా ఇంధనం దొరకక నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసి) వంటి చమురు సంస్థలు గతంలో ఒక్కో బంకుకు పూర్తి ట్యాంకర్ సరఫరా చేయగా, ప్రస్తుతం 4 వేల లీటర్ల ట్యాంకర్‌ను నాలుగు బంకులకు పంచుతున్నట్లు బంకు యజమానులు వెల్లడిస్తున్నారు. అంతేకాకుండా గతంలో అమలులో ఉన్న వారం రోజుల క్రెడిట్ సౌకర్యాన్ని నిలిపివేసి, కేవలం నగదు చెల్లింపులకే సరఫరా పరిమితం చేయడం వల్ల చిన్న బంకుల యజమానులు ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంకు యజమానులు రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశమై సమస్యలను వివరించారు. సరఫరా సక్రమంగా లేకపోవడం, డిమాండ్ ఒక్కసారిగా పెరగడం ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల అనంతరం డీజిల్ ధరలు పెరుగుతాయనే వదంతులు వ్యాపించడంతో ప్రజలు ముందస్తుగా ఇంధనం నిల్వ చేసుకునేందుకు పరుగులు పెట్టడం కూడా కొరతకు ఒక కారణంగా భావిస్తున్నారు. దీంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగి సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరిగింది.

కొంతమంది బంకు యజమానులు డీజిల్ నిల్వ ఉంచుకుని విక్రయించకుండా బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని సరఫరాను పెంచి, బంకుల్లో సమృద్ధిగా ఇంధనం అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే వ్యవసాయ పనులు, రవాణా సేవలు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వివరణ:** పెట్రోల్ డీజిల్ కొరతపై డిఎస్ఒ రాజా రఘువీర్ ను ప్రభాతవార్త వివరణ కోరగా.. ఆయిల్ కంపెనీల సరఫరాలో కొంత ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఆ విషయాలపై రాష్ట్రస్థాయిలో వ్యాపారులకు ఆయిల్ కంపెనీల యజమాలతో అధికారులు చర్చలు జరిపారన్నారు. ఒకటి రెండు రోజులలో పరిస్థితి చక్కబడుతుందన్నారు ఎప్పటిలాగే పెట్రోల్ డీజిల్ అందుబాటులోకి వస్తాయని రాజా రఘువీర్ వివరణ ఇచ్చారు.

## ఘనంగా సత్యసాయి ఆరాధన మహోత్సవం



**పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ప్రపంచానికి నిస్వార్థమైన సేవనందించిన భగవాన్ సత్యసాయి బాబా 15వ ఆరాధన మహోత్సవం శుక్రవారం శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ప్రశాంతి నిలయంలో పంచరత్న కృతి అను అద్భుతమైన సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో 45 వేల మందికి పైగా సాయి భక్తులకు మహా నారాయణ సేవ ద్వారా అన్నదానము, వస్త్రదానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, సత్యసాయి చూపిన బాటలోని ట్రస్ట్ ఎప్పుడు పనిచేస్తుందని, అన్ని సేవలను కొనసాగిస్తుందని పేర్కొన్నారు. తిరిగి సాయంత్రం ప్రముఖ గాయకులైన కిరణ్, విని బృందం అద్భుతమైన సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, నాగానంద్, జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్యా, ఆంధ్ర అధ్యక్షుడు లక్ష్మణరావు వందలాదిమంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

# స్వయం ఆధార్‌కార్డు భక్తులకు రెండు లడ్డూలు



**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్యాస్ ప్రభావం టిటిడిపై మెల్లగా చూపుతోంది. ఇప్పటికే తిరుమల లడ్డూ ప్రసాదాల తయారీకి సంబంధించి కొంత తక్కువమేరకు తయారవుతున్నట్లు టిటిడి వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో లడ్డూ వితరణ శాల వద్ద ఆదివారం భక్తులు స్వయంగా వస్తే వారి ఆధార్‌కార్డు ఆధారంగా కేవలం రెండు లడ్డూలు మాత్రమే అందుకోవచ్చని వెల్లడి. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత భక్తులు అంతటిపవిత్రంగా భావించే దేవుని ప్రసాదం లడ్డూలకు కొన్ని ఇబ్బందులు పడాల్సి వస్తోందనేది భక్తుల్లో అసహనం. దేవుని దర్శనం చేసుకున్న ప్రతి భక్తునికి ఒక లడ్డూ ఉచితంగా అందిస్తున్నారు. ఇలా ఒక కుటుంబంలో ఐదారుమంది వస్తే ఐదు లడ్డూల వరకు ఉచితంగానే అందుకుంటున్నారు. ఇంకా అదనంగా లడ్డూలు కావాల్సిన భక్తులు ఎటువంటి ఆధారాలు లేకుంటే అదనపు లడ్డూలు పొందడం కష్టమైంది. ఆధార్‌కార్డు ఆధారంగా ఒక భక్తునికి 2లడ్డూలు 100 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఇలా ఒక భక్తుడు 5,10లడ్డూలు పొందాలంటే మాత్రం అవకాశం లేకపోతోందని కొందరు భక్తులు అసహనం చెందుతున్నారు. దేవుని లడ్డూల నాణ్యత పెరగడంతో 50 రూపాయలు "ప్రోక్తం(సాధారణ) లడ్డు"ల కోసం భక్తులు ఆసక్తిచూపుతున్నారు. ఒక్కోభక్తుడు కనీసం ఐదునుండి 10లడ్డూలు తమవెంట తీసుకునేందుకు చూస్తున్నాడు. అయితే ఇప్పటికీ లడ్డూ వితరణశాల వద్ద ఆ అవకాశం లేకపోతోంది. రోజుకు సరాసరి 80వేలమంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటుండగా 80వేల లడ్డూలు ఉచితంగా అందిస్తే మరో 3లక్షల వరకు లడ్డూలు విక్రయాలకు ఉంటున్నాయి. ఒక్కో భక్తుడు కనీసం నాలుగు నుండి ఐదు లడ్డూలు కొనుగోలుచేసినా 4లక్షల వరకు లడ్డూలు అవసరమవుతున్నాయి. 3.50లక్షల వరకు మాత్రమే లడ్డూలు తయారవుతున్నట్లు ఆలయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో రద్దీ సమయాల్లో భక్తులు అదనపు లడ్డూలకోసం మాత్రం తంటాలుపడుతున్నారు. లడ్డూకౌంటర్లలో సిబ్బంది కూడా భక్తులు కోరిన లడ్డూలు విక్రయించే పరిస్థితి లేదు. లడ్డూలు సులభంగా పొందడానికి కియోస్క్‌లు ఏర్పాటు చేసినా మూడు యంత్రాలు పనిచేయడం లేదు. శ్రీవారి ప్రసాదాల్లో లడ్డూకు ప్రాధాన్యత ఉంది. లడ్డూల తయారీలో అధికమొత్తంలో నెయ్యి, సారపప్పు, ముంతమామిడి, ఎండుద్రాక్ష, యాలకులు, కుంకుమపువ్వుతో తయారు చేస్తుండటంతో మరింత రుచిగా ఉన్నాయని భక్తులు చెబుతున్నారు. వరుసగా వేసవి సెలవులు రావడం, వారాంతం కావడంతో భారీగా భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. దేవదేవుని దర్శనం చేసుకుని కోరినన్ని లడ్డూలు అందుకోవాలని చూస్తున్నారు.

## సేవకుల పనితీరుకు రేటింగ్

**● కేంద్రీకృత గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు**

**● టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**



**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులకు ఇతోధికంగా సేవలందిస్తున్న శ్రీవారి సేవకుల పనితీరుకు సమర్థత ఆధారంగా రేటింగ్ చేసే విధానం పారదర్శకంగా అమలు చేయాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. సేవకుల ఫిర్యాదుల పరిష్కారం కోసం కేంద్రీకృత గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి ప్రత్యేక ఫిర్యాదు నంబర్ ద్వారా తక్షణ పరిష్కార వ్యవస్థ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

శ్రీవారి సేవ కార్యకలాపాలపై అదనపు ఇఒ వెంకయ్య చౌదరి శుక్రవారం సాయంత్రం తిరుమల పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశం మందిరంలో సమీక్ష నిర్వహించారు. శ్రీవారి సేవకులకు సేవల కేటాయింపు, భక్తులకు సేవలు అందించే విధానంపై ముందస్తు శిక్షణ, సంబంధిత విభాగాల సిబ్బంది సేవకులతో నడుచుకోవాల్సిన విధానం, సేవకుల నుండి ఫిర్యాదులు అందితే తక్షణ పరిష్కారం వంటి అంశాలపై సమావేశంలో సమీక్షి ంచారు. శ్రీవారి సేవకుల సేవలు భక్తులకు అందించడంలో భాగంగా సేవ అనంతరం సంబంధిత సేవకుల అభిప్రాయాలను, అనుభవాలను పరిగణలోకి తీసుకుని ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విశ్రాంత సీనియర్ అధికారులను శ్రీవారి సేవ పర్యవేక్షకులుగా వినియోగించే అంశంపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిప్యూటీ ఇఒలులోకనాథం, భాస్కర్, సోమన్నారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రమాకాంత్, పిఆర్వో (ఎఫ్ఎసీ) నీలిమ, ఐటీ డిప్యూటీ జీఎం వెంకటేశ్ నాయుడు పాల్గొన్నారు.

## సిద్దేశ్వరాలయానికి పూర్వ వైభవం

**● చోళుల కాలపు చరిత్రాత్మక ఆలయం అభివృద్ధికి భారీ ప్రణాళికలు: మంత్రి ఆనం సంకల్పం**



**ముత్తుకూరు, (నెల్లూరు), ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** కృష్ణపట్నంలో దేవతలు నిర్మించిన చారిత్రాత్మక సిద్దేశ్వరాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని సంకల్పించామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. వెయ్యేళ్ల క్రితం చోళులు నిర్మించిన ఈ ఆలయాన్ని నెల్లూరు జిల్లాకే తలమానికంగా నిలిచేలా పునర్నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామంలో ఉన్న అత్యంత ప్రాచీన శ్రీ కామాక్షిదేవి సమేత సిద్దేశ్వరాలయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వ పురావస్తుశాఖ చీఫ్ మునిరాజారెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా వేద పండితులు, దేవాదాయశాఖ అధికారులు, స్థానిక నేతలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో కలిసి ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, పునర్నిర్మాణానికి సిద్ధం చేసిన మ్యాపులను కూడా పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాపునర్నిర్మాణానికి చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో మంత్రి సమీక్షించారు. తొలుత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అనంతరం రూ. 35 లక్షలతో ప్రహరీ, రూ.55 లక్షలతో అర్చక వసతి గహం, రూ. 1.05 కోట్లతో కళ్యాణ వేదిక, రూ. 60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి శంకుస్థాపన చేసారు. అనంతరం సమీక్ష సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ వెయ్యేళ్లకు పైగా ఘన చరిత్ర గల ఈ అపురూప ఆలయాన్ని పునర్నిర్మించి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. సంకల్పబలం, కార్యసిద్ధితో పనులు పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు దేవాదాయశాఖలో అనేక సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. అలాగే 706 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.832 కోట్లతో పనులు చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కేంద్ర పురావస్తుశాఖ చీఫ్ మునిరత్నం రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు రాగాల శివకృష్ణ, కృష్ణాపట్నం ఆలయాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, ఈఓ గిరికృష్ణ, మండలాధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, సొసైటీ చైర్మన్ పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఈదూరు రామ్ ప్రతిప్ కుమార్ రెడ్డి, సర్వేపల్లి ఐటిడిపి నాయకులు తిరుమలశెట్టి సతీష్ నాయుడు, స్థానిక నాయకులు కోదండయ్య, రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాలకు బ్రాండ్ అంబాసిడర్ సిఎం చంద్రబాబు

**● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**కోవూరు, (నెల్లూరు), ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపిస్తూ కేవలం 22నెలల పాలనలోనే అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో అమలు చేస్తున్నామన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి. కోవూరు పంచాయతీలోని 17వ మరియు 18వ వార్డుల సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అందరికీ పంచాయతీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వ పాలనలో కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. గత ఐదేళ్ల విధ్వంసకర పాలనలో రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయని, ఆ పరిస్థితులను చక్కదిద్దుతూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఒక్క కోవూరు పంచాయతీలోనే 2 కోట్ల33 లక్షలతో 56 అంతర్గత సిసి రోడ్లు నిర్మించామని క్లీన్ కోవూరు కార్యక్రమంలో భాగంగా బాపన కాలువ సిల్ట్ క్లియరెన్స్ చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాసులు, సురేష్, ఏపీఎం సుబ్బరాజు, సీసీలు మురళి, రాము, పార్టీ నేతలు మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, తాటిపర్తి విజయారెడ్డి, వై. రమణారెడ్డి, సుబ్బానాయుడు, కోదండరామ స్వామి దేవస్థాన నిర్మాణ ధర్మకర్త కాటంరెడ్డి కృష్ణారెడ్డి, కోవూరు నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గాదిరాజు సుధాకర్‌రావు, అశోక్‌కుమార్, మధుసూదన్‌రావు, వై. వెంకటరమణమ్మ, బాల రవి, ఎన్. వెంకట్, ఎం. సుధాకర్, దారా విజయ్‌బాబు, జాన్సన్, వై. మదన్‌రెడ్డి, సాయిరెడ్డి, సాయి జయంత్‌రెడ్డి, గురు మహేష్, వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, అల్తాఫ్, సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

వార్త

జీవితానికి విశ్వాసం పునాదిలా ఉండాలి. విశ్వాసం లేకుండా ఏ పని చేసినా వ్యర్థమే.

- మార్షల్

# చెదరిన 'డాలర్ డ్రీమ్స్'

భారతీయుల 'డాలర్ డ్రీమ్స్' నానాటికీ కరిగిపోతున్నాయి. ఎలాగైనా ఉన్నత చదువుల కోసం అమెరికాకి ఎగిరిపోవాలన్న భారతీయ విద్యార్థులకు అదే ఆశ, అదే శ్వాస, భారతీయ యువతలో ఉన్న విదేశీ ఆకాంక్షలు ప్రత్యేకించి అమెరికా పట్ల ఆకర్షణలను ఎంత సామాజిక, ఆర్థిక కోణాల్లో విశ్లేషించుకున్నా విదేశాలకు వెళ్లిన వారికి వెళ్లినంత సంపద మహదేవా? అని అనుకోవడం కద్దు. భారతదేశంలో ఏమోకానీ అమెరికాలో ఉపాధికి ఎన్నో అవకాశాలుంటాయని ప్రతీతి. అందుకేనేమో అక్కడకు విద్యార్థిగా వెళ్లినవారుఅక్కడే సెటిల్ అయిపోతుంటారు. కన్న తల్లిదండ్రులను ఊర్లోనే వారి కర్మకు వారిని వదిలిపెట్టి అమెరికా వంటి దేశాల్లోనే జీవితాంతం ఉండిపోయేవారి కథలెన్నో మనకు తెలుసు. తమకేదైనా తమ పిల్లలు బాగుగా బతుకుతున్నారు. నాలుగు రాళ్లు వెనకేసుకోగలుగుతున్నారు. పొలం పుట్రా జమ చేసుకుంటున్నారని ఉన్న ఊళ్లోనే కన్ను మూసేద్దాం. అదే తమ జీవనంలో తృప్తినిస్తుందని అనుకునే అమ్మానాన్నలూ ఉన్నారు. వారలా తయారవడానికి కారణం అమెరికా సంపద మీద ఆశ పుట్టడమే. ఎంత చదివినా స్వదేశంలో ఉంటే మనం చదివిన చదువులకు ఎలాగో తగిన జీతం రాదు కనుక విదేశానికి వెళ్లిపోయేవారే ఎక్కువ. ఇన్నాళ్లూ ఇలాంటి అంశాలను తర్కించుకుంటూ భారతీయులు కాలం గడిపేశారు.'అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే'నంటూ గద్దెనెక్కిన శ్వేతసౌధాధినేత డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవి ఎన్నికల్లో 'అమెరికా ఫస్ట్' నినాదంతో గట్టెక్కారనే విషయం అందరికీ తెలిసిందే. నిజానికి 'డాలర్ డ్రీమ్స్' అంటే ఒక్క అమెరికాకు మాత్రమే సంబంధం కాదు. భారతీయులు ఎంతో మంది అమెరికా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా,మలేషియా, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, దక్షిణాఫ్రికా, కువైట్, ఖతార్, ఆస్ట్రేలియా దేశాలకు కూడా ఉన్నత చదువులకు, ఉత్తమ జీవితం గడిపేందుకని వలస వెళ్తున్నారు. కానీ ఒక్క అమెరికా విషయంలోనే భారతీయుల ఆలోచన భిన్నంగా ఉంది. అదొక భూతల స్వర్గమని అక్కడి జీవితం ఎంతో హాయిగా ఉంటుందని భావిస్తుంటారు. ఒకసారి అమెరికా దేశంలో అడుగుపెడితే అంతిమ క్షణాలు కూడా అక్కడే ఉండాలని ఆశిస్తారు. సొంత వూరికి తిరిగి రావడం గగనమే. చదువు,ఉద్యోగం,స్థిరనివాసం భావనలో అమెరికా పైనే అందరి కన్ను ఉంటుంది. అక్కడ వీలుండదని భావిస్తేనే మరోదేశం గురించి ఆలోచించేది. చెప్పాలంటే హైస్కిల్‌డు ప్రొఫెషనల్స్ అంతా అమెరికా వైపు చూస్తుంటారు. కానీ ట్రంప్ మాత్రం భారతీయులు అమెరికన్లకన్నా తెలివైన వారు కనుక వారిలో హైస్కిల్‌డును మాత్రమే ఉంచుకోగలమని తేల్చి చెప్పేశారు. అప్పట్నించీ భారతీయుల్లో గుబులు బయలుదేరింది. ప్రధానంగా తెలుగు వారిలో తాజాగా వాషింగ్టన్ డిసి కేంద్రంగా పనిచేసే కార్నెగీ ఎండోమెంట్ అనే సంస్థ చేసిన సర్వేలో 40 మంది ప్రవాస భారతీయులు అమెరికాను వీడాలనే ఆలోచనలతో ఉన్నట్లు స్పష్టంచేసింది. ఆ సర్వే ఎలాంటి ప్రమాణికతతో చేసినా ఎంత మంది నమూనాలు ఆధారంగా ఫలితాలను విశ్లేషించినా వారినివేదికలో వాస్తవాలే ఉన్నాయి. విదేశాల్లో నిత్యం అసహనం వ్యక్తం చేస్తున్న వారి తల్లిదండ్రులు ఇండియా తదితర దేశాల్లోనేఉన్నారు. వారి అభిప్రాయాలు అడిగినా పై విశ్లేషణకు దగ్గరగానే ఉంటుంది. అమెరికాను వీడి స్వదేశాలకు తరలి వచ్చేద్దామనుకున్న వారిలో పది శాతం మంది తమను స్థానిక పరిస్థితుల కన్నా రాజకీయ కారణాలే ఇబ్బందిపెడ్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా జీవన వ్యయం, వ్యక్తిగత భద్రత విషయంలో వారు ఆందోళనకరంగా ఉన్నారు. ఆదినుంచీ విదేశాల్లో స్థిరపడాలన్న ఆలోచన రావడానికి డాలర్లలో సంపాదన, ఉన్నత జీవన ప్రమాణాలు వంటి అంశాలే ప్రధాన కారణాలు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఇమిగ్రేషన్ విధానాలు మారాయి. హెచ్1బి వీసా పరిమితులు, విదేశీ ఉద్యోగులపై కఠిన నిబంధనలు, అనుసరించని వారిపై తీవ్ర చర్యలు,అమెరికాలో స్థిరపడితే మంచిజీతం, జీవితం లభిస్తుందని ఆశించేవారి ఆశయాలను సవాల్ చేస్తున్నాయి. విదేశీ వలసవాదులకు విధం చెడ్డా ఫలితం దక్కలేదన్న విషయం అవగతమైంది. వారు గ్లోబల్ అవకాశాలను అన్వేషించడంలో తప్పులేదు. కానీ అప్పుడు స్వదేశాన్ని ఇప్పుడు విదేశాన్ని వదిలిపెట్టే ఆలోచనలు కాలానుగుణమే. ఎన్నాళ్లుగానో అమెరికాలో ఉండి గ్రీన్ కార్డు పొందడం కోసం పడిన శ్రమ అంతాఇంతా కాదు. వారిలో కూడా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్నట్లు ఆ నివేదిక చెబుతోంది. దీనికితోడు ట్రంప్ నోట మరి కొన్నిగందరగోళ వాక్యాలు బహిర్గతమవడం కూడా కొంత అసహనం కలిగిస్తోంది. ఇండియా,చైనాలు భూమిపై నరక కూపాలని విమర్శిస్తూ అమెరికన్ వీడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన లేఖను ట్రంప్ తన 'ట్రూత్' సోషల్ ఖాతాలో రీపోస్ట్ చేసి భారతీయులపై తనకున్న దుగ్ధను వెళ్లగక్కారు. ఆసియా దేశాలనుంచి మహిళలు గర్భవతిగా అమెరికాకు వచ్చి జన్మ నిచ్చిన బిడ్డకు పౌరసత్వం ఇచ్చేయాల్సి వస్తోందన్న ఆందోళన ఆయనలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆ వెంటనే తమ కుటుంబాన్ని మొత్తం అమెరికాలో దింపేస్తారు. ఇవీట్రంప్ రీపోస్ట్ నుంచి వచ్చిన ఆయన వాచాలత స్పష్టంగా కనబడుతోంది. 'జన్మతః పౌరసత్వం' పట్ల ఆయన ఆదినుంచీ వ్యతిరేకతలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. పశ్చిమాసియా యుద్ధం ముగిసాక ఆయన చేపట్టే ఘనకార్యం ఏదైనా ఉందా అంటే అది ఈ పౌరసత్వ చట్టానికి 'కొర్రీ'లు పెట్టడమే. ఈ వివాదాస్పదమైన వాగ్ధాషణకు ఆయన మళ్లీ నాలుక్కరుచుకోవడం కొసమెరుపు. ఇలాంటి వ్యక్తి రాజ్యంలో మనగలగడం ఎవరికీ క్షేమమూ కాదు. సంక్షేమమూ ఒనగూరదు. తాజాసర్వేలో తేలిందేమిటంటే భారతీయుల్లో స్వదేశీ మోజు తగ్గుతోందని అర్థం చేసుకోవచ్చు.



చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చేయాలనే కోరిక ఉన్నవాడు ఎక్కువ చేయగలుగుతాడు.

జి.ముర్రే



బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.

జార్జి ఎలియట్

## ప్రజావాక్కు

### జలధార పథకం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన 'జలధార పథకం' నీటి వనరుల సమర్థ వినియోగం, భూగర్భ జలాల పరిరక్షణ దిశగా ఒక వినూత్న ప్రయత్నం. వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జల మట్టాలను పెంచడమే ఈ పథక ప్రధాన లక్ష్యం. దీని కోసం చెక్‌డ్యాంలు, రీచార్జ్ పిట్‌లు, పర్కొలేషన్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. ప్రతి నీటి బిందువును సద్వినియోగం చేస్తూ భవిష్యత్తు నీటి కొరతను అధిగమించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. రైతులకు సాగునీటి భరోసా కల్పించడం ద్వారా పంటల ఉత్పాదకత, ఆదాయం పెరగడానికి ఈ పథకం తోడ్పడుతుంది. ముఖ్యంగా వర్షాభావ ప్రాంతాల్లో ఇది కీలకం కానుంది. కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే కాకుండా,స్థానిక ప్రజలను, రైతులను ఇందులో భాగస్వాములను చేస్తూ నీటిసంరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. జియో మ్యాపింగ్, డేటా విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా వనరుల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతోంది. నిర్మించిన సదుపాయాలనునిరంతరంపర్యవేక్షించడం,ప్రజల్లో చైతన్యాన్ని కొనసాగించడం అత్యవసరం.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### జీవితాన్ని అంచనా వేయలేం

నేటికాలంలో వాతావరణ పరిస్థితులు,ఆరోగ్యపు అలవాట్ల దృష్ట్యా సగటు మానవుడి ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుంది. ఎప్పుడూ ఏం జరుగుతుందో తెలియని దీన పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. చాలా మంది హఠాత్తుగా చనిపోతున్న సందర్భాలెన్నోఉన్నాయి. కావున వీలైనంతవరకు ఆరోగ్యంగాఉంటూ మనవంతుగా పదిమందికి ఆసరాగా ఉందాం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### వయోజన విద్య అవసరం

తెలంగాణారాష్ట్రంలో వయోజన విద్యను ప్రవేశ పెట్టాలి. సమాజంలో వయోజనులకు విద్య ఎంతో అవసరం. మహిళా పొదుపు సంఘం సభ్యులకు, డబ్బులు పొదుపు చేయడం,బ్యాంకులలో జమచేయడం,తీర్మానం పుస్తకాలు రాయడం కోసం విద్యఅవసరం. కనుక మహిళలు, పురుషులకు వేరు వేరుగా రాత్రిపూట బడులను పూర్వ కాలం వలె తిరిగి ప్రారంభం చేయాలి. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం పర్యవేక్షణ అవసరం.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### యధాతథంగా కొనసాగించాలి

తెలుగు భాషా సాంస్కృతిక వికాసాలకు ప్రతీకగా నాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంతోరాజసంతో,కళాత్మక కట్టడంగా హైదరాబాదులో నెలకొల్పిన తెలుగువిశ్వవిద్యాలయం,తెలంగాణ ఏర్పడ్డ తరువాత సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా ఏర్పాటై బాచుపల్లిలో నూతనంగా నిర్మించినకొత్త ప్రాంగణంలోకి కొన్ని శాఖలు, విభాగాలు ఇటీవల మారినా నాంపల్లి ప్రాంగణంలోఇప్పటికీ పలుకోర్సులునిర్వహిస్తున్నారు. అలాగే విశ్వవిద్యాలయ పుస్తక విక్రయకేంద్రం ఇక్కడనే కొనసాగుతోంది. ఆధునీకరించిన ఆడిటోరియం కూడా ఇక్కడే ఉంది. కాగా, ఇటీవల ప్రభుత్వం విశ్వవిద్యాలయ శాఖలు దాని విభాగాలు అన్నీ బాచుపల్లి ప్రాంగణానికి మార్చి నాంపల్లి ప్రాంగణాన్ని పర్యాటక, సాంస్కృతిక శాఖకు అప్పగించాలన్న నిర్ణయం సరికాదు. హైదరాబాదు నడిబొడ్డున ఉన్ననాంపల్లి ప్రాంగణం ఎంతోమంది రాకపోకలకు అనుకూలం. తెలుగు భాష, సాహిత్యం,కళలు,సాంస్కృతిక పరిరక్షణకు కేంద్రంగా నిలిచిన ప్రాంగణాన్ని యథాతథంగా కొనసాగించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### డిప్యుటేషన్‌లను రద్దు చేయాలి

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అన్నిరకాల విభాగాలలో డిప్యుటేషన్‌లను రద్దు చేయాలి. సొంత స్థలానికి పంపాలి. విద్యా సంస్థలలో అదనపు ఉద్యోగులు ఉంటే పరిపాలన అడ్మినిస్ట్రేషన్ పనులను సమర్థవంతంగా పని చేసే విధంగా చూడాలి. 500 మంది కన్నా ఎక్కువ విద్యార్థులు ఉంటే కనీసం ఇద్దరు అదనపు టీచింగ్ స్టాఫ్ ఉండే విధంగా చూడాలి. అందుకే డిప్యుటేషన్‌లు రద్దు చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

### సైబర్ నేరాలను అరికట్టాలి

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రజలు తమ కష్టార్జితాన్ని పొదుపు రూపంలో దాచుకుంటారు. అయితే సైబర్ నేరగాళ్లు ప్రజలకు తెలియకుండానే ఈ సొమ్మును దొంగిలిస్తున్నారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులు పోలీసులకు, బ్యాంకులకు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా అవి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం ఆందోళనకలిగించే విషయం. బ్యాంకులు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తూ, పోగొట్టుకున్న లేదా స్తంభింపజేసిన సొమ్మును తిరిగి పొందడం కేవలం సైబర్ సెక్యూరిటీ సిబ్బంది ద్వారానే సాధ్యమని చెబుతున్నాయి.

- కె.రామారావు, నల్గొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# నిరాశానిస్పృహాల్లో యువజనం!

**చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకొని దుర్భర పరిస్థితుల్లో కొట్టుకమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ కూలీకి వెళ్లలేక, ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటు లేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒకస్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏ ఆధారం లేక నిరుత్సాహంగా, అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు.**

దామెర్ల సాయిబాబ

చేయబోయే పనిని గురించి తెలుసుకోవడం వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం. పూర్తి చేయడం సామర్థ్యం. ఈ మూడింటిలోనూ సాఫల్యం చెందితేనే పరిపూర్ణత లభిస్తుంది. అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతారు. దేశంలో కోట్లాది మంది యువతీ యువకులు నిరాశానిస్పృహలతో నీరసించిపోతున్నారనేది పెద్దలకు తెలియందికాదు. వారిలో ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి కార్యోన్ముఖున్ని చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి పెద్దలకు క్షుణ్ణంగా తెలుసు. కానీ ఆ వైపు త్రికరణ శుద్ధిగా అడుగులు పడడం లేదేమోననిపిస్తున్నది. రాజకీయ నాయకులు రాబోయే ఎన్నికల గురించే ఆలోచిస్తే, రాజనీతిజ్ఞులు భావితరాల భవిష్యత్ గురించి మదనపడుతుంటారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించారు. కానీ మారిన కాలానుగుణ పరిస్థితుల దృష్ట్యా ప్రధానంగా విద్యావిధానంలో మార్పు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంగా తెలిసినా, ఆ కోణంలో చర్యలు చేపట్టలేకపోతున్నారు. చాలా మంది విషయంలో చదువే చదువుకు జీవనోపాధికి సంబంధం లేకుండాపోతున్నది. ఈ పరిస్థితి రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఎన్నో యేళ్లు కష్టపడి ఇంజినీరింగ్ విద్య అభ్యసించిన ఎందరో నిరుద్యోగులుహోంగార్డు పోలీసు ఉద్యోగాలకు వెళ్తున్నారు. ఏదో ఒకరిద్దరు కాదు, వేల సంఖ్యలో ఈనియామకాలకు హాజరవుతున్నారు. పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు కూడా చిన్నచిన్న ఉద్యోగాలకు క్యూ కడుతున్నారు. అంతేకాదు చిన్న చిన్న తాత్కాలిక ఉద్యోగాల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసేందుకు కూడా సిద్ధమవుతున్నారు. దళారుల చేతుల్లో మోసపోయినవారెందరో ఉన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక బంగారు కొలువుగా మారిపోయింది. ఆ ఉద్యోగంలో చేరితే ఆ కుటుంబానికి ఆర్థిక, ఆరోగ్య, ఆర్థికసెక్యూరిటీ లభిస్తాయని ఆశలు పెరిగిపోయాయి. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల నియామకాలకు సంబంధించి ప్రకటనలు ఇస్తూనే ఉన్నాయి. కొంత మేరకు నియామకాలు కూడా జరుగుతున్నాయి. ఈ ఉద్యోగాల కోసం గ్రామాల్లోని యువత పట్టణాలకు చేరుకొని కోచింగ్ సెంటర్ల బాటపడుతున్నారు. వేలాది రూపాయలు వ్యయం చేస్తున్నారు. దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొన్ని కోచింగ్ సెంటర్లు తమ శక్తి కొలదీ ప్రయత్నాలు చేస్తున్నాయి. పరీక్షలు ఆలస్యమయ్యే కొద్దీ ఈ కోచింగ్ సెంటర్లకు అంతగా లక్ష్మీప్రసన్నం అవుతుంది. ఉన్నత విద్య, అత్యున్నత నైపుణ్యం కలిగిన వారు ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సంపాదించుకొని కళ్లు చెదిరే జీతాలు అందుకుంటుంటే అదే చదువులు చదివి నైపుణ్యత లేని యువకులు చాలీచాలని జీతాలతో ఎదుగూబొదుగూ లేని ఉద్యోగాలతో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న స్విగ్గీ, బిగ్‌బాస్కెట్, జొమోటో, అమెజాన్ తదితర యాప్ ఆధారిత సర్వీస్ రంగంలో లక్షల సంఖ్యలో దేశవ్యాప్తంగా యువతీయువకులు పనిచేస్తున్నారు. నిర్ణీత పనిగంటలు లేని ఉద్యోగాలవి. అర్థరాత్రి కూడా పనిచేయాలి. వీరి జీవితాలకు భద్రత లేదు. ఎంత పనిచేస్తే అంత ఆదాయం అనేఆకర్షణ చూపి వీరిని ఉద్యోగాల్లోకిదింపుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం మాయాజాలంతో పనిచేసే కొద్దీ ఆదాయం తగ్గిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చెప్పిన సమయానికి డెలివరీ ఇవ్వాలంటే ట్రాఫిక్ అధికంగా రోడ్లల్లో కూడా మితిమీరిన వేగంతో తమ వాహనాలను పరుగెత్తించాలి. ప్రాణాలకు ముప్పు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. మరొకపక్క పోలీసు ఛాలాన్లు కూడా చెల్లించాల్సి వస్తున్నది. డెలివరీ ఇచ్చే ఇళ్లకు వెళ్లినప్పుడు కనీస మర్యాదలు కూడా లభించడం లేదు. వీరిపట్ల కొందరు అమర్యాదకరంగా కఠినంగా ప్రవర్తిస్తున్నారు. అయినా ఏమీ చేయలేని నిస్సహాయస్థితి. ఇలా చెప్పుకోలేని, చెప్పలేని బాధలెన్నో వారు అనుభవిస్తున్నారు. ఇంకొక పక్క ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా, దళారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ఈ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నంచేస్తున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు దళారులు ఏదో ఒక రూపంలో ఎక్కడో ఒక చోట చొచ్చుకుపోయేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. తెలంగాణలోనే కాదు అనేక రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాల వ్యాపారం జోరుగా జరుగుతున్నట్లు వెలుగు చూస్తున్న సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. ఇక దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే ప్రభుత్వాల పరిధిలోని పది, పన్నెండు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. కోట్లాది మంది యువతీ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడమనేది సాధ్యమయ్యే పనికాదు. అలా కోరుకోవడం కూడా ఏమాత్రం సమంజసం కాదు. యువత భవిష్యత్ గురించి పెద్దపెద్ద ప్రకటనలు ఇచ్చే నేతలు ఆచరణలో మొండిచూపు చూస్తున్నారు. యువజనశక్తులే దేశాభివృద్ధికి బాటలు అంటూ ఉపన్యాసాలు ఇస్తూ దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయలు యువజన సంక్షేమంకోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా యువజనంలో రోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. నిరక్షరాస్యులైన యువకులే కాదు ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. దేశప్రగతికి పట్టుకొమ్మలైె గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువత పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. చదివిన చదువుకు తగినట్టుగా ఉపాధి దొరక్కపోయినా జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకొని దుర్భర పరిస్థితుల్లో కొట్టుకమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్‌తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసి గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ కూలీకి వెళ్లలేక,ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో విధిలేక వెళ్లినా అలవాటు లేని కష్టం చేయలేక దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. పనిచేసే శక్తిఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలన్న ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒకస్థానం కల్పించుకోవాలన్న తపన ఉంది. కానీ ఏ ఆధారం లేక నిరుత్సాహంగా, అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు. ఇకపోతే మెడికల్ ఇంజినీరింగ్‌లో అత్యంత ప్రతిభావంతులైన మెరికల్లాంటి యువతీయువకులు ఇప్పటివరకు విదేశాలకు వెళ్లిపోయి తమ విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకొని అక్కడే సేవలు అందిస్తున్నారు. అయితే ఇప్పుడు వారి పరిస్థితి కూడా అయోమయంగా మారిపోయింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత స్థానికులకే ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలంటూ గళమెత్తారు. ఒక దశలో విదేశీ విద్యార్థులను ఉద్యోగాల్లో నియమించుకోవద్దని బహిరంగంగానే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీనికితోడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రవేశంతో అవకాశాలు బాగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే ఎంతో మంది అమెరికా నుండి భారత్‌కు వచ్చేస్తున్నారు. అక్రమ వలసదారుల పేరుతో అమర్యాదకరంగా వారిని స్వదేశాలకు తరలిస్తున్నారు. ఇటీవల జరుగుతున్న ఇరాన్,అమెరికా యుద్ధ ప్రభావంతో పశ్చిమాసియా దేశాల నుండి విదేశీయులు తమతమ దేశాలకు తరలిపోయారు. ఆస్ట్రేలియాలో పరిస్థితి కూడా ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. భారత సంతతికి సంబంధించిన యువకుడిని మొన్న హత్య చేయగా, దేశం నుంచి వెళ్లిపోవాలంటూ పోస్టర్లు పెడుతున్నారు. యుద్ధాలతో అతలాకుతలమవుతున్న ఆయా దేశం నుంచి ఉద్యోగస్తులనే కాదు, విద్యార్థులను సైతం పంపిస్తున్నారు. పాలకులకు ఈ విషయాలన్నీ తెలియనివి కావు. అయినా చర్యలు తీసుకునే సాహసం చేయలేకపోతున్నారు. అందుకు రాజకీయ కారణాలు ఎన్నో ఉన్నాయి. ఇదంతా లేత మనసులకు చెరగని ముద్ర వేస్తున్నది. సమాజంపై ప్రేమ, అభిమానం ఉన్న యువకులే పగ, ద్వేషంతో రగలిపోతున్నారు. మరి కొందరు నిస్సహాయక స్థితిలో ఏకంగా జీవనోపాధి దొరకదనే నిస్పృహతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలు రాసి బలవంతపు మరణాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు కళ్లు తెరవాలి. యువతీయువకుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. ఇందుకు ముఖ్యంగా పాలకుల వైఖరిలో మార్పు రావాలి. యువతీయువకులు సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగాల నియామకాల్లో త్రికరణశుద్ధిగా అవినీతికి ఆస్కారం లేకుండా వ్యవహరించగలిగితే కొంత మేరకైనా లక్ష్యాన్ని సాధించే అవకాశాలు ఉన్నాయి. •

## ఒక్క మాట

# సంక్షోభ పరిష్కారానికి గాంధీ సిద్ధాంతాలే కీలకం

సిహెచ్ వి ప్రభాకర్ రావు

ప్రస్తుతం భారతదేశం ఒక కీలక మలుపులో ఉంది. ఒక వైపు వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ విప్లవం, గ్లోబల్ స్థాయిలో పెరుగుతున్న గుర్తింపు, మరో వైపు నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, రాజకీయ విభజనలు, సామాజిక అసహనం. ఈ విరుద్ధ పరిస్థితుల్లో మహాత్మాగాంధీ ఆలోచనలు కేవలం చరిత్ర కాదు ప్రస్తుతం అవసరమైన దిశానిర్దేశం. ఇటీవలి సంవత్సరాల్లో దేశఆర్థిక వృద్ధి శాతం పెరిగినా, 'జాబ్స్ గ్రోత్' అనే సమస్య స్పష్టంగా కనిపిస్తోంది. పెద్దపెద్ద ప్రాజెక్టులు, కార్పొరేట్ పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ, సాధారణ యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయి. స్టార్టప్లు, గిగ్ ఎకానమీ వంటి కొత్త రంగాలు వచ్చినా, అవి ఎక్కువగా అస్థిర ఉపాధినే కల్పిస్తున్నాయి. గాంధీజీ ప్రతిపాదించిన 'గ్రామ స్వరాజ్యం' ఇక్కడ కీలకంగా మారుతుంది. గ్రామ స్థాయిలో చిన్న పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలు, స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తే ఉపాధి విస్తరణ సాధ్యమవుతుంది. 'లోకల్ ఫర్ వోకల్' వంటి నినాదాలు గాంధీ ఆలోచనలకు సమకాలీన రూపం మాత్రమే. సమకాలీన ఆర్థిక వ్యవస్థలో ధనిక, పేద, మధ్య అంతరం విపరీతంగా పెరుగుతోంది. కొద్దిమంది చేతుల్లో సంపద కేంద్రీకృతమవుతుండగా, పెద్ద జనాభా జీవన ప్రమాణాలు మెరుగుపడటం లేదు. గాంధీజీ ట్రస్టీషిప్ సిద్ధాంతం ఈ సమస్యకు ప్రత్యామ్నాయం చూపుతుంది. సంపదను వ్యక్తిగత స్వార్థం కోసంకాకుండా సమాజ ప్రయోజనాలకు ఉపయోగించాలనే భావనను కార్పొరేట్ ప్రపంచం స్వీకరించాలి. సిఎస్ఆర్ కార్యక్రమాలు, సామాజిక బాధ్యత భావన ఇవి గాంధీ ఆలోచనల ఆధునిక రూపాలు కావచ్చు. రాజకీయ ధోరణులు,విభజన నుంచి ధృవీకరణ వరకు ప్రస్తుత రాజకీయాల్లో మతం, కులం, ప్రాంతం ఆధారంగా విభజన పెరుగుతోంది. సోషల్ మీడియా ప్రభావంతోతప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతూ,ప్రజల మధ్య అనుమానాలు, ద్వేషం పెరుగుతున్నాయి. ఎన్నికల రాజకీయాలు ఎక్కువగా భావోద్వేగాలపై నడుస్తున్నాయి. గాంధీజీ సర్వమత సమానత్వం, సత్యం ఆధారిత రాజకీయాలు ఈ పరిస్థితిలో అత్యవసరం. రాజకీయ నాయకత్వం ప్రజలను కలిపే దిశగా ఉండాలి. కానీ విభజించే దిశగా కాదు. ప్రజాస్వామ్యం బలపడాలంటే నైతిక విలువలు రాజకీయాల్లో తిరిగి స్థిరపడాలి. నేటి యువతకు అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, దిశానిర్దేశం లోపిస్తోంది. సమకాలీన అభివృద్ధి పట్టణాలకు మాత్రమే కేంద్రీకృతమవుతోంది. గ్రామాలుఇంకా మౌలిక సదుపాయాల కొరతతో బాధపడుతున్నాయి. ఫలితంగా వలసలు పెరుగుతున్నాయి, పట్టణాల్లో ఒత్తిడి పెరుగుతోంది. గాంధీజీ గ్రామ స్వరాజ్యం భావనను ఆధునిక సాంకేతికతతో కలిపి అమలుచేస్తే, గ్రామాలు కూడా అభివృద్ధి చెందవచ్చు. డిజిటల్ కనెక్టివిటీ, గ్రామీణపరిశ్రమలు, వ్యవసాయ ఆధునికీకరణ. ఇవి గ్రామాభివృద్ధికి దోహదం చేస్తాయి. గ్లోబల్ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక అస్థిరత, పర్యావరణ సంక్షోభాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గాంధీజీ అహింసా సిద్ధాంతం మరింత ప్రాముఖ్యత పొందుతోంది. ఆయుధపోటీకి బదులుగాశాంతి, సంభాషణ మార్గం అనుసరించాల్సిన అవసరం ఉంది. సమకాలీన రాజకీయ ఆర్థికపరిస్థితుల్లో గాంధీజీ ఆలోచనలు కేవలం ఆదర్శాలు కాదు, ఆచరణలో పెట్టాల్సిన అవసరాలు. ఉపాధి సంక్షోభం,అసమానతలు, రాజకీయ విభజనలు, యువతలో నిరాశ ఈ సమస్యలకు గాంధీ సిద్ధాంతాలు సమగ్ర పరిష్కారం చూపగలవు. భారతదేశం నిజమైన అభివృద్ధి సాధించాలంటే,కేవలం ఆర్థికవృద్ధి కాకుండా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అవసరం. •

# డీలిమిటేషన్ ఒక కీలక రాజ్యాంగ ప్రక్రియ

మేకిరి దామోదర్

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో డీలిమిటేషన్ ఒక కీలక రాజ్యాంగ ప్రక్రియ. నియోజకవర్గాల సరిహద్దులను జనాభా ఆధారంగా పునర్విభజించడం ద్వారా ప్రతి పౌరుడికి సమాన ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఇది అమల్లోకి వచ్చింది. సిద్ధాంతంగా చూస్తే ఇది సమానత్వానికి ప్రతీక. కానీ ఆచరణలో ఇది రాజకీయ ప్రయోజనాలకు వేదికగా మారే అవకాశమూ అంతే బలంగా ఉంది. 1971 జనాభా లెక్కల ఆధారంగా 2026 వరకు డీలిమిటేషన్‌ను నిలిపివేయడం వెనుక ఒక స్పష్టమైన ఆలోచన ఉంది. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు నష్టపోకుండా చూడటం, సమతుల్యతను కాపాడటం. అంటే ఇది కేవలం సాంకేతిక నిర్ణయం కాదు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమన్వయానికి సంబంధించినది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. జనాభా పెరుగుదలలో ప్రాంతాల మధ్య తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ మళ్లీ ప్రారంభమైతే, అది సమాన ప్రతినిధిత్వాన్ని కల్పించాలనే లక్ష్యాన్ని సాధిస్తుందా? లేకపోతే జనాభా ఆధారంగా కొన్ని రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యం కల్పించి, మరికొన్ని రాష్ట్రాలను బలహీనపరుస్తుందా? అనే ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. ఇక్కడే ఇది రాజకీయ ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. సీట్ల సంఖ్య పెంపు, తగ్గింపుల వెనుక రాజకీయ లెక్కలు దాగి ఉంటే, అది ప్రజాస్వామ్యాన్ని వక్రీకరించే దిశగా తీసుకెళ్తుంది. కాబట్టి డీలిమిటేషన్‌ను కేవలం సంఖ్యల వ్యాయామంగా కాకుండా, న్యాయపరమైన సమతుల్యతను కాపాడే ప్రక్రియగా చూడాల్సిన అవసరం ఉంది. డీలిమిటేషన్ చర్చల్లో అత్యంత కీలక అంశం దక్షిణ భారతదేశానికి కలిగే ప్రభావం. దక్షిణ రాష్ట్రాలు విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, కుటుంబ నియంత్రణ వంటి రంగాల్లో దేశానికి మార్గదర్శకంగా నిలిచాయి. జనాభా నియంత్రణలో సాధించిన విజయాలు, ఆర్థికంగా దేశానికి చేస్తున్న కృషి ఇవన్నీ ఈ ప్రాంతాల బలాన్ని చూపిస్తున్నాయి. అయితే, కొత్త డీలిమిటేషన్ ప్రక్రియలో జనాభానే ప్రధాన ప్రమాణంగా తీసుకుంటే, ఈ రాష్ట్రాలు నష్టపోయే అవకాశం ఉంది. ఎందుకంటే జనాభా నియంత్రణలో విజయంసాధించిన కారణంగా వారి సీట్ల సంఖ్య పెరగకపోవచ్చు, లేదా తక్కువ ప్రాతినిధ్యం దక్కవచ్చు. మరోవైపు జనాభా వేగంగా పెరిగిన రాష్ట్రాలకు అధిక సీట్లు లభిస్తాయి. ఇది ఒక విరోధ కుట్ర పూర్తి చర్య. అభివృద్ధి సాధించిన రాష్ట్రాలు శిక్షించబడుతున్నట్లే కనిపిస్తోంది. జనాభా పెంచితే ప్రోత్సాహం నియంత్రిస్తే తగ్గింపు' అనే సందేశం సమాజానికి వెళ్తే, అది దేశ అభివృద్ధి లక్ష్యాలను దెబ్బతీస్తుంది. కుటుంబ నియంత్రణ, విద్య, ఆరోగ్య రంగాల్లో చేసిన కృషికి ఇది ముమ్మాటికి ప్రతికూల సంకేతం. దీంతో పాటు రాజకీయ ప్రభావం కూడా గణనీయంగా మారుతుంది. పార్లమెంట్‌లో




దక్షిణాది రాష్ట్రాల స్వరం బలహీనపడే అవకాశం ఉంది. కేంద్ర విధానాలపై ప్రభావం తగ్గిపోవచ్చు. ఇది సమాఖ్య సూత్రానికి విరుద్ధంగా మారే ప్రమాదం ఉంది. అందుకే డీలిమిటేషన్ ప్రక్రియలో కేవలం జనాభానే కాకుండా, అభివృద్ధి సూచికలు, ఆర్థిక సహకారం, సామాజిక పురోగతి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవల మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ మధ్య సంబంధం ఉన్నట్లు చూపించే రాజకీయ ప్రచారం కూడా చర్చకు దారితీసింది. మహిళలకు పార్లమెంట్‌లో రిజర్వేషన్ కల్పించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం. ఇది సమానత్వానికి దారితీసే ముఖ్యమైన అడుగు. కానీ ఈ బిల్లును డీలిమిటేషన్‌తో అనుసంధానం చేసి, ఒకటి జరగకపోతే మరొకటి అమలు కాదనే అభిప్రాయం సృష్టించడం ప్రజల్లో గందరగోళాన్ని కలిగిస్తుంది. ఇది వాస్తవానికి భిన్నమైన రాజకీయ నారేటివ్‌గా మారే ప్రమాదం ఉంది. మహిళా బిల్లు అమలు ఒక విధాన నిర్ణయం. డీలిమిటేషన్ ఒక రాజ్యాంగ ప్రక్రియ. ఈ రెండింటిని కలిపి ప్రజలకు చూపించడం అనేది ఒక వ్యూహాత్మక ప్రచారంగా భావించవచ్చు.'బిల్లు ఆగిపోయింది' అనే భావనతో ఓటు బ్యాంక్ రాజకీయాలను ప్రోత్సహించే ప్రయత్నం జరిగే అవకాశాన్ని విస్మరించలేం. మొన్న వీగిపోయింది మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు. 2023లోనే మహిళా బిల్లు చట్టసభలో దాదాపు అన్ని పార్టీల మద్దతుతో ఆమోదం పొందింది. కానీ ఇన్నాళ్లు అమలు చేయకుండా రాజకీయ లబ్ధికోసం డీలిమిటేషన్ బిల్ మెలిక పెట్టిన వాస్తవాన్ని మీడియా బహిరంగ పరచలేకపోయింది. ఇక్కడ ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాస్తవాలను తెలుసుకోవడం, అంశాలను వేరువేరుగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఇలాంటి క్లిష్టమైన రాజకీయ, రాజ్యాంగ అంశాల్లో మీడియా పాత్ర అత్యంత కీలకం. డీలిమిటేషన్ వంటి అంశాల్లో లోతైనచర్చలు జరగాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అవి పరిమితంగానే కనిపిస్తున్నాయి. డీలిమిటేషన్ ఒక అవసరమైన ప్రక్రియ. కానీ అదిన్యాయం,సమానత్వం, సమాఖ్య సూత్రాలను కాపాడే విధంగా అమలవ్వాలి. కేవలం జనాభా ఆధారంగా సీట్లను పునర్విభజించడం ద్వారా ప్రాంతీయ అసమానతలు పెరగకూడదు. దక్షిణ రాష్ట్రాలు సాధించిన అభివృద్ధి, దేశానికి చేస్తున్న ఆర్థిక సహకారం, సామాజిక పురోగతిని గుర్తించకుండా తీసుకునే నిర్ణయాలు సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తాయి. అదే సమయంలో మహిళా సాధికారత వంటి కీలక అంశాలను రాజకీయ ప్రచారంగా మార్చడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఈనేపథ్యంలో మీడియా తన బాధ్యతను గుర్తించి,ప్రజలకు నిజాలను తెలియజేయాలి. వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి. ప్రజలుకూడా అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యం సంఖ్యలమీద మాత్రమే కాదు,న్యాయం, సమతుల్యత, నిజాల మీద నిలబడాలి. సీట్లు మారవచ్చు కానీ సూత్రాలు మారకూడదు. రాజ్యాంగబద్ధంగా సమాఖ్య స్ఫూర్తికి భంగం కలగకుండా మీడియా స్వేచ్ఛను హరించకుండా, ఓటు బ్యాంక్ రాజకీయాలకు తావు లేకుండా మానవీయ విధానాలతో ప్రజాస్వామ్య పాలనందించాలి. •

# ఆర్థిక రంగానికి 'క్లాడ్ మిథోస్' ముప్పు!

## పలువురు బ్యాంక్ అధికారులతో భేటీ అయిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** క్లాడ్ మిథోస్ అనే అత్యంత శక్తిమంతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ వల్ల భారత బ్యాంకింగ్ రంగానికి ముప్పు పొంచి ఉందని కేంద్ర ఐటి శాఖ గుర్తించింది. వెంటనే అప్రమత్తం అయిన ఆర్థికశాఖరంగంలోకి దిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివిధ బ్యాంకుల అధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా పాల్గొన్నారు. ఆంత్రోపిక్ అనే ఎఐ స్టార్టప్ అభివృద్ధి చేసిన క్లాడ్ మిథోస్ సైబర్ భద్రత విషయంలో అత్యంత అధునాతనమైనదిగా పేరుపొందింది. మనుషులు గుర్తించడంలో విఫలమైన వేలాది సైబర్ భద్రతా లోపాలను ఇది గుర్తించినట్లు సమాచారం. కొన్ని ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో 27 ఏళ్లుగా ఉన్న లోపాలను కూడా ఇది బయటపెట్టింది. అందుకే దీన్ని సాధారణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఒకవేళ ఇది చెడు ఉద్దేశాలున్న వారి చేతికి చిక్కితే, అధునాతన హ్యాకింగ్ సామర్థ్యాలు పొందినట్లేనని ఆంత్రోపిక్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కొందరు అనధికారికంగా ఈ తి.ని యాక్సెస్ చేశారన్న వార్తలు ఆందోళన రేపుతున్నాయి. ఈ ముప్పు అసాధారణమైనదని, బ్యాంకులు, ఆర్థిక సంస్థల మధ్య అత్యంత జాగరూకత, సమన్వయం అవసరమని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎక్స్ వేదికగా పేర్కొంది. బ్యాంకులు తమ ఐటీ వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలని, వినియోగదారుల డేటాను కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ముప్పును నిజ సమయంలో గుర్తించి, దాని వివరాలను బ్యాంకులు, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వంటి సంస్థల మధ్య పంచుకోవడానికి ఒక బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తక్షణమే స్పందించేందుకు వీలుగా ఒక సమన్వయ సంస్థాగత యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఐబిఎకు మంత్రి సూచించారు. కేవలం భారత్‌లోనే కాకుండా, అమెరికా ప్రభుత్వం కూడా మిథోస్ ముప్పుపై వాల్‌స్ట్రీట్ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. మరోవైపు, ఈ కొత్త ఎఐ వల్ల భారత ఆర్థిక రంగానికి ఎంత మేరకు ప్రమాదం ఉందనే అంశంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లుఅధ్యయనం చేస్తున్నాయి.

### కోర్టు కాంప్లెక్స్ ఐదో అంతస్తు నుంచి దూకి

# న్యాయవాది ఆత్మహత్య

## తండ్రి అనుసరించిన కఠిన విధానాలే కారణమని సూసైడ్‌నోట్



**కాన్పూర్, ఏప్రిల్ 24** యువ న్యాయవాది కోర్టు భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాల్యంలో తండ్రి అకృత్యాలే కారణమని సూసైడ్ నోట్‌లో ఆరోపించాడు. తన మృతదేహాన్ని తండ్రి తాకకూడదని అందులో పేర్కొన్నాడు. కాన్పూర్‌కు చెందిన 25 ఏళ్ల లాయర్ అయిన ప్రియాన్ష్ శ్రీవాస్తవ కాన్పూర్‌లోని కోర్టు భవనం ఐదో అంతస్తు పైనుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడ్ని వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు ప్రకటించారు. ఆత్మహత్యకు ముందు శ్రీవాస్తవ వివరణాత్మక సూసైడ్ నోట్‌ను వాట్సాప్‌లో పోస్ట్ చేశాడు. మితిమీరిన తండ్రి కఠినత్వం, బాధాకరమైన బాల్యం అనుభవాలు, ఇష్టం లేని చదువు వంటివి తన ఆత్మహత్యకు కారణాలని పేర్కొన్నాడు. ఆరేళ్ల వయసులో అనుమతి లేకుండా మామిడి రసం తాగినందుకు తండ్రి తన బట్టలు విప్పి ఇంటి నుండి బలవంతంగా బయటకు గెంటేశాడని ఆరోపించాడు. మరోవైపు 2025లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసినప్పటికీ న్యాయ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడంలో ఇబ్బందులు, ఆర్థిక ఒత్తిడి, తండ్రి అనారోగ్యం వల్ల తలెత్తిన బాధ్యతలతో సహా, తన జీవిత పోరాటాన్ని సూసైడ్ నోట్‌లో శ్రీవాస్తవ ప్రస్తావించాడు. తనకంటూ సొంత, వృత్తిపరమైన గుర్తింపు లేకపోవడం, తండ్రి కింద పనిచేయడం పట్ల తీవ్ర నిరాశను వ్యక్తం చేశాడు. మా నాన్న నా శరీరాన్ని కనీసం తాకకూడదని పేర్కొన్నాడు. శ్రీవాస్తవ ఆత్మహత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీస్ అధికారి తెలిపారు. సూసైడ్ నోట్ అంశాలతో పాటు సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. న్యాయవాది అయిన శ్రీవాస్తవ తండ్రి తీవ్ర దుఃఖంలో ఉన్నారని మరిన్ని వివరాలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఇరాన్ బహిష్కృత యువరాజు పహ్లావీపై బెర్లిన్‌లో దాడి!



**బెర్లిన్, ఏప్రిల్ 24:** ఇరాన్ బహిష్కృత యువరాజు (క్రౌన్ ప్రిన్స్) రెజా పహ్లావీపై జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ఓ వ్యక్తి ఎరుపు రంగా ద్రావణం చల్లడం కలకలం సృష్టించింది. దాదాపు 50 యేళ్లుగా స్వదేశం వెలుపలే నివసిస్తున్న పహ్లావీ.. బెర్లిన్‌లోని ఫెడరల్ న్యూస్ కాన్ఫరెన్స్ భవనంలో గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా- ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని విమర్శించారు. టెహ్రాన్ ప్రభుత్వ ప్రవర్తన మారుతుందన్న భ్రమతో కాల్పులల విరమణను పొడిగించినట్లు కనిపిస్తోందని, అది సాధ్యమయ్యే పని కాదని పేర్కొన్నారు. అనంతరం ఆయన భవనం వెలుపలకు రాగానే.. ఓ వ్యక్తి ఎరుపు రంగు ద్రావణాన్ని చల్లాడు. అది పహ్లావీ కోటు, మెడ భాగంపై పడింది. ఈ ఘటనలో ఆయనకేమీ గాయాలు కాలేదు. ద్రావణం చల్లిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అది టమాటా రసం అయ్యుంటుందని భావిస్తున్నారు. పహ్లావీ వయసు 65 యేళ్లు. ఇరాన్ మాజీ షా అయిన మహమ్మద్ రెజా పహ్లావీ కుమారుడు ఈయన. 1979 నాటి ఇస్లామిక్ విప్లవంతో ఇరాన్‌లో మహమ్మద్ రెజా పహ్లావీ పదవీచ్యుతుదయ్యారు. తర్వాత ఆయన కుమారుడు పహ్లావీ దేశ బహిష్కారానికి గురయ్యారు. ఇరాన్‌లో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవాలని పహ్లావీ ప్రయత్నిస్తున్నారు. ఆ దేశంపై అమెరికా-ఇజ్రాయెల్ మిలిటరీ చర్యను సమర్థిస్తున్నారు. పహ్లావీపై ఎరుపు ద్రావణంతో జరిగిన దాడిని నిరసిస్తూ.. ఆయన మద్దతుదారులు వందల మంది జర్మనీ పార్లమెంట్ భవనం సమీపంలో నిరసన ప్రదర్శన చేపట్టారు.

## ట్రంప్ 'నరకకూపాలు' వ్యాఖ్యలకు ఇరాన్ ఘాటైన కౌంటర్

**ముంబయి, ఏప్రిల్ 24:** భారత్, చైనాలను నరకకూపాలుగా అభివర్ణిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రీషేర్ చేయడంపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. ట్రంప్‌నకు కొంత సాంస్కృతిక ప్రక్షాళన అవసరమని చెబుతూనే ఓసారి ఇండియా వచ్చి చూడంటూ ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ సోషల్‌మీడియాలో పోస్టు చేసింది. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతూ అంతర్జాతీయంగా చర్చనీయాంశం అయింది. ముంబైలోని ఇరాన్ రాయబార కార్యాలయం తన అధికారిక ఎక్స్ ఖాతాలో మహారాష్ట్రలోని అద్భుతమైన సంస్కృతిని, భౌగోళిక అందాలను ప్రతిబింబించే ఒక వీడియోను షేర్ చేసింది. ఈ సందర్భంగానే ట్రంప్‌నకు చురకలు అంటిస్తూ ఎవరైనా మిస్టర్ ట్రంప్‌నకు భారత్‌లో అభివృద్ధి, సాంస్కృతిక విలువలు తెలిసేలా ఆయన్ను ఇక్కడకు తీసుకు వస్తే బాగుంటుంది. బహుశా అది ఆయన చేసే పనికిమాలిన వ్యాఖ్యలను తగ్గిస్తుందేమోనని పేర్కొంది. కభీ ఇండియా ఆకే దేఖో.. ఫిర్ బోల్నా (ఒక్కసారి భారత్ వచ్చి చూడు.. అప్పుడు మాట్లాడు) అంటూ హిందీలో సమాధానం ఇచ్చింది. అమెరికన్ రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ తన పాడ్‌కాస్ట్‌లో భారత్, చైనాల నుంచి వచ్చే వలసదారులను ఉద్దేశించి జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. వీరు తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి పిల్లలనుకంటారు.



# టీఎంసి గూండాలకు బెంగాల్‌లో చోటివ్వం

## రెండోదశ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

**కోల్‌కత్తా, ఏప్రిల్ 24:** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గూండాలకు దాక్కోవడానికి బెంగాల్‌లో ఎక్కడా చోటు దొరకదని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారని, ఇది ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించారు. ఈ ఓటింగ్ శాతాన్ని చూసి టీఎంసీకి భయం పట్టుకుందని, ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రజలకు జరిగిన ప్రతి అన్యాయానికి, దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్‌ను బయటకు తీస్తామని హెచ్చరించారు. ఈ రాష్ట్రం విప్లవాల గడ్డ అని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలను ఎవరూ కాపాడలేరని అన్నారు. మమతా బెనర్జీ సాగిస్తున్న అటవిక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. మొదటి దశలో పోలింగ్ రికార్డు స్థాయిలో నమోదు కావడం పట్ల మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. బెంగాల్‌లో మహిళలకు గౌరవం, భద్రత, సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. బెంగాల్‌లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, మహిళలకు భద్రత కల్పిస్తాం. తప్పు చేసిన వారు శిక్షకు గురవుతారని, మే 4న బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ప్రతి అన్యాయం, ప్రతి అకృత్యంపై ఫైళ్లు తెరుస్తాం. ఇది మోదీ గ్యారెంటీ అని ప్రధాని అన్నారు. బెంగాల్‌లోని ప్రతి సోదరి, కుమార్తె కలలను నెరవేర్చడానికి, వారి జీవితాలను సులభతరం చేయడానికి బీజేపీ కట్టుబడి ఉంది. బీజేపీ మీకు భద్రత ఇస్తుంది. గౌరవం ఇస్తుంది. బీజేపీతోనే మీకు ఐశ్వర్యం లభిస్తుందని మోడీ అన్నారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రతి మహిళ జీవితంలో సంతోషం వస్తుంది. పేద సోదరీమణులకు ఉచిత రేషన్ అందిస్తుంది. ఏ సిండికేట్ కూడా మీ హక్కులను లాక్కోలేదని మోడీపేర్కొన్నారు మహిళా శక్తిపై తనకు పూర్తి నమ్మకం ఉందని, వారు 21వ శతాబ్దపు బెంగాల్‌లో కొత్త చరిత్రను రాస్తారనిఅన్నారు.

ఇకపై మేము టీఎంసీ ప్రభుత్వాన్ని మార్చితీరుతాం, ఇకపై మేము సహించమని బెంగాల్‌లోని ప్రతి మహిళ చెబుతోంది. రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డకు హామీ ఇస్తున్నామని బీజేపీ మీ కలలను కల్లలు కానీయబోదనిని ప్రధాని మోడీ పేర్కొన్నారు. మహిళలు రాత్రిపూట బయటకు రావద్దని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను కూడా ప్రధాని మోడీ తప్పుబట్టారు. దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ హత్యాచారం ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, ఆ ఘోరమైన నేరానికి టీఎంసీ పార్టీయే బాధ్యత వహించాలని అన్నారు. బాధితురాలి తల్లిని తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించినట్లు ఆయన గుర్తుచేసారు.

### బెంగాల్ తొలివిడతలో 110 సీట్లు మావే: అమిత్ షా

**కోల్‌కతా, ఏప్రిల్ 24:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని కేంద్రమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మొదటి దశలో 152 స్థానాలకు పోలింగ్ జరిగిందని, ఇందులో 110కి పైగా స్థానాలను తాము గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మొదటి దశలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైందని, ఇది మోడీ నాయకత్వంలోని అభివృద్ధికి వేసిన ఓటు అన్నారు. అధిక ఓటింగ్ శాతం నమోదు కావడం చూస్తుంటే బెంగాల్ ప్రజలు భయాన్ని వీడి విశ్వాసం వైపు మొగ్గు చూపుతున్నట్లు అర్థమవుతోందని అన్నారు. బెంగాల్ ప్రజలు తమ భవిష్యత్తును తొలి దశలోనే నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని అభివృద్ధి వైపు వారు మొగ్గు చూపారని అన్నారు. దీదీ దిగిపోయే సమయం వచ్చిందని, బీజేపీ అధికారం చేపట్టబోతోందని అన్నారు. బెంగాల్‌లో చట్టబద్ధమైన పాలనను పునరుద్ధరిస్తామని అమిత్ షా అన్నారు. చొరబాటు రహిత బెంగాల్‌గా మార్చడమే పెద్ద మార్పు అన్నారు. అవినీతి, బుజ్జగింపులు, దోపిడీ నుంచి స్వేచ్ఛ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే పాలన బయటి నుంచి ఉంటుందని మమతా బెనర్జీ చేసిన విమర్శలపై అమిత్ షా స్పందించారు. బెంగాల్‌లోనే పుట్టి, బెంగాలీలో చదువుకుని, ఆ భాషను మాట్లాడగలిగేవారే బెంగాల్ తర్వాత ముఖ్యమంత్రిగా అవుతారని అన్నారు. కానీ ఆ అవకాశం మమతా బెనర్జీ మేనల్లుడికి రాదని, బీజేపీ కార్యకర్తకు వస్తుందని అన్నారు.

### పాకిస్థాన్‌లో చిన్నారులకు హెచ్ఐవి

# బిబిసి స్టింగ్ ఆపరేషన్‌లో చేదునిజాలు

**ఇస్లామాబాద్,ఏప్రిల్ 24:** పాకిస్థాన్‌లో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంకారణంగా పసిపిల్లలు హెచ్ఐవీ బారిన పడుతున్నారు. పంజాబ్ ప్రావిన్స్‌లోని ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కనీస నిబంధనలు పాటించకుండా వాడిన సిరంజీలు, కలుషితమైన మందులతో చికిత్స అందిస్తున్న వైనాన్ని ఒక అంతర్జాతీయ మీడియా సంస్థ రహస్యంగా చిత్రీకరించిన డాక్యుమెంటరీ బయటపెట్టింది. బీబీసీ ఇన్వెస్టిగేషన్స్ చేపట్టిన ఈ స్టింగ్ ఆపరేషన్‌లో తౌన్సాలోని తహసీల్ హెడ్ క్వార్టర్స్ (టీహెచ్‌క్యూ) ఆసుపత్రిలో నర్సులు, ఇతర సిబ్బంది పిల్లలకు బట్టల పైనుంచే ఇంజెక్షన్లు ఇవ్వడం, వాడిన సిరంజీలనే మళ్లీ వినియోగించడం, రక్తంతో కలుషితమైన మందుల సీసా నుంచి పలువురు పిల్లలకు మందు ఇవ్వడం వంటి దారుణాలు రికార్డయ్యాయి. సిబ్బంది కొరత, మందుల కొరత కారణంగానే ఈ పరిస్థితి తలెత్తినట్టు తెలుస్తోంది. 2024 నవంబర్ నుంచి 2025 అక్టోబర్ మధ్య కాలంలో తౌన్సాలోనే కనీసం 331 మంది చిన్నారులకు హెచ్ఐవీ సోకినట్లు బీబీసీ తన నివేదికలో పేర్కొంది. గతంలో ఈ ఆసుపత్రిపై ఆరోపణలు రావడంతో ప్రభుత్వం చర్యలు చేపడతామని ప్రకటించినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఈ డాక్యుమెంటరీ స్పష్టం చేసింది. మరోవైపు పాకిస్థాన్ వ్యాప్తంగా హెచ్ఐవీ కేసుల సంఖ్య పెరగడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2025 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 189 కొత్త హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, ఏప్రిల్ మొదటి 20 రోజుల్లోనే 11 కొత్త కేసులు వచ్చాయని జాతీయ ఆరోగ్య సేవల మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి. బాధితుల్లో పురుషులతో పాటు చిన్నారులు కూడా ఉండటం ఆందోళనను రెట్టింపు చేస్తోంది. ప్రజల్లో అవగాహన పెరిగి పరీక్షల కోసం ముందుకు రావడం వల్లే కేసుల సంఖ్య పెరిగినట్లు కనిపిస్తోందని ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రామ్ మేనేజర్ జుబైర్ అబ్దుల్లా తెలిపారు. బీబీసీ విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌పై ఆసుపత్రి అధికారులు స్పందిస్తూ ఆ ఆరోపణలను ఖండించారు. తాను బాధ్యతలు చేపట్టక ముందు ఈ ఫుటేజ్ తీసి ఉండవచ్చని లేదా దీన్ని ఎవరో కావాలనే సృష్టించి ఉండవచ్చని ప్రస్తుత మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఖాసిం బుజ్దార్ అన్నారు.

## ఇరాన్‌తో యుద్ధంలో 1,200 పేట్రియాట్ క్షిపణులు, వెయ్యి తోమాహాక్స్ వాడిన అగ్రరాజ్యం అమెరికా



**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో అమెరికా భారీగా ఖర్చు చేసింది. వైట్‌హౌస్ అంచనాల ప్రకారం ఆ ఖర్చు సుమారు 28 బిలియన్ల డాలర్ల నుంచి 35 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. ప్రతిరోజూ అమెరికా ఆ యుద్ధం కోసం సుమారు వంద కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. అయితే యుద్ధం ప్రారంభమైన మొదటి రెండు రోజుల్లోనే అమెరికా దాదాపు 5.6 బిలియన్ల డాలర్ల ఖరీదైన ఆయుధాలను వినియోగించినట్లు తెలుస్తోంది. డిఫెన్స్ డిపార్ట్‌మెంటన అంచనాల ప్రకారం అమెరికా సుమారు 1100 జాయింట్ ఎయిర్ టు సర్ఫేస్ క్షిపణులను ఇరాన్ మీదకు వదలినట్లు తెలుస్తోంది. అమెరికా వద్ద సుమారు 1500 జెఎఎస్ఎస్ఎం-ఇఆర్ క్షిపణులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మిస్సైల్ రేంజ్ దాదాపు 600 కి.మీ., శత్రువుల స్థావరాల్లోకి ఇది దూసుకెళ్తుంది. జెఎఎస్ఎస్ఎం మిస్సైల్ ధర ఒక్కటి సుమారు 11 లక్షల డాలర్లు ఉంటుంది. ఇరాన్‌పై సమరంలో అమెరికా సుమారు 1,000 తోమాహాక్ క్రూయిజ్ క్షిపణులు వాడినట్లు తెలుస్తోంది. ప్రతి యేడాది అమెరికా ఖరీదు చేసే వాటి కంటే పది రెట్లు ఎక్కువగా వాటిని వినియోగించినట్లు అంచనా వేస్తున్నారు. ఒక్కొక్క తోమాహాక్ క్షిపణి ఖరీదు 3.6 మిలియన్ల డాలర్లు ఉంటుంది. తోమాహాక్‌లు లాంగ్ రేంజ్ క్రూయిజ్ మిస్సైళ్లు. 1991లో జరిగిన పర్షియన్ గల్ఫ్ వార్ నుంచి అమెరికా వాటిని వాడుతోంది. అమెరికాకు చెందిన సిఎస్ఐసి ప్రకారం.. ఆ దేశం వద్ద సుమారు 3000 తోమాహాక్ క్షిపణులు ఉన్నట్లు నిల్వల ద్వారా తెలుస్తోంది. ఈ యుద్ధంలో 1200 పేట్రియాట్ ఇంటర్‌సెప్టార్ క్షిపణులను అమెరికా వినియోగించినట్లు ఓ కథనం ద్వారా తెలిసింది. ఒక్కొక్క పేట్రియాట్ మిస్సైల్ ఖర్చు సుమారు 4 మిలియన్ల డాలర్లు ఉంటుంది. 2025 సంవత్సరంలో అమెరికా దాదాపు 600 పేట్రియాల్ క్షిపణులను ఉత్పత్తి చేసింది. ఈ వార్‌లో మరో 1000 ప్రిసిషన్ స్ట్రయిక్ క్షిపణులను కూడా అమెరికా వాడింది. వీటిల్లో ఎటిఎసిఎంఎస్ గ్రౌండ్ బేస్డ్ మిస్సైల్స్ కూడా ఉన్నాయి. సీజ్‌ఫైర్ ఒప్పందం జరగకముందే.. యుద్ధం 38 రోజులపాటు సాగింది. ఈ వార్‌లో అమెరికా 13,000 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది.

# మంటల్లో పశ్చిమాసియా

## సమయం మించిపోతోంది: ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు



**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అణ్వాయుధాలు వాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పష్టం చేశారు. ఈ క్రమంలో తమతో ఒప్పందానికి రావాలని.. సమయం మించిపోతోందని టెహ్రాన్‌కు ఆయన హెచ్చరికలు చేశారు. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఇరాన్‌తో యుద్ధంలో అణ్వాయుధాలు వాడే ప్రణాళిక తనకు లేదని ట్రంప్ పేర్కొన్నారు. 'నేను ఎందుకు అణ్వాయుధాన్ని ఉపయోగిస్తాను? అది లేకుండానే సంప్రదాయ యుద్ధ పద్ధతుల్ల మేము వారిని ఇప్పటికే నాశనం చేశాం. నేను దాన్ని ఉపయోగించను. అణ్వాయుధాన్ని ఉపయోగించడానికి ఎవరినీ, ఎప్పటికీ అనుమతించకూడదు' అని ట్రంప్ అన్నారు. ఈ సందర్భంగా టెహ్రాన్‌తో ఒప్పందానికి తాను తొందరపడటం లేదని ట్రంప్ పేర్కొన్నారు. త్వరిత పరిష్కారం కంటే స్థిరమైన, దీర్ఘకాలిక ఒప్పందంపైనే దృష్టి సారించినట్లు తెలిపారు. ఇటీవల ముగిసిన రెండు వారాల కాల్పుల విరమణలో ఇరాన్ తన ఆయుధ వ్యవస్థలను పునరుద్ధరించుకొని ఉండచవచ్చన్నారు. ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్‌కు సమయం మించిపోతోందని హెచ్చరిస్తూ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'నాకు చాలా సమయం ఉంది. కానీ ఇరాన్‌కు లేదు, సమయం మించిపోతోంది. ఇరాన్ సైన్యం కుప్పకూలిపోయింది. వారి నాయకులు ఇక మనతో లేరు. దిగ్బంధనం పటిష్టంగా ఉంది. ఇకనుంచి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది' అని ఆయన ట్రూత్‌లో రాసుకొచ్చారు.

## మొజ్తబా ముఖం, పెదాలకు తీవ్రగాయాలు


### ఇప్పటికే మూడు శస్త్రచికిత్సలు :అమెరికా పత్రికల్లో ప్రత్యేక కథనాలు



**టెహ్రాన్, ఏప్రిల్ 24:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారని, స్పృహలోనే ఉన్నారని చెపుతున్న ఇరాన్ పాలకులు ఆయన తీవ్రంగా గాయపడిన వైనం మాత్రం దాచిపెడుతునానరు. ఒకానొక దాడిలో తీవ్రంగా గాయపడటంతో ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లారు. బయటి ప్రపంచానికి కనిపించకుండా, వినిపించకుండా పాలనలో చురుగ్గా ఉన్నప్పటికీ, దేశంలో అధికారం ఆయన చేతుల్లో నుంచి సైనిక జనరల్స్ వైపు మళ్లింది. ఈ సంచలన విషయాలనుఅమెరికా పత్రిక ఒకటి తన ప్రత్యేక కథనంలో వెల్లడించింది. మొజ్తబా ఖమేనీకి తీవ్ర గాయాలైనప్పటికీ, ఆయన మానసికంగా చాలా చురుగ్గా ఉన్నారు. ఆయన శరీరం తీవ్రంగా దెబ్బతింది. ఆయన కాలికి మూడుసార్లు ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం కృత్రిమ కాలు కోసం ఎదురుచూస్తున్నారని రిపోర్ట్ పేర్కొంది. ఒక చేతికి కూడా శస్త్రచికిత్స జరగ్గా, అది నెమ్మదిగా కోలుకుంటోంది. అన్నింటికంటే ముఖ్యంగా ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిందని, భవిష్యత్తులో ప్లాస్టిక్ సర్జరీ అవసరమని అమెరికా పత్రిక వివరించింది. ఈ గాయాల వల్లే ఆయన ప్రజా జీవితానికి దూరంగా ఉంటున్నారు. బలహీనంగా కనిపించడం ఇష్టం లేకే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఆయనకు సందేశాలు చేరవేయడానికి, ఆయన నుంచి ఆదేశాలు స్వీకరించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. చేతితో రాసిన లేఖలను సీల్డ్ కవర్లలో ఉంచి, కార్లు, మోటార్‌సైకిళ్లపై మానవహారంలా ఒకరి నుంచి ఒకరికి అందిస్తూ ఆయన రహస్య స్థావరానికి చేరవేస్తున్నారు. ఇజ్రాయెల్ తమను గుర్తించి దాడి చేయొచ్చనే భయంతో సీనియర్ అధికారులు కూడా ఆయన్ను కలవడం లేదని రిపోర్ట్ తెలిపింది.

## ఇరాక్ మిలీషియా లీడర్ ఆచూకీ ఇస్తే రూ.94 కోట్లు!

### నజరానా ప్రకటించిన అమెరికా



**బాగ్దాద్, ఏప్రిల్ 24:** ఇరాక్‌లో ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న ఓ కీలక మిలీషియా నాయకుడిని పట్టిచ్చేందుకు అమెరికా భారీ నజరానా ప్రకటించింది. కతాయెబ్ సయ్యద్ అల్ షుహాదా అనే ఉగ్రవాద సంస్థకు నాయకుడైన హాషీమ్ ఫిన్యాన్ రహీమ్ అల్‌సరాజీ అలియాస్ అబూ వాలా అల్ వాయెలీని అరెస్ట్ చేయడానికి దారితీసే సమాచారం అందిస్తే 10 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 94 కోట్లు రివార్డుగా ఇస్తామని ప్రకటించింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన రివార్డ్స్ ఫర్ జస్టిస్ కార్యక్రమం కింద ఈ ప్రకటన వెలువడింది. ఇరాక్, సిరియాలలో అమెరికా దళాలు, దౌత్య కార్యాలయాలపై దాడులకు, ఇరాకీ పౌరుల మరణాలకు వాయెలీ నేతృత్వంలోని గ్రూప్ బాధ్యత వహించాలని అమెరికా ఆరోపించింది. సమాచారం అందించిన వారికి పూర్తి రక్షణతో పాటు, అవసరమైతే పునరావాసం కూడా కల్పిస్తామని స్పష్టం చేసింది. ఇరాక్‌లో ఇరాన్ అనుకూల మిలీషియాలపై ఒత్తిడి పెంచి, వాటిని కట్టడి చేసే కొత్త ప్రధానమంత్రి నియామకాన్ని ప్రోత్సహించే వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అబూ వాలా అల్ వాయెలీ కేఎస్ఎస్ గ్రూప్‌లో చేరకముందు కతాయెబ్ హిజ్బుల్లా కెహెచ్ అనే మరో అమెరికా వ్యతిరేక షియా మిలీషియాలో సభ్యుడిగా ఉండేవాడు. ఆ సమయంలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినందుకు అమెరికా దళాలకు పట్టుబడి 2010లో విడుదలయ్యాడు. సిరియా అంతర్యుద్ధం సమయంలో కేఎస్ఎస్ గ్రూప్‌లో చేరాడు. వాయెలీ నాయకత్వం వహిస్తున్న కేఎస్ఎస్ సంస్థ, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఐఆర్జీసీ భావజాలంతో, వారి మద్దతుతో పనిచేస్తుంది. ఈ సంస్థ యెమెన్‌లోని హౌతీలకు కూడా తన మద్దతు ప్రకటించింది.

విచిత్రమేమిటంటే, కేఎస్ఎస్ ఫైటర్లు ఇరాక్ అధికారిక భద్రతా దళాల్లో భాగమైన పాప్యులర్ మొబిలైజేషన్ కమిటీ లోని 14వ బ్రిగేడ్‌గా కూడా కొనసాగుతున్నారు. కేఎస్ఎస్ కార్యకలాపాలను గమనించిన అమెరికా, 2023 నవంబర్ 17న వాయెలీని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. గడిచిన దశాబ్ద కాలంలో ఈ గ్రూపు అమెరికా దళాలపై వెయ్యికిపైగా దాడులు చేసిందన్న నివేదికలున్నాయి.

# హెచ్‌వన్‌బి వీసాలను మూడేళ్లపాటు నిలిపివేయాలి!

## ప్రతినిధుల సభలో బిల్లు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ సభ్యుడు ఎలీక్రేన్




**వాషింగ్టన్, ఏప్రిల్ 24:** అమెరికాలో అత్యంత ఆదరణ పొందిన హెచ్ 1బీ వీసా కార్యక్రమం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తూ రిపబ్లికన్ పార్టీ సభ్యులు కాంగ్రెస్‌లో ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు, హెచ్ 1బీ వీసా విధానంలో సమూల మార్పులను ప్రతిపాదించింది. కొత్తగా హెచ్1బీ వీసాల జారీని మూడేళ్లపాటు పూర్తిగా నిలిపివేయాలని ప్రతిపాదించారు. ఈ విరామ సమయంలో వీసా వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయవచ్చని బిల్లు మద్దతుదారులు చెబుతుండగా, ఇది అమెరికాలోని కంపెనీలు, విద్యార్థులు, ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతుందని కార్పొరేట్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎండ్ హెచ్1బీ వీసా అబ్యూస్ యాక్ట్ ఆఫ్ 2026 పేరుతో ప్రవేశపెట్టిన ఈ బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలు ఉన్నాయి. ఈ బిల్లు చట్టంగా మారితే, 1952 నాటి ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టాన్ని సవరించాల్సి ఉంటుంది. కొత్తగా హెచ్1బీ వీసాల జారీని మూడేళ్ల పాటు నిలిపివేస్తారు. ఈ కాలంలో ఇప్పటికే వీసాపై ఉన్నవారు క్రమంగా దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏటా 65వేలకుపైగా వీసాలు జారీ చేస్తుండగా, ఆ సంఖ్యను 25వేలకు పరిమితం చేయాలి. ప్రస్తుతం ఉన్న మినహాయింపులను కూడా తొలగించాలని ప్రతిపాదించారు. ఇక కనీస వేతనం పరంగా హెచ్1బీ ఉద్యోగికి కనీస వార్షిక వేతనం 2 లక్షల డాలర్లు సుమారు రూ. 1.66 కోట్లు ఉండాలి. ప్రస్తుత లాటరీ విధానాన్ని రద్దు చేసి, అత్యధిక వేతనం ఉన్న వారికి ప్రాధాన్యత ఇచ్చే విధానాన్ని తీసుకురావాలి. హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు, పిల్లలకు ఇచ్చే డిపెండెంట్ వీసాలను నిషేధించాలి. వీసాదారులు శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం దరఖాస్తు చేసుకోకుండా నిరోధించాలి. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని కూడా రద్దు చేయాలి. ఈ బిల్లును ప్రవేశపెట్టిన ఎలీ క్రేన్ మాట్లాడుతూ విదేశీయులకు బదులు అమెరికన్లకే ఉద్యోగాల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రస్తుత హెచ్1బీ విధానం అమెరికన్ల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. మా ప్రభుత్వం భారీ కార్పొరేషన్ల లాభాల కోసం కాకుండా కష్టపడి పనిచేసే పౌరుల కోసం పనిచేయాలని వ్యాఖ్యానించారు. ఇతర రిపబ్లికన్ సభ్యులు కూడా చౌకగా లభించే విదేశీ కార్మికులతో అమెరికన్లను భర్తీ చేస్తున్నారని, ఈ మోసాన్ని అరికట్టాలంటూ ఇదే విధమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి ఈ బిల్లు కేవలం సభలో ప్రవేశపెట్టారు. ఇది చట్టంగా మారాలంటే కాంగ్రెస్ ఉభయ సభల ఆమోదం పొంది, అధ్యక్షుడు సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియకు చాలా సుదీర్ఘ సమయం పడుతుంది.

'వార్త' ప్రభావం

## టిటిడిలో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీలో పారదర్శకత

● మే 10, 11 తేదీలలో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు

**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో ఇంజినీరింగ్ పోస్టుల భర్తీ కోసం మే నెల 10, 11 తేదీలలో ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ పరీక్షల ద్వారా ఎఇఇ (సివిల్), ఎఇఇ (ఎలక్ట్రికల్), ఎఇ (సివిల్), ఎటిఒ (సివిల్) పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడతాయి. పరీక్షల షెడ్యూల్‌ను టిటిడి ప్రకటించింది. ఎఇఇ(సివిల్) మేనెల 10వతేదీ ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు, ఎఇఇ(ఎలక్ట్రికల్) - మధ్యాహ్నం 2.00 గంటల నుండిసాయంత్రం 5.00 వరకు ఎఇ (సివిల్) - 11 వతేదీ ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు, ఎటిఒ (సివిల్) - 11 వతేదీ మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 వరకు నిర్వహిస్తారు.

అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలను ఏప్రిల్ 24 నుండి 29వ తేదీ సాయంత్రం 6గంటల వరకు ఆన్ లైన్ లో ఎంపిక చేసుకోవాలి. తదుపరి అభ్యర్థులు హాల్ టికెట్లను మే నెల 02 తేదీ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అలాగే పరీక్ష షిఫ్ట్ వివరాలను పరిశీలించి, అవసరమైన అభ్యర్థి నిర్ధారణ (కాండిడేట్ కన్ఫర్మేషన్) ప్రక్రియను పూర్తి చేసుకోవాలని టిటిడి కోరింది. హాల్ టికెట్లు, పరీక్షా కేంద్రాలు తదుపరి వివరాలకు టిటిడి వెబ్ సైట్ "హెచ్‌టిటిపిఎస్:// టిటిడి-రిక్రూట్‌మెంట్.ఎపిటిఆన్‌లైన్.ఇన్/ టిటిడి రిక్రూట్‌మెంట్/వ్యూస్/ టిటిడి ఎగ్జామ్ ప్రిపరెన్షష్. ఎఎస్‌పిఎక్స్‌ను, కాల్ సెంటర్ 155257ను సంప్రదించాలని టిటిడి తెలిపింది. కాగా ఈవిషయంగా "గురువారం" వార్త దినపత్రికలో ప్రత్యేక కథనం వెలువడింది. దీనిపై టిటిడి స్పందిస్తూ మరో అవకాశం కల్పించడంపై ఇంజనీరింగ్ నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

## హాథీరాంజీమఠం ఆస్తుల పరిరక్షణకు మానిటరింగ్ వ్యవస్థ రావాలి

● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రావు



**తిరుపతి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** వేల కోట్ల విలువజేసే హాథీరాంజీ మఠం భూములు హారతి కర్పూరంలా కరిగిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ కళ్లప్పగించి చూస్తున్నాయని, ఫిర్యాదు చేయాల్సిన హాథీరాంజీ మఠం సిబ్బంది, కస్టోడియన్ అర్జునదాస్ మిన్నకుండి పోయారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రావు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి యశోదానగర్లోని వేమన విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వి. నాగరాజు, కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, ఎ.పుల్లయ్య, ఎస్.జయచంద్రలు పాల్గొన్నారు. ఇటీవల ఆక్రమణకు గురై, నిర్మాణాలు సాగిస్తున్న గాంధీపురంలోని మఠం భూములలో హాథీరాంజీ ఉద్యోగులు మఠం భూములలో ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బోర్డు నాటితే, కబ్జాదారులు మఠం భూములలో బోర్డును తొలగించినా పోలీసులకు ఫిర్యాదు చేయలేని దుస్థితిలో హాథీరాంజీ మఠం ఉందని విమర్శించారు. మఠం ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ఉన్నతాధికారులతో మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి నగర నడిబొడ్డున తీర్థకట్ట వీధిలో వందలకోట్లు విలువ చేసే పుష్పతోట అన్యాక్రాంతం కాకుండా సిపిఎం కాపాడిందన్నారు. ఆ తరువాతి కాలంలో సిపిఎం పోరాట ఫలితంగా మహారాష్ట్రలో 296 ఎకరాలు, తమిళనాడులో 162 ఎకరాలు, ఎపిలో 1634 ఎకరాలు ఆస్తులు, ఇతర అనేక ప్రాంతాలలో ఉన్న ఆస్తులకు రికార్డును తయారు చేశారు. నాడు నియమితులైన ఉన్నతాధికారి ముక్తేశ్వరరావు కృషి కారణంగా వేలకోట్ల విలువ చేసే హాథీరాంజీ ఆస్తులు పరిరక్షించబడ్డాయని తెలిపారు. మఠం భూములు ప్రజలకు, ప్రభుత్వానికి, మఠానికి, టిటిడికి ఉపయోగపడకుండా ఆక్రమణ దారులు వందల కోట్లు సంపాదించుకోవటానికి వనరుగా మారిపోయిందని అన్నారు. మఠం భూములను రాష్ట్ర ప్రభుత్వం కాపాడి ప్రజోపయోగంగా మార్చాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

## 29న ఐఓసిఎల్‌లో ఎన్‌డిఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పరిశ్రమల్లో ప్రమాదాలపై కార్మికులు, ప్రజల్ని అప్రమత్తం చేసే కార్యక్రమంలో భాగంగా ఈనెల 29వతేదీ జి.కొండూరు మండలం కట్టుబడిపాలెంలోని ఐఓసిఎల్ టెర్మినల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు ఎన్‌టిఆర్‌జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా తెలిపారు. శుక్రవారం రెవెన్యూ, అగ్నిమాపక, కర్మాగారాలు, పరిశ్రమలు, విద్యుత్, కాలుష్య నియంత్రణ, వైద్యఆరోగ్య, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో మాక్‌డ్రిల్ ముందస్తు ఏర్పాట్లపై వర్చువల్ సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ రసాయన ప్రమాదాలు సంభవించినపుడు తక్షణ స్పందన, సమన్వయం, ప్రజల రక్షణ చర్యలు అత్యంత కీలకమన్నారు. మాక్‌డ్రిల్ ద్వారా విపత్తులు ఎదురైనపుడు చేపట్టాల్సిన చర్యలను ప్రాక్టికల్‌గా అమలు చేసి లోపాలను గుర్తించి సరిదిద్దుకోవటం సాధ్యమవుతుందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అత్యవసర సమయంలో తమ బాధ్యతలు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సంఘటనస్థలిలో రక్షణ చర్యలు, బాధితుల తరలింపు, వైద్యసేవలు, అగ్నిమాపకచర్యలు, విద్యుత్ సరఫరా నియంత్రణ వంటి అంశాలను సమగ్రంగా ప్రదర్శించనున్నట్లు జెసి వివరించారు. అధికారులు అందరూ పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

**మలేరియా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ:** ప్రపంచ మలేరియా దినోత్సవ పోస్టర్‌ను శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ యం. సుహాసిని ఆవిష్కరించారు. జిల్లావైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుహాసిని మాట్లాడుతూ 25వ తేదీ ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్యఆరోగ్యసిబ్బంది మలేరియా నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డి.రాజునాయక్, డాక్టర్ ఇందుమతి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అఫీసర్ డాక్టర్ మాధవినాయుడు, డిపియంఓ డాక్టర్ నవీన్, డాక్టర్‌లు సునీల్, కార్తీక్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్పలకు హైకోర్టులో ఎదురుదెబ్బ

### రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు డిస్మిస్

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్పలకు విజయవాడ ఏసీబీ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వీరు దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం, ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం వాటిని డిస్మిస్ చేసింది. ఈ కేసు విచారణ కీలక దశలో ఉన్నందున, నిందితులకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడం దర్యాప్తుపై ప్రభావం చూపుతుందన్న ప్రాసిక్యూషన్ వాదనతో కోర్టు ఏకీభవించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు నిందితులు రెగ్యులర్ బెయిల్ పొందినప్పటికీ, ఈ ముగ్గురికి మాత్రం న్యాయస్థానం నుంచి ఆశించిన ఫలితం దక్కలేదు. దీంతో వీరు తదుపరి హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. ఒకవైపు వీరి నివాసాల్లో ఈడీ సోదాలు జరుగుతుండగానే, మరోవైపు న్యాయస్థానంలో కూడా వారికి ఊరట లభించలేదు.

# గజరాజుల విధ్వంసం

● గజగజలాడుతున్న రైతాంగం ● ప్రాణాలు పోయినా పట్టించుకోని అటవీశాఖ అధికారులు ● శాశ్వత పరిష్కారానికి చర్యలు శూన్యం





**చంద్రగిరి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** మదపుటేనుగుల మంద సృష్టిస్తున్న విధ్వంసాన్ని నియంత్రించే శాశ్వత చర్యలు చేపట్టడంలో అటవీశాఖ అధికారులు చేష్టలుడిగి శూన్యవైపు చూస్తున్నట్లు సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. తిరుపతి జిల్లా, చారిత్రాత్మక చంద్రగిరి నియోజకవర్గం, సాక్షాత్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ, ఐటిశాఖల మంత్రి నారా లోకేష్ సొంతూరు నారావారిపల్లి ఉప సర్పంచ్ రాకేష్ ఏడాది క్రితం ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయినప్పటికీ సమర్థవంతమైన చర్యలు చేపట్టడంతో అటవీశాఖ అధికారులు విఫలమయ్యారు. గురువారం రాత్రి రామిరెడ్డిపల్లి పంచాయతీ, కూచివారిపల్లిలో సురేంద్ర నాయుడు మామిడితోటలో ఏనుగుల గుంపు ప్రవేశించి బోరు పైపులు, మామిడి చెట్లు, పంటను ధ్వంసం చేశాయి. రాకేష్ మరణించిన నాటి నుండి నేటి వరకు తరచూ గజరాజుల గుంపు లేదా ఒంటరి ఏనుగు గ్రామాలపై పడి పంట పొలాలను నాశనం చేస్తున్నప్పటికీ కట్టడి చర్యలు చేపట్టడంలో, పరిహారం చెల్లించడంలోనూ కంటితుడుపు చర్యలకే పరిమితమవు తున్నారు. రైతన్నలు అప్పులు చేసి, శ్రమకోర్చి పండించిన పంటలతో పాటు వృక్ష సంపదను ధ్వంసం చేస్తున్న ఏనుగుల మందను నిలువరించలేని నిస్సహాయ స్థితిలో రైతన్నలు కొట్టుమిట్టాడు తున్నారు. మానవ తప్పిదాలతో అటవీ ప్రాంతంలో ఆహార కొరతలు తీవ్ర స్థాయికి చేరుకోవడంతో ఏనుగులు, చిరుతలు, ఇతర వన్యప్రాణులు ఆహారం కోసం గ్రామాలపై పడుతున్నాయి. గోవా నుండి తిరుపతి వరకు ఏనుగుల కారిడార్‌గా పరిగణిస్తారు. తమిళనాడులోని ముదిమల, పెరియార్ అభయారణ్యాలతో పాటు పొల్లాచ్చి, కర్ణాటకలోని కౌడన్య, బంతూరు గట్ట, దండేలి, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శేషాచల అడవులు కుప్పం, పలమనేరు చంద్రగిరి నియోజక వర్గంలోని చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాళ్యం, చంద్రగిరి మండలాల్లోకి ఏనుగుల రాకపోకలు సీజన్‌ను అనుసరించి సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో 10 ఏళ్ళ క్రితం అటవీశాఖ అధికారులు తలకోన నుండి మూలపల్లి వరకు గల శేషాచల అడవిలో సుమారు 60 కిలోమీటర్లు కందకాలు త్రవ్వించారు. అయితే ప్రస్తుతం ఈ కందకాలు పూడిపోయివున్నాయి. దీంతో ఏనుగుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకపోయింది. ఏనుగుల రాకను కట్టడి చేయడానికి చేసిన సోలార్ కంచె ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు, అటవీశాఖ అధికారులు ఏనుగుల రాకను గమనించి భాణాసంఛా పేలుళ్ళు, దివిటీ కాగడాలతో పాటు పెద్ద పెద్ద శబ్దాలతో తరిమికొట్టే స్థితినుండి ఏనుగుల తిరుగుబాటును ఎదుర్కొనే భయానక పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో రైతులు కరెంట్ తీగలను ఏర్పాటు చేయగా మూగజీవాలు మరణిస్తుండటంతో కేసులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. అటవీశాఖ, ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ ఉమ్మడి సమన్వయంతో రైతులకు పంట మార్పిడిపై ప్రోత్సాహకాలను అందజేసి ప్రోత్సహించగలిగితే కొంత ప్రయోజనం వుండవచ్చనే అభిప్రాయం వుంది. తద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం కాగలరని అంటున్నారు.

అటవీశాఖ అధికారులు దేశ వ్యాప్తంగా ఏనుగుల కట్టడికి తీసుకున్న చర్యలను పరిశీలించి ప్రయోగాత్మకంగా అమలు చేయాల్సివున్నది. అదే విధంగా కుంకీ ఏనుగులతో ఏనుగుల మందను అటవీ ప్రాంతంలోకి మళ్ళించే చర్యలను సమర్థవంతంగా నిర్వహించాల్సి వున్నది. ఇందుకు ముందుగా అడవుల్లో వన్యప్రాణులకు ఆహార కొరత లేకుండా చేయాల్సిన బాధ్యతను కూటమి ప్రభుత్వం సమర్థవంతమైన చర్యల ద్వారా ప్రారంభించాల్సి వున్నది. ఆ మేరకు రైతులను పంట నష్టాల నుండి ఆదుకునే దిశగా చర్యలు కుంటారని ఆశిద్దాం.!

## శ్వేత డైరెక్టర్ నియామకంలో పారదర్శకత అవసరం

●టిటిడి ఇఒకు డాక్టర్ సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి

**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి ఉద్యోగుల శిక్షణా సంస్థ (శ్వేత) డైరెక్టర్ నియామకంలో పారదర్శకత పాటించాలని ఎపి చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్.బి. సుధాకర్‌రెడ్డి టిటిడికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం టిటిడి కార్యనిర్వహణా ధికారికి రాసిన లేఖలో 2024 జులై నుంచి ఖాళీగా ఉన్న శ్వేత డైరెక్టర్ పదవి ఖాళీగా అందని పేర్కొన్నారు. డైరెక్టర్ నియామకం కోసం ఇప్పటివరకు రెండుసార్లు నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ ఎంపిక ప్రక్రియలో అనవసర ఆలస్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలలో చదివిన, ఎంబీఏ, పీహెచ్‌డీ అర్హతలు కలిగి, జాతీయ స్థాయిలో శిక్షణ అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసినప్పటికీ, గతంలో ఇదే తరహా సంస్థలో పనిచేసి ఉండాలి" అనే కారణంతో వారిని పక్కన పెట్టే ప్రయత్నం జరుగుతోందనే సమాచారం ఉందని తెలిపారు. ఇది న్యాయసమ్మత ఎంపిక ప్రక్రియకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల సామర్థ్యాలు, నైపుణ్యాలు, నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పడిన శ్వేత సంస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులతో పాటు విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ వంటి కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. కాబట్టి, దరఖాస్తు చేసిన అభ్యర్థులలో పారదర్శకంగా షార్ట్‌లిస్ట్ తయారు చేసి, నిష్పక్షపాతంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వ్యక్తిని డైరెక్టర్‌గా నియమించాలని ఆయన కోరారు. శ్వేత సంస్థ ప్రారంభం నుంచి గెస్ట్ ఫ్యాకల్టీగా సేవలందిస్తూ, శిక్షణా కార్యక్రమాల రూపకల్పనలో భాగస్వామిగా ఉన్న తాను, సంస్థ అభివృద్ధి దృష్ట్యా ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

# కుటుంబాన్ని మింగేసిన ఆన్‌లైన్ రమ్మీ

### అప్పులభారంతో అవమానంతో పైలోకానికి



**తిరుపతి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** అనుకున్నరీతిలో సాగిపోయే వ్యాపారం వదలి ఏకంగా మితిమీరిన వ్యసనం ఆన్‌లైన్ రమ్మీకి అలవాటుపడిన వ్యసనపరుడు కుటుంబాన్ని బలిచేసి తానూ ప్రాణాలు తీసుకున్న ఘటనలో పోలీసులు నిజాలు వెలికితీశారు. ఎక్కడా అప్పులు లేకపోవడం..ఉన్నంతలో కుటుంబం సాఫీగా సాగిపోతున్న సమయంలో ఆన్‌లైన్ రమ్మీకి బానిసై కుటుంబాన్ని బలితీసుకున్నాడు. తిరుపతి జిల్లా నగరి నియోజకవర్గం నారాయణవనం మండలం వెంకటకృష్ణపాలెంలో విషాద ఘటన వెనుక వాస్తవాలను పోలీసులు రాబట్టారు. నెలకొన్న మిస్టరీని వీడించారు. ఆన్‌లైన్ రమ్మీ వ్యసనంతో అప్పులపాలై ఈ ఘాతుకానికి మోహన్‌పాల్పడినట్లు తేల్చారు. ఇంట్లో ఉన్న తల్లి, భార్యను తొలుత బుధవారం మధ్యాహ్నం హత్య చేసి ఆపై ఇద్దరి బిడ్డల ప్రాణాలు బలితీశాడు. చివరకు తానూ రైలుక్రిందపడి ప్రాణాలో కోల్పోయాడు. ఒకే కుటుంబంలో ఐదుగురి మృతి కేసు మిస్టరీ వీడించారు. ఆన్‌లైన్ రమ్మీ వ్యసనం, అప్పుల భారంతోనే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ రమ్మీకి బానిసైన మృతుడు మోహన్ చివరకు 40 లక్షల వరకు అప్పులు చేసినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. ఉన్న ఆస్తులు, బంగారం అమ్మి అప్పులు తీర్చినా, ఇంకా అప్పుల ఊబిలోనే కూరుకుపోయాడు. ఈ ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని సమాచారం. ఈ క్రమంలోనే ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. తండ్రి రైల్వే ఉద్యోగి కావడంతో ఆయన మరణానంతరం వచ్చిన ఉద్యోగాన్ని కూడా మోహన్ వదిలేశాడు. అతని భార్య హరిత బ్యూటీపార్లర్, టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఐదు మృతదేహాలకు గురువారమే పోస్ట్‌మార్టమ్ నిర్వహించి, స్వగ్రామంలో అంత్యక్రియలు జరిపారు.

# తుమ్మలగుంటలో ఇడి అధికారుల సోదాలు

- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఇంట్లో విస్తృత తనిఖీలు





**తిరుపతిరూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుండి ప్రారంభమైన తనిఖీలు రాత్రి వరకు కొనసాగాయి. చెవిరెడ్డి కుటుంబ సభ్యుల్లో ఎవరు అందుబాటులో లేనందు ఈడి అధికారులు నిరీక్షించారు. మధ్యాహ్నం చెవిరెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందుబాటులోకి వచ్చి ఈడి అధికారులకు సహకరించారు. సిట్ నివేదిక ఆధారంగా చర్యలు గత ప్రభుత్వ హయాంలో మద్యం వ్యాపారంలో జరిగిన అక్రమాలపై సిట్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఈడి రంగంలోకి దిగినట్లు తెలిసింది. మద్యం తయారీ సంస్థల నుంచి భారీగా నగదు వసూలు చేసి, దారి మళ్లించినట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ కేసు నమోదైంది.

**భారీ బందోబస్తు మధ్య సోదాలు:** చెవిరెడ్డి నివాసం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరూ లోపలికి వెళ్లకుండా బయటకు రాకుండా ఈడి అధికారి బి.ఎన్.రావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పలు రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది.

రికార్డుల పరిశీలన... స్వాధీనం చేసుకునే అవకాశం ఇప్పటికే సిట్ అధికారులు నిర్వహించిన సోదాల్లో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న విషయం తెల్సిందే. ప్రస్తుతం ఈడి బృందం అదే కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించి రికార్డులను సవిరంగా పరిశీలిస్తుంది. ఏకకాలంలో పలు చోట్ల దాడులు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర వ్యక్తులైన రాజ్ కసిరెడ్డి, ధనంజయరెడ్డి, బాలాజీ గోవిందప్ప, విజయసాయిరెడ్డి నివాసాల్లో కూడా ఏక కాలంలో ఈడి సోదాలు నిర్వహించినట్లు సమాచారం. మరింత సమాచారం వెల్లడి కావాలి సోదాల్లో ఏమేమి స్వాధీనం చేసుకున్నారు. కేసు పురోగతి ఎలా ఉంటుందన్న దానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం విచారణ కొనసాగుతుంది.

## ఆసియా వర్సిటీ ర్యాంకింగ్స్‌లో సెంచూరియన్ యూనివర్సిటీ అద్భుత ప్రవేశం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ఒడిశాకు చెందిన ప్రముఖ విద్యా సంస్థ 'సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్' అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. ప్రతిష్ఠాత్మకమైన 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2026'లో ఈ విద్యాసంస్థ తొలిసారిగా చోటు సంపాదించుకుంది. ఈ ఏడాది ఆసియాలోని 36 దేశాల నుండి సుమారు 1,405 విశ్వవిద్యాలయాలు పోటీ పడగా, సెంచూరియన్ యూనివర్సిటీ తన అద్భుత ప్రదర్శనతో ఆసియా స్థాయిలో 601-800 బ్యాండ్‌లో నిలిచింది. అలాగే జాతీయ స్థాయిలో (భారతదేశంలో) 94వ ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ ఘనతపై సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్ స్పందిస్తూ, 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆసియా ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకోవడం మా విద్యాసంస్థ ప్రయాణంలో ఒక కీలక ఘట్టం. నాణ్యమైన విద్య, పరిశ్రమలతో అనుసంధానం మరియు సామాజిక ప్రయోజనం చేకూర్చే పరిశోధనల పట్ల మాకు ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనం. భవిష్యత్తులో గ్లోబల్ పార్టనర్‌షిప్స్, అకాడమిక్ ఎక్సలెన్స్‌ను మరింత బలోపేతం చేస్తాం' అని పేర్కొన్నారు.

## గ్రామపంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి: జాస్తి



**విజయవాడ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు అఖిలభారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా వెలగపూడి సచివాలయంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరుపున ఆయన ఓఎస్‌డి వెంకట కృష్ణను శాలువా కప్పి సత్కరించారు. ఈసందర్భంగా జాస్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామపంచాయతీల్లో పలు సంస్కరణలు తీసుకువచ్చినట్లు చెప్పారు. పవన్‌కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు.

రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించటంతోపాటు గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వేగవంతంగా పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. కేంద్రప్రభుత్వ అవార్డులకు ఎంపికయిన స్థానికసంస్థల ప్రజాప్రతినిధులను ఈసందర్భంగా జాస్తి వీరాంజనేయులు అభినందించారు. ఈకార్యక్రమంలో తోకల మురళీమోహన్ స్వామీజీ, యెమినేడి కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# అంగప్రదక్షిణ భక్తులకు అవస్థలు!

● అర్ధరాత్రి గేట్లకు తాళాలు... తెల్లవారుజామున తెరచుకోని గేట్లు ● శనివారం వేకువజామున భక్తులకు తప్పని కష్టాలు





తిరుమల ఆలయం ముందు మూసివేసిన గేట్, దక్షిణమాఢవీధిలో మూతబడిన గేట్




శ్రీవారి పుష్కరిణి దక్షిణవైపు గేట్ తాళాలేసిన విజిలెన్స్ సిబ్బంది

**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి నిలువు దోపిడీ సమర్పించుకునే భక్తుల తరువాత అంగ్రపదక్షిణ భక్తులంటే ఎంతో అభిమానమనేది అర్చకులు విశ్వాసం వెలిబుస్తుంటారు.ఎంతో భక్తివిశ్వాసాలతో అంగప్రదక్షిణ చేసే భక్తులకు కొండపై కొందరు ఆలయ అధికారులు, విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది అవగాహన రాహిత్యంతో మనోభావాలు దెబ్బతీసేలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని భక్తుల ఆవేదన. వేకువజామున 2.30 గంటలకు శ్రీవారి ఆలయంలో అంగప్రదక్షిణ చేసే మొక్కుబడుల భక్తులకు అడుగడుగునా అవస్థలు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ టిక్కెట్లు ఆఫ్‌లైన్‌లో జారీచేయడం నుండి పూర్తిగా ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుండటంతో ఎక్కడెక్కడ నుంచో సుదూర ప్రాంతాల నుండి ఎన్నో వ్యయప్రయాసల కోర్చి అంగప్రదక్షిణ దర్శనానికి వస్తున్న భక్తులు కొండకు చేరుకుంటే వారికి కనీస సౌకర్యాలు లేకపోగా ఏకంగా ఆలయం ముందు, పరిసరాల్లో గేట్లన్నీ పూర్తిగా మూసివేస్తుండటంతో మరింతగా జఠిలంగా మారింది. ప్రతిరోజూ 750మంది పురుష, మహిళ భక్తులకు (శుక్రవారం మినహాయించి)వేకువజామున 2గంటలకు అంగప్రదక్షిణ చేసుకునేలా మూడునెలల ముందుగానే ఆన్‌లైన్‌లో టిటిడి టోకెన్లు విడుదల చేస్తుంది. ఈ టోకెన్లను తెలుగురాష్ట్రాల వారేగాక కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ ప్రాంతాల భక్తులు కూడా ఆన్‌లైన్‌లో అందుకుని ఆయా రోజుల్లో అంగప్రదక్షిణకు తిరుమలకు చేరుకొంటారు. ఈ టోకెన్ కలిగిన భక్తులకు కనీసం తలదాచుకునేందుకు గదులు కేటాయించకపోగా యాత్రికుల వసతి సముదాయాల్లో లాకర్లు వసతి కూడా లేకపోతోంది. దీనికంటే మరీ అంగప్రదక్షిణ భక్తులు వేకువజామున 1గంట ప్రాంతంలో ఆలయానికి పక్కనే ఉన్న స్వామివారి పుష్కరిణిలో పవిత్ర స్నానాలాచరించి తడిబట్టలతో వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ క్యూలైన్‌లోనుండి ఆలయలోపలకు చేరుకోవాల్సి ఉంటుంది. అంతకు ముందు పుష్కరిణిలో దక్షిణవైపు గేట్లను తెరచి భక్తులను అనుమతించాల్సి ఉన్నా కొందరు సిబ్బంది ఇష్టానుసారంగా మారింది. గేట్లను తెరవకపోగా ఆలయం ముందు గేట్లకు తాళాలు వేసి భక్తుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. మరీ ఆలయానికి దక్షిణవైపు ఎలిఫెంట్‌గేట్ క్యూలైన్ వద్ద గేట్‌కు తాళాలు వేసేస్తున్నారు.ఇవన్నీ అంగప్రదక్షిణ భక్తులకు కష్టాలు పెడుతున్నారు.

**టోకెన్లు లేకుంటే మహాఅంగప్రదక్షిణకు అడ్డంకులే:** ప్రతినెలా ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేసే ఉచిత అంగప్రదక్షిణ టోకెన్లు చాలావరకు తిరుమల, తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి పరిసరాల వాసులకు అందుకోలేక పోతున్నారు. 750 టోకెన్లలో శనివారం మాత్రమే 250 టోకెన్లును స్థానికులకోసం ఆధార్‌కార్డు ప్రామాణికంగా తీసుకుని టోకెన్‌లు జారీ చేస్తారు. ప్రతి శనివారం వేకువజామున తిరుమల ఆలయంలో అంగప్రదక్షిణ కోసం స్థానిక భక్తులు గురువారం ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 4 గంటల వరకు తమ ఆధార్ కార్డుతో ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వారికి సాయంత్రం 5 గంటలకు లక్కీడిప్ ద్వారా టికెట్లు కేటాయించబడుతుంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులకు వారి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం అందిస్తూ, ఆన్‌లైన్ లో ఉంచబడుతుంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు ఆన్‌లైన్‌లో రూ.500లు డిపాజిట్ చేయాలి. లక్కీ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తమ ఆధార్ కార్డు చూపి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు అంగప్రదక్షిణ టికెట్లు పొందవచ్చు.

లక్కీ డిప్‌లో టికెట్లు పొందిన భక్తులను శనివారం తెల్లవారుజామున 1.30గంటలకు అంగప్రదక్షిణకు అనుమతిస్తారు. ఆ తరువాత మరుసటిరోజు భక్తులు చెల్లించిన రూ.500లు డిపాజిట్‌ను తిరిగి వారి ఖాతాల్లోకి టిటిడి జమ చేస్తుంది. స్థానికేతరులు కానివారిని అంగప్రదక్షిణకు అనుమతించరు. ఇన్ని తతంగాలు ఉన్నా అంగప్రదక్షిణకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయి. ఇక టోకెన్లు లభించని భక్తులు, తిరుమల, తిరుపతివాసులు నిజమైన శ్రీవారి భక్తులు సాంప్రదాయ ఆచారంలో భాగంగా ఆలయ నాలుగు మాఢవీధుల్లో మహాఅంగప్రదక్షిణ చేస్తారు. ఇందుకు ఆలయం ముందు నుండి నాలుగుమాఢ వీధుల్లో ఎంతో భక్తితో గోవింద నామస్మరణలతో శరీరంపై తిరునామాలు ధరించి మహాఅంగప్రదక్షిణలో పొర్లుదండాలు పెడుతూ చేస్తారు. ఈ మహా అంగప్రదక్షిణకు కూడా భక్తులకు మాఢవీధుల్లో గేట్లు తాళాలే వేసేస్తుండటంతో భక్తుల బాధలు వర్ణనాతీతంగా మారింది. తిరుమలలో విజిలెన్స్ సిబ్బంది అత్యుత్సాహంతోనే అంగప్రదక్షిణ గాక మహాఅంగప్రదక్షిణ భక్తులకు అవస్థలు తప్పడం లేదు. మరీ టిటిడి అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక భక్తులు కోరుతున్నారు.




## తిరుమలలో సప్తగిరి విశ్రాంతి భవనాలకు దారేటు?: భక్తుల అయోమయం

**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకు నిత్యం దేశవిదేశాల నుండి లక్షలాదిమంది భక్తులు వస్తుంటారు. వీరిలో అత్యధిక శాతం మంది భక్తులు సామాన్యులే. తిరుమలకు వచ్చిన భక్తుల్లో ఆధ్యాత్మికానికిపైగా ఒకరాత్రి కొండపై నిద్రించాలని విశ్వాసంతో ఉంటారు. ఇలా సామాన్యభక్తులకు కేటాయించే కాటేజీలు, విశ్రాంతి గృహాల్లో ఆలయానికి కొంత దూరంలో, లగేజీ తిరిగి ఇచ్చే కేంద్రానికి సమీపంలోనే సప్తగిరి విశ్రాంతి భవనాలు ఉన్నాయి. ఇందులో రెండువందల వరకు గదులు ఉంటాయి. లేపాక్షి కూడలికి, ఫిల్టర్‌హౌస్‌కు ఆనుకుని ఉన్న సప్తగిరి విశ్రాంతి భవనాలు ఎటు వెళ్ళాలనేది దారికోసం యాత్రికులు తంటాలు పడుతుంటారు. రోడ్డుపై కనిపించిన వారందరినీ అడగటం పరిపాటిగా మారింది. యాత్రికులు. గదులు పొందిన వాళ్ళు దర్శనానంతరం శ్రీవారి ఆలయం వద్ద బయలుదేరి బేడి ఆంజనేయస్వామి, ఆస్థాన మండపం, పిఏసి -4, లగేజీ సెంటర్ నుండి సప్తగిరి గదులు వద్దకు చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. తిరుమలలో యాత్రికుల సౌకర్యార్థం అనేకరకాలుగా పలుచోట్ల సూచికల భోర్డులు ఏర్పాటు చేశారు. కానీ మూడు వేలమంది వసతి నిలయంగా ఉన్న సప్తగిరి భవనాలకు సమీపం లగేజీ, ఫోన్ సెంటర్ జంక్షన్ వద్ద సూచిక బోర్డు లేకపోయింది. దీంతో యాత్రికులు కొంత ఇబ్బందిపడుతూన్నారు. టిటిడి అధికారులు వేసవిసెలవులకు ముందే అవసరమైనన్ని సూచికబోర్డులు భక్తులకు తెలిసేలా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## మే 5 నుంచి తాళ్ళపాక పెద్దగంగమ్మ జాతర

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి సిటీ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** తాళ్లపాక పెద్దగంగమ్మ జాతర మే 5వ తేదీ నుంచి ప్రారంభమై మే 13వ తేదీ తెల్లవారుజామున విశ్వరూప దర్శనంతో ముగుస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం జాతర ఆహ్వాన పత్రికలు, కరపత్రాలు, గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. మే 5న రాత్రి చాటింపుతో జాతర ప్రారంభమవుతుందని, మే 12న అంగరంగ వైభవంగా ప్రధాన జాతర కార్యక్రమాలు జరుగుతాయని ఆయన వివరించారు. తాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర, ఆమె సోదరిగా పూజలు అందుకునే తాళ్ళపాక పెద్దగంగమ్మ జాతర ఒకే రోజు ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ పాలకమండలి చైర్‌పర్సన్ వేదవతి రాయల్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ గంగమ్మ జాతరలు తిరుపతి సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ మహేష్ యాదవ్, డాక్టర్ శ్రీహరి రావు, దేవాదాయ శాఖ అధికారులు, వివిధ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## తిరుచానూరులో ప్రోటో (ఫోన్) కాల్‌కే పెద్దపీట



**తిరుచానూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం నందు భక్తుల సంఖ్య దిన జనాభివృద్ధి చెందుతుంది. ఒకవైపు ఉన్నతాధికారులు అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు దర్శనం మరియు భోజన సౌకర్యాల కోసం జరిగే ఏర్పాటును పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా కింది స్థాయి ఆలయ ఉద్యోగులు మాత్రం ఎప్పుడు ఫోన్‌లో వచ్చే కాల్స్‌ని ప్రోటోకాల్‌గా చెప్పుకుంటూ తమదైన శైలిలో దర్శనాలు చేయిస్తూ ముందుకెళ్తున్నారు. ఇటీవల పెరిగిన రద్దీ దృశ్య విజిలెన్స్ అధికారులు కుంకుమార్చన టికెట్ కౌంటర్ నందు 200 రూపాయల టికెట్లను క్రమబద్ధీకరించారు. అయినా కూడా వీరు కౌంటర్ ను తెరిపించి మరి వారి సొంత ప్రోటోకాల్ కోసం టికెట్లను విక్రయించమని ఒత్తిడి చేస్తున్నారు. ఇదిలా ఉండగా వీరి వలన సామాన్య భక్తులు ఇక్కట్ల పాలవుతున్నారు. ఆలయ సిబ్బంది కావడంతో విజిలెన్స్ మరియు టిటిడి ఉన్నతాధికారుల సైతం భక్తులు ఫిర్యాదులు మందలించి వదిలేస్తున్నారు. ఇలాగే కొనసాగితే తిరుచానూరు శ్రీ పద్మావతి ఆలయం ప్రోటోకాల్యాలయంగా పేరు మారే అవకాశం ఉందని భక్తులు వాపోతున్నారు.

## భారీగా అదనపు జిల్లా జడ్జీల బదలీ

● విజయవాడ ఎసిబి కోర్టు జడ్జి పి.భాస్కరరావును పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జిగా బదలీ

● విజయవాడ ఎసిబి కోర్టు మూడో అదనపు జిల్లా కోర్టు జడ్జిగా తేజోవతి

**విజయవాడ ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పలువురు జిల్లా అదనపు న్యాయమూర్తులను హైకోర్టు బదలీ చేసింది. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) లుగా పనిచేస్తూ జిల్లా, సెషన్స్ జడ్జిలుగా ఇటీవల పదోన్నతి పొందిన పలువురికి కొత్త స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చింది. మొత్తం 72 మందిని బదలీ చేసి, వారికి కొత్త స్థానాలు ప్రకటించింది. వీరందరూ కొత్త స్థానాల్లో మే 7 లోపు బాధ్యతలు తీసుకోవాలని పేర్కొంది. హైకోర్టు రిజిస్ట్రార్ ఇప్పటికే ఈమేరకు నోటిఫికేషన్ జారీ చేశారు. విజయవాడ రెండో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న న్యాయాధికారి ఎ.సత్యానంద్‌ను ప్రకాశం జిల్లా (ఒంగోలు) ప్రధాన న్యాయమూర్తి(పీడీజే)గా నియమించారు. విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావును పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జిగా బదలీ చేశారు. నెల్లూరు మూడో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న ఎల్.తేజోవతిని విజయవాడ ఏసీబీ కోర్టు/మూడో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారిగా నియమించారు. తిరుపతి 10వ అదనపు జిల్లా టి.రామచంద్రుడిని ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా నియమించారు. గుంటూరు 12వ అదనపు జిల్లా జడ్జిగా ఉన్న న్యాయాధికారి జి.చక్రపాణిని విశాఖలోని సీబీఐ కోర్టు ప్రధాన ప్రత్యేక జడ్జిగా నియమించారు.

# మానవ అక్రమ రవాణా నేరం

● ఎపి మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ రాయపాటి శైలజ



**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** మానవ అక్రమ రవాణా అంటే.. ఒకే రకమైన నేరం కాదని, ఇది అనేక రూపాల్లో జరుగుతుందని ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ రాయపాటి శైలజ వ్యాఖ్యానించారు. విద్యార్థులను విదేశాలకు పంపిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. పలు మార్గాల్లో ట్రాఫికింగ్ జరుగుతుంతోందని వెల్లడించారు. ముఖ్యంగా, బాధితులను గుర్తించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ట్రాఫికింగ్ మాఫియా తమ విధానాలను మార్చు కుంటున్నాయని, సోషల్ మీడియా ద్వారా కూడా యువతను టార్గెట్ చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా బీటెక్ చదువుతున్న విద్యార్థులను విదేశాలకు తీసుకెళ్లి, వారిని సైబర్ నేరాల్లో పాల్గొనేలా చేస్తున్నారన్నారు. ఇది సాధారణంగా కనిపించని కొత్త రకం ట్రాఫికింగ్ అని, దీనిపై ప్రత్యేక అవగాహన అవసరమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మనుషుల అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్)పై అవగాహన పెంచేందుకు ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కీలక కార్యక్రమాలు చేపడుతున్నారు. విజయవాడ స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ హాల్‌లో శుక్రవారం మహిళల రక్షణపై ట్రాఫికింగ్‌ను అరికట్టండి రక్షణను బలోపేతం చేయండి అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, పిల్లలను లైంగిక దోపిడీ కోసం అక్రమ రవాణా (ట్రాఫికింగ్) చేయడం ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందన్నారు. యాంటీహ్యూమన్ ట్రాఫికింగ్ చర్యల ద్వారా ఈ సమస్యను అరికట్టడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. బాధితులకు భరోసా కల్పించడం, వారికి రక్షణ కల్పించడం ఈ సమావేశం ముఖ్య లక్ష్యమని తెలిపారు. బాధితులతో, ముఖ్యంగా ట్రామాలో ఉన్న వారితో ఎలా మాట్లాడాలి, కేసులను ఎలా విచారించాలి, వారి నుంచి కీలక సమాచారాన్ని ఎలా సేకరించాలి వంటి అంశాలపై సమగ్రంగా ఈ కార్యక్రమంలో అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రాఫికింగ్‌పై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు, గుర్తింపు విధానాలపై కూడా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే డివిజనల్ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని, ముఖ్యంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాయపాటి శైలజ తెలిపారు. ట్రాఫికింగ్ బాధితులను గుర్తించడం మాత్రమే కాకుండా, వారిని సైకలాజికల్‌గా ఎలా డీల్ చేయాలో కూడా ఈ కార్యక్రమంలో వివరించామని రాయపాటి శైలజ పేర్కొన్నారు.

బాధితులు మానసి కంగా చాలా ఒత్తిడిలో ఉంటారని, అందుకే వారికి సహాయం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు టెక్నాలజీని కూడా ఉపయో గిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా విశాఖపట్నంలో రోబోటిక్ సిస్టమ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది భవిష్యత్తులో ట్రాఫికింగ్‌ను అరికట్టడంలో కీలక పాత్ర పోషించవచ్చని అభిప్రాయపడ్డారు. కేవలం పోలీసులు మాత్రమే కాదు, ప్రతి ఒక్కరూ కూడా బాధ్యత తీసుకోవాలని పిలుపు నిచ్చారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని, సోషల్ మీడియాలో అపరిచితులతో సంబంధాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటే ట్రాఫికింగ్‌ను తగ్గించవచ్చని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 126 ట్రాఫికింగ్ కేసులు నమోదయ్యాయని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పరిస్థితులు మెరుగ్గా ఉన్నప్పటికీ కేసుల సంఖ్యను తగ్గించడంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఆర్పీఎఫ్ ఎస్పీ షణ్ముఖం మాట్లాడుతూ స్త్రీ అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు వివరించారు. మాజీ ఐపీఎస్ అధికారి పి.ఎం. నాయర్ శిక్షకుడిగా వ్యవహరించి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో రైల్వే డివిజనల్ మేనేజర్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, మహిళా అభివృద్ధి శాఖ (జూడిదీ), చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టికెట్ల తనిఖీల ద్వారా రూ.10 కోట్ల ఆదాయం

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో టికెట్ల తనిఖీల ద్వారా రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. 22 రోజుల వ్యవధిలో రూ.10 కోట్ల ఆదాయాన్ని సాధించి దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే జోనల్ స్థాయిలో రికార్డు నెలకొల్పినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది అక్టోబరులో సాధించిన నెలవారీ ఆదాయం రూ.8.59 కోట్లను ఇప్పుడు అధిగమించింది. సీనియర్ డీసీఎం బి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో తనిఖీ సిబ్బంది విజయవాడ డివిజన్ వ్యాప్తంగా రైళ్లు, స్టేషన్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి టికెట్లు లేకుండా ప్రయాణించిన వారికి భారీగా జరిమానాలు విధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్‌కు రూ.76.34 కోట్ల ఆదాయం లభించింది. సీనియర్ డీసీఎం ప్రశాంత్ కుమార్‌ను డీఆర్ఎం మోహిత్ సొనాకియా, ఇతర అధికారులు అభినందించారు.

## ఎపి పట్టణ, నగర ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో రూ.2354 కోటు ఆస్తి పన్ను వసూళ్లు

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది రూ.2354.13 కోట్ల ఆస్తి పన్ను ఇప్పటికి వరకు వసూలైందని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ వెల్లడించారు. అంతకు ముందుతో పోల్చితే 16.57% వృద్ధి నమోదైందన్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలోనూ పన్ను వసూళ్లపై కమిషనర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఘనవ్యర్థాల నిర్వహణ, వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా తీసుకోవలసిన చర్యలు, వార్డుల పునర్విభజ తదితర అంశాలపై ఆయన సమీక్షించి, పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఘన వ్యర్థాల నియమాలు-2026 అనే అంశంపై విజయవాడలో గురువారం నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ల సదస్సులో 2025-26లో ఆస్తి పన్ను వసూళ్లలో ఉత్తమ పనితీరు కనబరిచిన పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల వివరాలను ప్రకటించారు. సంబంధిత కమిషనర్లకు పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి సురేశ్‌కుమార్, కమిషనర్ సంపత్‌కుమార్ శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. ప్రతిభ చూపిన పుర, నగరపాలక సంస్థలివీ.. గత ఏడాది అత్యధికంగా ఆస్తి పన్ను వసూలు చేసిన కార్పొరేషన్లల్లో గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమహేంద్రవరం ద్వితీయ శ్రేణి నగరపాలక సంస్థల విభాగంలో గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి మొదటి స్థానంలో నిలిచింది. కర్నూలు, విజయనగరం, నెల్లూరు రెండు, మూడు, నాలుగు స్థానాలు సాధించాయి.

**సెలక్షన్, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీల విభాగం:** మొదటినాలుగు స్థానాల్లో తాడిపత్రి, తాడేపల్లి గూడెం, కదిరి, మదనపల్లె నిలిచాయి.

**గ్రేడ్-1, 2, 3 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల విభాగం:** వినుకొండ, తాడిగడప, అద్దంకి, రాజాం, గొల్లప్రోలు మొదటి ఐదు స్థానాలు సాధించాయని వివరించారు.

## ట్రాఫిక్ ఈ-చల్లాన కేసు... డేటా ఎవాల్వ్‌కు సుప్రీం నోటీసులు

**విజయవాడ ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ట్రాఫిక్ ఈ-చలాన్ల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. డిజియాత్ర యాప్‌ను రూపొందించిన డేటా ఎవాల్వ్ ఆర్బిట్రేషన్ ఆదేశాలపై స్టే విధించింది. అక్రమంగా ట్రాఫిక్ చలాన్లు వసూలు చేశారని డేటా ఎవాల్వ్ సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. మూడేళ్లకే పరిమితమైన కాంట్రాక్టును అడ్డు పెట్టుకొని చలాన్లు వసూలు చేశారని రూ.37 కోట్లను సొంత ఖాతాలకు మళ్లించారని పిటిషన్ దాఖలు చేసింది. 2018-2021 మధ్య ఒప్పందం ఉందని కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఒప్పందం ముగిసినా అక్రమంగా చలాన్ల నిధులు మళ్లించారని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలో డేటా ఎవాల్వ్ సంస్థకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది .తదుపరి విచారణను మే 25కు వాయిదా వేసింది.

## ఇక నుంచి హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తాం

● నెల్లూరులో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ అజితా వేజెండ్ల




**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** నగరంలోని హోటళ్ళను ఎప్పుడైనా ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హోటల్ నిర్వాహకులను హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని పలు హోటళ్లను ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి కలెక్టర్, ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్ రియాజ్, బసోటో హోటళ్లను తనిఖీ చేసి ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రియాజ్ హోటల్ లో పరిసరాలు పరిశుభ్రంగా లేవని, శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బిర్యానీని స్వయంగా పరిశీలించారు. కిచెన్‌లో ఉన్న చికెన్‌ను ప్లాస్టిక్ కవర్లలో ఉంచకూడదని, పెరుగు ప్యాకెట్ ఎక్స్పైరీ డేట్ గడువు ఒక్కరోజుతో ముగుస్తుంటే ఇంకా ఎందుకు వాడకుండా ఉంచారని నిర్వాహకులను ప్రశ్నించారు. పెరుగును ఉదయాన్నే తీసుకొచ్చామని సాయంత్రం వంటకానికి వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్ళ నిర్వాహకులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పకుండా పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన తాజా ఆహార పదార్థాలను అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా నిల్వ ఉంచకూడదని సూచించారు. ప్రధానంగా హోటల్లో పరికరాలు, వంటగది, భోజన శాల అత్యంత పరిశుభ్రంగా ఉండాలని, తాజా నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందించాలని ఆదేశించారు. మాంసాన్ని నిల్వ ఉంచినా, వినియోగదారుల నుంచి హోటళ్ళపై ఏ ఒక్క ఫిర్యాదు అందినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటల్ రియాజ్, బసట హోటళ్లకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇంప్రూవ్మెంట్ నోటీసులను జారీ చేశారు. రెండు వారాల్లోగా హోటల్‌లను పరిశుభ్రంగా, పరిసరాలను, వంటగదిని అత్యంత పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటళ్ళ నిర్వాహకులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటేశ్వరరావు, తూనికల కొలతల అధికారి ఐజాక్,ఆర్డీవో అనూష, తాసిల్దార్ షఫీ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## హనీ ట్రాప్ విచారణలో ట్విస్ట్ మీద ట్విస్ట్

● కస్టడీలో కింగ్ పిన్ నరేంద్రరెడ్డి ● క్యూలో మరో 40 మంది ఇంటి దొంగలు

● ఆ సిఐలకు వీఆర్‌తోనే సరిపెడతారా?


నిందితులను కోర్టుకు తీసుకు వెళ్తున్న పోలీసులు

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** సంచలనం సృష్టించిన హని ట్రాప్ కేసు పూటకో ట్విస్ట్ మీద ట్విస్ట్‌గా నిలుస్తోంది. ఓ ట్రైనీ ఐపీఎస్ అధికారితో రహస్య విచారణకు శ్రీకారం చుట్టారు. వందలమంది బాధితులు ఈ ఉచ్చులో పడి సర్వం కోల్పోయారు. ధైర్యం చేసి 20 మంది ముందుకు రాగా కేసులు, కోర్టు వివాదాల్లో ఎందుకని చాలా మంది వెనకడుగు వేశారు. వీరంతా తెరపైకి వస్తే కోట్లాది రూపాయలు దోచుకున్న బాగోతం బయటకు వస్తుంది. ఇప్పటికే రూ.1.4 కోట్ల దాకా లావాదేవీలు జరిగాయని అనంతపురం రూరల్ డీ ఎస్పీ శ్రీనివాసులు స్పష్టం చేసారు. రుద్రంపేట మాజీ ఉపసర్పంచ్ నరేంద్ర రెడ్డి కింగ్ పిన్‌గా చెలామణి అయ్యాడు. చిన్ని అలియాస్ రంగమ్మ నాయుడుతో విభేదాలు ఏర్పడ్డాయి. ఆర్థిక లావాదేవీలు వీరి మధ్య బెడిసి కొట్టాయి. దీంతో ఆమె నుండి విడిపోయి కొత్తగా హనీ ట్రాప్ ను ఇద్దరు యువతులతో కలిసి షురూ చేసాడు. ఈ వ్యవహారంలో పోలీసుల విచారణ మరింతగా స్పీడ్ అందుకుంది. ఈ గలీజ్ దందాలో ముందుగా తెరపైకి హనీ ట్రాప్ ముఠానే అని భావించారు. కానీ తెర వెనుక వీరితో కీలక సంబంధాలు పెట్టుకున్న ఇంటి దొంగలు కూడా ముందు వరుసలో ఉన్నారు. 30 నుండి 40మంది దాకా వీరితో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో బహిర్గ తమైనట్లు తెలిసింది. ఈ హనీ క్రీడలో ఇప్పటికే ఇద్దరు సిఐలు ఔట్ అయ్యారు. 3 టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, రాప్తాడు సీఐ శ్రీహర్షకు కర్నూలు రేంజ్ డీఐజీ ఎదుట హాజరు కావాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కేసులో ఇంకా కొందరు సిఐలు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పదుల సంఖ్యలో కానిస్టేబుళ్ళు ఉన్నట్లు అధికారులు ఆధారాలు సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొందరు లేడి డాన్ చిన్ని అలియాస్ రంగమ్మ నాయుడుతో కలిసి పంచాయతీలు, సెటిల్మెంట్లు చేయడం, మరికొందరు ఆంటీలు అమ్మాయిలతో కలిసి విలాసాల కోసం టూర్‌లకు వెళ్లడం జరిగినట్లు బహితమైంది. అనంతపురంరూరల్, రాప్తాడు ఇటుకులపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది ముఠా సభ్యులతో మాట్లాడిన ఫోన్ సంభాషణ ఆడియో బయటకు పొక్కింది. వీటిని ఆధారంగా చేసుకుని అధికారులు విచారణ వేగవంతం చేశారు. దీంతో పోలీసు వర్గాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. హనీ ఉచ్చు ఎవరెవరి మెడకు చుట్టుకుంటుందోనని ఖాకీలు కలవరపాటుకు గురవుతున్నారు. తమ పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోననే చర్చ పోలీస్ శాఖలో హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ కేసులో సంబంధాలు ఉన్న వారికి పోలీస్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న భయాందోళనలు వారిలో వెంటాడుతూనే ఉన్నాయి. ఈ అంశం ప్రస్తుతం అనంతపురం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గతంలో రుద్రంపేట గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌గా పనిచేసిన నరేంద్ర రెడ్డి పేరు కొత్తగా తెరపైకి వచ్చింది. దీంతో హనీ దందా కేసు రాజకీయ రంగు పులుముకోవడంతో కొత్త మలుపులు తిరిగింది. ఈ పాపంలో కింగ్ పిన్ గా వ్యవహరించిన నరేంద్ర రెడ్డి వారితో సన్నిహితంగా ఉండి వారి కార్యకలాపాల్లో ఈయన హస్తం ఉన్నట్లు అంచనాకు వచ్చారు. ప్రస్తుతం వున్న హనీ గ్యాంగ్ విభేదాలొచ్చాయి. దీంతో చీలిక ఏర్పడి ఇద్దరు యువతులతో కలిసి సొంతంగా కొత్త దందాకు తెర లేపారు. సంపన్న వర్గాల నుండి లక్షల రూపాయలు దోచుకున్నారు. దీంతో పోలీసులు ఈయనను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. నరేంద్ర రెడ్డి పాత్ర ముఠా సభ్యులకు ఏ స్థాయిలో ఉందో, సంపన్నుల నుండి నేరుగా ముఠాతో చేతులు కలిపి లక్షణాలు లక్షలు గుంజినట్లు సాగుతున్న ప్రచారం కూడా లేకపోలేదు.

ఇదిలా ఉండగా హనీ ట్రాక్ కేసులో మరో నలుగురు నిందితులైన దబ్బర రాజేష్ నాయుడు, చంద్రకళ, జయమ్మ, అనంత కుమారిలను పోలీసులు శుక్రవారం జిల్లా కోర్టు ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి వీరికి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. అయితే ఈ నేరాల్లో కీలక పాత్ర పోషించిన ఆ ఇద్దరు సీఐలను కేవలం వేకెన్సీ రిజర్వ్ తోనే సరిపెట్టి చేతులు దులుపుకున్నారనే అపవాదులు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నేరాలు చేసిన నిందితులకు భారతీయ శిక్షాస్మృతి సమానంగా ఉంటుందని, మరి పోలీసు అధికారులకు ఈ చట్టాలు వర్తించవా? అని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. దీన్నిబట్టి చూస్తే చట్టాలను తమ చుట్టాలు లాగా మార్చుకోవడం పోలీసు శాఖకి చెల్లుబాటు అవుతుందని ప్రచారం జోరుగా సాగుతోంది. తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందే నిన్న భయంతో భవిష్యత్తులో ఎలాంటి నేరాలు జోలికి వెళ్లకుండా ఉండేందుకు శిక్షలు పౌరులతో సమానంగా అందరికీ ఒకేలా వర్తించేలా చర్యలు తీసుకోవాలని భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా పోలీసులు అదుపులో ఉన్న రుద్రంపేట మాజీ ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డి గురించి భిన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగర మాజీ మేయర్ వసీం, వైసిపి నగర అధ్యక్షునితో మీడియా సమావేశం నిర్వహించారు. నరేందర్ రెడ్డికి గత నాలుగేళ్ల కిందటే వైసిపి దూరం పెట్టిందని చెప్పారు. మీడియాలో వైసిపి నాయకుడని పదేపదే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నరేందర్ రెడ్డి కి వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ఆయన దగ్గరికి వెళ్లి శుభాకాంక్షలు చెప్పాడని, అతను టిడిపి పార్టీకి చెందిన వాడుగా వ్యాఖ్యానించారు. అయితే నరేందర్ రెడ్డిని పార్టీకి దూరం పెట్టామంటూ టిడిపి నాయకులు ఖండించారు. ఇలా ఇరు పార్టీల వారు నరేందర్ రెడ్డి తమ పార్టీకి చెందిన వాడు కాదంటూ పరస్పర వ్యాఖ్యానాలు చేయడంతో పొలిటికల్ హీట్ ఎక్కింది.

## డైరెక్టర్ లేక వెలవెల పోతున్న శ్వేత!



**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఉద్యోగుల శిక్షణా సంస్థ శ్వేత ఆలనా పాలనా లేక వెల వెల బోతున్నది. ఉద్యోగులలో సామర్థం నైపుణ్యాలు, నైతిక విలువలు, ఆధ్యాత్మిక భావం, సేవాభావం పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు అయిన శ్వేతక కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి డైరెక్టర్ లేకపోవడం విశేషం. వైసిపి పాలనలో భూమన కరుణాకర్ రెడ్డి టిటిడి చైర్మన్ ఉన్న సమయంలో ఆయన అన్న విశ్రాంత లెక్చరర్ భూమన సుబ్రమణ్యం రెడ్డిని శ్వేత డైరెక్టర్‌గా నియమించారు. 2024 జూన్‌లో రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత భూమన డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. దీనితో అదే సంవత్సరం ఆగస్టు నెలలో నియామకం కోసం టిటిడి నోటిఫికేషన్ ఇచ్చింది. తగిన అర్హతలు ఉన్న వారు లేకపోవడంతో అది రద్దు 2025 జూన్ నెలలో కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చారు. ఏదైనా పిజీలో 60 శాతం మార్కులు సాధించి పదేళ్ల అనుభవం ఉన్న 35-65ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరారు. డైరెక్టర్‌కు నెలకు లక్ష రూపాయలు జీతం నిర్ణయించారు. దీనితో 45 మందికి పైగా దరఖాస్తులు చేశారు. ఇందులో నలుగురు ఎంబీఏ, పిహెచ్‌డి చేసి అనుభవం ఉన్నవారు ఉన్నారు. వీరిలో ఇద్దరికి ఐఐటిలో పని చేసిన అనుభవం ఉంది. ఇందులో ఒకతను ఐఐఎం లో ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్‌లో శిక్షణ పొంది జాతీయ స్థాయిలో శిక్షకునిగా పేరు పొందారు. మూడవ వ్యక్తి ఉన్నత స్థాయి విద్యా సంస్థల అధిపతిగా ఉన్నారు. నాలుగవ వ్యక్తి డాక్టర్ కోర్సు చేసి టిటిడిలో పని చేస్తున్నారు. ఇంకా కొందరు పీజీ చేసి బోధన, పాలనలో అనుభవం ఉన్న వారున్నారు. అయితే శ్వేత లాంటి సంస్థలో పనిచేసిన అనుభవం లేదన్న సాకు చెప్పి వీరిని ఎంపిక చేయకుండా అనవసర ఆలస్యం చేస్తున్నారు. కొందరు అధికారులు తమ వారికి దొడ్డి దారిలో పదవి కట్టబెట్టేందుకే అవరోధాలు సృష్టిస్తున్నారని కొందరు అంటున్నారు.

2002లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ఈవోగా ఉన్న కృష్ణయ్య శ్వేతను ఏర్పాటు చేశారు. ఎంబీఏ, పిహెచ్‌డి చేసి శిక్షణా రంగంలో పదేళ్ల అనుభవం ఉన్న వారిని డైరెక్టర్‌గా పెట్టాలని నిర్ణయించారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంస్థల్లో నైపుణ్యాలు పెంచడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్న సందర్భంలో శ్వేత నత్త నడక నడవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. శ్వేతను విస్తరించి విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత అర్హతలు, అనుభవం ఉన్న వారిని శ్వేత డైరెక్టర్‌గా నియమించాలని కోరుతున్నారు. ప్రస్తుతం దరఖాస్తు చేసిన వారిలో షార్ట్ లిస్టు తయారు చేసి, పారదర్శకంగా ఇంటర్వ్యూ నిర్వహించాలని శ్వేత సీనియర్ ఫ్యాకల్టీ, ఏపీ చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి శుక్రవారం టిటిడి కార్యనిర్వహణాధికారికి లేఖ రాశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు శ్వేత అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పేద విద్యార్థికి లాప్‌టాప్ బహుకరణ



**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ చదువుతున్న పేదవిద్యార్థికి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ల్యాప్ టాప్ బహుకరించారు. గత నెల 21న కలెక్టర్ లక్ష్మీశా విజయవాడ విద్యాధరపురంలోని అన్న క్యాంటిన్‌ను తనిఖీ చేసారు. పక్కనే భోజనం తింటున్న ఇంజనీరింగ్ విద్యార్ది జక్కంపూడి కాలనీకి చెందిన శ్రీనాథ్‌తో మాటకలిపారు. విద్యార్ది వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను భీమవరంలోని విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నానని తెలిపాడు. చదువుకునేందుకు సాయం కావాలా అని కలెక్టర్ కోరగా తనకు ల్యాప్‌టాప్ కావాల్సి ఉందని ఆర్థికంగా ఇబ్బంది కరంగా ఉండటంతో ల్యాప్‌టాప్ కొనే స్తోమత లేదని కలెక్టర్‌కు తన దుస్థితిని వివరించాడు. అతని వివరాలను తీసుకున్న కలెక్టర్ నెలరోజుల వ్యవధిలో కలెక్టర్ తన సొంతనిధులతో ల్యాప్‌టాప్ కొనుగోలు చేసి ఎమ్మెల్యే సుజనాచౌదరి చేతుల మీదుగా శనివారం శ్రీనాథ్‌కు అందచేసారు.



# దుర్గమ్మ ఆలయంలో ఎండ నుండి రక్షణకు వినూత్న చర్యలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో వేసవి తాపం నుండి రక్షించేలా వినూత్న చర్యలను ఇఒ వికె శీనానాయక్ చేపట్టారు. ముఖ్యంగా ఆలయంలో ఎండవేడిమి తగలకుండా ఆలయంలో పలుచోట్ల పైకప్పు మాదిరిగా పలు రకాల మ్యాట్లను ఏర్పాటు చేయడంతో ఎండవేడిమి నుండి భక్తులకు రక్షణ లభించింది.

**111 రోజులకు మజ్జిగ వితరణకు విరాళం:** దుర్గమ్మవారి భక్తులకు ఎండాకాలంలో ఆలయంలో ఏర్పాటు చేసిన మజ్జిగ వితరణ పథకానికి ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 111 రోజులకు రు.650 రూపాయలు చొప్పున రు.72,150లను విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఇఒ వికె శీనానాయక్, పాలక మండలి సభ్యులు బడేటి ధర్మారావు పాల్గొన్నారు.



**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,01,116ల విరాళాన్ని విజయవాడ, రామవరప్పాడుకు చెందిన జి శేఖర్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.




# గిరిజన సమస్యలు పరిష్కరిస్తాం

## ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జిరెడ్డి

**మార్కాపురం, ఏప్రిల్ 24 ,ప్రభాతవార్త:** గిరిజన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కెఆర్ గ్రాండ్ రెసిడెన్సీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధికారులతో గిరిజన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగాల భర్తీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లయితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త జిల్లా కావడంతో కొంత సమయం ఇస్తున్నామని, అధికారులు రికార్డులను సరిచేసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమానికి అవసరమైన నిధులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధులనుమెరుగుపరచేందుకు పాడి గేదెలు, గొర్రెల పంపిణీకి సంబంధించిన రుణాలను అందించాలని అధికారులకు సూచించారు. అలాగే గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను మరమ్మతులు చేసి సౌకర్యవంతంగా మార్చాలని, గృహ నిర్మాణాలు మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులపై బాధితులకు అందించిన నష్టపరిహారం వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కే. లక్ష్మి, సి. వెంకటప్ప, కే. మల్లేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, ఐటిడిఏ పీవో పీవీఎస్ నాయుడు, ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బిసి బిడ్డ కుటుంబానికి ఆర్థికసాయం: మంత్రి సవిత

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాలు కోల్పోయిన కడప జిల్లా తొండూరు బీసీ హాస్టల్ విద్యార్థి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు మంత్రి ఎస్.సవిత తెలిపారు. బిడ్డ చనిపోతే కన్నతల్లి పడే వేదన వర్ణనాతీతమని, ఆ శోకం నుంచి కోలుకోవడం అసాధ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆ కుటుంబానికి తాము ఉన్నామనే భరోసా కల్పించడానికే ఈ చిన్నపాటి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వేంపల్లి మండల కేంద్రానికి చెందిన గురు ప్రణీత్ కుమార్(11) తొండూరు బీసీ హాస్టల్ ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడన్నారు.

వేసవి సెలవులు ఇవ్వడంతో, అదే హాస్టల్ లో ఎనిమిదో తరగతి చదువుతున్న అన్నయ్య, తల్లితో కలిసి ఆటోలో సొంతూరు పయనమయ్యా దన్నారు. వాటర్ బాటిల్ కొని తిరిగి వస్తుండగా, టిప్పర్ లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో గురు ప్రణీత్‌కుమార్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. పసి ప్రాయం లోనే విద్యార్థి విగతజీవిగా మారడం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. ఇదే విషయం సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగానే, బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారన్నారు. త్వరలోనే ఈ ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేస్తామని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

# గడువు ముగుస్తోంది!

- కల్తీనెయ్యిలో పూర్తికావచ్చిన ఏకసభ్య కమిటీ విచారణ
- ప్రభుత్వానికి ఈ వారంలో నివేదికలు

**తిరుమల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి లడ్డూల తయారీకి 2019-24 మధ్య కాలంలో అవసరమైన నెయ్యి సరఫరా టెండర్లు దక్కించుకుని చివరకు కల్తీనెయ్యి పంపిన కేసు విచారణ దాదాపు ముగింపుకు వచ్చిందని తెలుస్తోంది. చాలా రోజులు సైలెంట్‌గా సాగిన ఈ దర్యాప్తులో కమిటీ ప్రతినిధి ఆలయం ముందుకు రావడంతో కొంత సంచలనంగా మారింది. ఈ కేసులో అసలైన దోషులను గుర్తించి వారిపై చర్యలకు ఉపక్రమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండునెలల క్రిందట విశ్రాంత ఐఏఎస్ అదికారి, విశ్రాంత సిఎస్ దినేశ్ కుమార్‌ను నియమించిన విషయం విదితమే. ఆయనకు సహాయకులుగా టిటిడి ఉద్యోగులను డిప్యూటేషన్‌పై పంపారు. నలుగురు సభ్యులు కలసి తొలుత నెయ్యి సరఫరాకు టెండర్లు దక్కించుకున్న ఘటన నుండి చివరకు లబ్ధిపొందిన వ్యక్తుల వరకు పూర్తి సమాచారం సేకరించారు. ఇప్పటికే సిబిఐ సిట్ కూడా కీలక నివేదికలు ప్రభుత్వానికి అందజేయడంతో గత ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్‌ను బదలీచేసింది. ఆయనకు పోస్టింగ్ కల్పించలేదు. ఇక టిటిడి ముఖ్యగణాంకాధికారి ఒ.బాలాజీ దీర్ఘకాల సెలవుపెట్టి వెళ్ళిపోయారు. ఇంకా కొందరు అధికారులు, ఉద్యోగుల పాత్ర ఉన్నా ఆ దిశగా ఏకసభ్య కమిటీ కూడా చర్యలు తీసుకునేందుకు నివేదికలు సిద్ధం చేసిందని తెలుస్తోంది. శుక్రవారం ఉదయం ఏకసభ్య కమిటీ చీఫ్ దినేశ్ కుమార్ తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనను కలసిన మీడియాతో కూడా ఏమీ మాట్లాడటానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో నివేదికలు ఏముందనేది ఉత్కంఠ. కల్తీనెయ్యి పాపంలో ఎవరున్నారనే అంశంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టిన ఏకసభ్య కమిటీ సమగ్ర వివరాలు సేకరించింది. కొందరి నుండి సమాధానాలు రాబట్టి సూత్రధారులు ఎవరనేది దాదాపుగా కొలిక్కి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పుడు అసలు ఈ మూడు డైరీలకు నెయ్యి



సరఫరాకు టెండర్లు ఇప్పించిన వెనుక అసలు సూత్రదారులు వెలుగులోకి వస్తారనేది గుప్పుమంటోంది. టిటిడి మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ళు విభాగంలో, పోటు, విజిలెన్స్‌కు సంబంధించి 12మంది అధికారులు ప్రమేయం ఉందనేది దాదాపు నిర్ధారణకు వచ్చారు.



# పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి

## పంచాయతీరాజ్ డైరెక్టర్ ఎం.కృష్ణ తేజ

**గుంటూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపట్టడం జరుగుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ ఎం. కృష్ణ తేజ అన్నారు. జిల్లా పరిషత్ లో శుక్రవారం నిర్వహించిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో కృష్ణ తేజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామీణ అభివృద్ధికి మూల స్థంభం అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కావడం అవసరమని అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించి ప్రోత్సహించడం జరిగిందని తద్వారా ఉత్సాహంతో పనిచేయగలరని పేర్కొన్నారు. పంచాయతీలు కేవలం పథకాల అమలు వరకే పరిమితం కాకుండా స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు అధికారాలు సమకూర్చి ప్రతి గ్రామం అభివృద్ధి చెందే దిశగా కృషి చేస్తుందని చెప్పారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ, మ్యాజిక్ డ్రైన్‌లు, పల్లె పండుగ, అడవితల్లి పథకం వంటి పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. రహదారులు, కాలువలు, పారిశుధ్యం తదితర కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఏ పథకం ప్రవేశపెట్టిన విజయం అవుతుందని, స్వర్ణ పంచాయతీ పథకం ద్వారా పన్ను వసూలు చేయడంలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని చెప్పారు. సోషల్ ఆడిట్‌లు సైతం దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వ్యక్తులకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టిన, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్.కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం డిఎస్పీపై హైకోర్టు ఆగ్రహం

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** భీమవరం డీఎస్పీపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. లైంగిక దాడి కేసులో ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని డీఎస్పీ బెదిరిస్తున్నారని పిటిషన్ వేయగా విచారించిన న్యాయస్థానం డీఎస్పీ వైఖరిని తప్పుపట్టింది. డీఎస్పీ బెదిరిస్తున్నారని బాలిక తల్లి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఈ మేరకు వ్యాఖ్యానించింది. బాధితురాలిని పోలీసులు బెదిరించడం ఏంటని ప్రశ్నించింది. బాలికకు అండగా ఉండాల్సిన వాళ్లే ఇలా చేస్తే ఎలా అని హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ కారణాలతోనే అలా చేశానని డీఎస్పీ చెప్పడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రాజకీయ ఒత్తిడి తట్టుకోలేకపోతే రాజీనామా చేయాలని హైకోర్టు డీఎస్పీపై మండిపడింది. కేసు రికార్డులతో తమ వద్దకు రావాలని సంబంధిత ఎస్పీకి ఆదేశించింది.

**సిట్ విచారణకు హాజరుకావాలని రాజ్ కెసిరెడ్డి, కారుమూరికి హైకోర్టు ఆదేశం**

సిట్ విచారణకు హాజరుకావాలని రాజ్ కెసిరెడ్డి, కారుమూరికి హైకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా కారుమూరి కుటుంబసభ్యులు సైతం విచారణకు హాజరుకావాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఈ నెల 30న సిట్ అధికారి వద్ద విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణను మే 4కు వాయిదా వేసింది.

# ఐఏఎస్ అహ్మద్‌పై దాఖలైన వ్యాజ్యంలో 27న ఉత్తర్వులిస్తాం: హైకోర్టు

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐఏఎస్ అహ్మద్‌పై దాఖలైన వ్యాజ్యంలో ఈ నెల27 సోమవారం రోజున ఉత్తర్వులు ఇస్తామని హైకోర్టు పేర్కొంది. ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకుండా అహ్మద్ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపణలు రాగా రమేశ్‌కుమార్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. దాంతో కేసును పరిశీలించిన హైకోర్టు ఐఏఎస్ అధికారి అహ్మద్‌బాబు వైఖరిని తీవ్రంగా తప్పుబట్టింది. పిటిషనర్ వినతిపై సీఎస్ తీసుకున్న చర్యలను తమ ముందు ఉంచాలని ఏజీకి హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ వినతిని సీఎస్ పరిశీలిస్తున్నా రని ఈ సందర్భంగా ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పారు.

# కలెక్టరేట్‌లో వేధింపుల ఆరోపణలపై మహిళా కమిషన్ విచారణ

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లో వేధింపుల ఆరోపణలపై మహిళా కమిషన్ విచారణ చేపట్టింది. మహిళా ఉద్యోగిని ఫిర్యాదుతో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ విచారణ జరిపారు. ఇందులో ప్రధానంగా జిల్లా ట్రెజరీ కార్యాలయ ఉద్యోగినిని సీనియర్ అసిస్టెంట్ వేధిస్తున్నట్లు ఆరోపణలు ఎదురయ్యాయి. వేధింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఉద్యోగిని ఆవేదన వ్యక్తంచేసింది. బాధితురాలి ఫిర్యాదుతో ట్రెజరీ ఆఫీసుకు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వెళ్లి, కార్యాలయ ఉద్యోగులను ప్రశ్నించారు. అంతేకాకుండా లోకల్ కంప్లైట్స్ కమిటీని కూడా మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ విచారించారు.

# బెంగాల్‌లో భారీ ఓటింగ్ సంతోషకరం

## హింస లేకపోవడమూ మంచిదే: సుప్రీం త్రిసభ్య ధర్మాసనం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో గురువారం రికార్డు స్థాయిలో ఓటింగ్ జరగడాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం స్వాగతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ విపిన్ పంచోలిలతో కూడిన ధర్మాసనం, రాష్ట్రంలో ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి హింసాకాండ జరగకపోవడం పట్ల కూడా సంతృప్తి వ్యక్తం చేసింది. భారత ఎన్నికల సంఘం ప్రకారం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల మొదటి దశలో 91.78శాతం ఓటింగ్ నమోదైంది. స్వాతంత్రం తర్వాత ఇదే అత్యధిక ఓటింగ్ శాతం. 2011లో నమోదైన 84.72 శాతం ఓటింగ్ దీనికి ముందు రికార్డు. 'భారత పౌరుడిగా, ఈ ఓటింగ్ శాతాన్ని చూసి తాను చాలా సంతోషించాను. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడు, అది ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తుంది' అని సిజెఐ కాంత్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా, జస్టిస్ బాగ్చి మాట్లాడుతూ, 'ఎలాంటి హింసాత్మక ఘటనలు కూడా జరగలేదు' అని అన్నారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాలపై చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)ను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై కోర్టు విచారణ జరుపుతోంది. ఎన్నికలకు ముందు ఈ ప్రక్రియను నిలిపివేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఓటర్ల జాబితాల నుండి తొలగింపును ఎదుర్కొంటున్న వారి వాదనలను విచారించడానికి న్యాయా ధికారులను, విశ్రాంత న్యాయమూర్తులను నియమించాలని ఆదేశించింది. గురువారం సుమారు 92శాతం ఓటింగ్ జరిగిందని సీనియర్ న్యాయవాది కళ్యాణ్ బంద్యోపాధ్యాయ్ ఈరోజు కోర్టుకు తెలియజేశారు. వలస కార్మికులు సుదూర ప్రాంతాల నుంచి ఓటు వేయడానికి వచ్చారని ఆయన తెలిపారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా ఓటింగ్ శాతం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. "92 శాతం అనేది చరిత్రా త్మక ఓటింగ్ శాతం. కానీ కొన్ని సంఘటనలు మినహా ఇది




శాంతియుత ఎన్నికలు" అని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, అప్పీలేట్ ట్రిబ్యునల్స్ అతి తక్కువ సంఖ్యలో ఓటర్ల కేసులను మాత్రమే పరిష్కరించాయని కోర్టుకు తెలియజేశారు. "దాఖలైన 27 లక్షల అప్పీళ్లలో కేవలం 136 మాత్రమే పరిష్కరించబడ్డాయి. ఇది చాలా చాలా విచారకరం," అని బంద్యోపాధ్యాయ్ సమర్పిం చారు. ఈ విషయంలో కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించవచ్చని సిజెఐ కాంత్ వ్యాఖ్యానించారు.

# అబార్షన్‌పై మహిళకు స్వేచ్ఛ

## 15 యేళ్ల బాలిక కేసులో 7 నెలల గర్భాన్ని తొలగించుకునేందుకు సుప్రీం అనుమతి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** ఏడు నెలలకు పైగా గర్భాన్ని కొనసాగించాల ను కుంటున్న 15 యేళ్ల బాలికకు, వైద్యపరంగా గర్భాన్ని తొలగించుకోవడానికి సుప్రీం కోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. ఏ మహిళను, ముఖ్యంగా మైనర్‌ను, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఇష్టంలేని గర్భాన్ని మోయమని బలవంతం చేయరాదని కోర్టు నొక్కి చెప్పింది. ఒక మహిళ యొక్క పునరుత్పత్తి ఎంపికకే ప్రాధాన్యత ఇవ్వాలని జస్టిస్ బి.వి. నాగారత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

అటువంటి గర్భాన్ని కొనసాగించమని బలవంతం చేయడం వల్ల ఆ మైనర్ మానసిక ఆరోగ్యం, విద్య, సామాజిక హోదా, సమగ్ర అభివృద్ధిపై తీవ్రమైన, దీర్ఘకాలిక ప్రభావాలు పడతాయని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం పునరుత్పత్తి స్వేచ్ఛ అనేది వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యతలో ఒక ముఖ్యమైన భాగమని కోర్టు నొక్కి చెప్పింది. ఇష్టంలేని గర్భాన్ని కొనసాగించమని ఒక మహిళను బలవంతం చేయడం ఆమె ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. 'ఏ కోర్టు కూడా ఏ మహిళను, మరీ ముఖ్యంగా ఒక మైనర్‌ను, ఆమె స్పష్టమైన ఇష్టానికి వ్యతిరేకంగా గర్భాన్ని పూర్తి కాలం మోయమని బలవంతం చేయకూడదు' అని ధర్మాసనం పేర్కొంది. అటువంటి బలవంతం తీవ్రమైన భావోద్వేగ, మానసిక, శారీరక క్షోభకు దారితీస్తుందని కూడా ధర్మాసనం తెలిపింది. పుట్టబోయే బిడ్డ కంటే గర్భం కొనసాగించే విషయంలో ఆ మహిళ తీసుకునే నిర్ణయానికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇష్టం లేకుండా ఆ బాలిక తన గర్భాన్ని కొనసాగిస్తే అది ఆమె మానసిక ఆరోగ్యం, విద్యావకాశాలు, సామాజిక స్థితిగతులపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఒక బిడ్డకు జన్మనిచ్చే విషయంలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఆమెకు ఉండాలి. ఒక అవాంఛిత గర్భాన్ని కొనసాగించమని మహి ళను ఒత్తిడి చేయడం అంటే.. ఆమె రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# గంజాయి లేడీ డాన్‌పై పిడి యాక్ట్

## నిందితురాలు నాగమణిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు

**గుంటూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోనే తొలిసారిగా ఓ మహిళ పై పిడీ యాక్ట్ అమలు చేస్తూ గుంటూరు జిల్లా పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలలో తరచుగా పాల్గొంటున్న మహిళపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్బంధ (పిడీ యాక్ట్) ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణానికి చెందిన వల్లూరి నాగమణి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలలో నిరంతరం పాల్గొంటున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఆమె పై ఇప్పటికే తాడేపల్లి పోలీస్ స్టేషన్ లో నాలుగు గంజాయి కేసులు వున్నాయి. ఆమె వద్ద నుండి సుమారు 5 కేజీల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఆమెపై ఎన్ని కేసులు పెట్టినా నేర ప్రవర్తనను మార్చుకోకుండా గంజాయి సంబంధిత నేర కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగిస్తూ, సమాజంపై చెడు ప్రభావాన్ని తీసుకువస్తుంది. ఈ క్రమంలో ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని నాగమణి పై పీడీ చట్టం ప్రయోగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా నాగమణి పై పిడీ యాక్ట్ ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో తొలిసారిగా మహిళా నిందితురాలు నాగమణిపై పోలీసులు పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం ప్రయోగించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

# రామవరప్పాడులో కొత్తగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** విజయవాడ రామవరప్పాడులో కొత్తగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. శనివారం సాయంత్రం రామవరప్పాడులోని హనుమాన్‌నగర్‌లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కొన్ని అర్జీలను స్పాట్‌లోనే పరిష్కరించగా మిగిలినవాటిని వేగవంతంగా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులను



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న యార్లగడ్డ వెంకట్రావ్

ఆదేశించారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ విజయవాడలో అంతర్భాగమైన రామవరప్పాడులో 20వేలకు పైగా జనాభా ఉన్నారని ఇక్కడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించామని త్వరలో మంజూరు అవుతుందన్నారు. పోలీస్‌స్టేషన్ భవనం కోసం స్థలం కేటాయించాలని రూరల్ తాహసీల్దార్‌కు సూచించారు. అలాగే ఇక్కడ అన్నక్యాంటిన్ ఏర్పాటు చేసి పేదలకు తక్కువ ధరకు ఆహారం అందిస్తామని హామీ ఇచ్చారు. రామరప్పాడు గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని వాటికి స్థలం కేటాయించాలని తాహసీల్దార్‌కు సూచించారు. గ్రామంలో రూ.1.20కోట్లతో మూడు విలేజ్ హెల్త్‌క్లీనిక్‌ల నిర్మాణం త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు యార్లగడ్డ స్పష్టం చేసారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గన్నవరం నియోజకవర్గంలో అవినీతి రహిత పాలన అందిస్తూ, దోపిడిలు, అరాచకాలకు చరమగీతం పాడి ప్రజలకు ప్రశాంతంగా జీవించేందుకు అనువైన వాతావరణం కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. గన్నవరం అభివృద్ధికి ప్రజలందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో విజయసాయిరెడ్డి ఇంట్లో దాదాపు 13 గంటలపాటు సోదాలు

**విజయవాడ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కేసులో హైదరాబాద్‌లోని విజయసాయిరెడ్డి ఇంట్లో దాదాపు 13 గంటలపాటు సోదాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఈడీ సోదాల్లో నా వద్ద ఏమీ లభించలేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. మా అమ్మ చికిత్స కోసం రూ.6 లక్షల ఉంచుకున్నానని ఈ సందర్భగా విజయసాయిరెడ్డి అధికారులకు వెల్లడించారు. ఈడీ అధికారులు నన్ను విచారణకు పిలిచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు జులైలో మళ్లీ రాజకీయాల్లోకి వస్తానని విజయసాయిరెడ్డి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. త్వరలో మీడియా రంగంలోకి వస్తానని ఆయన వివరించారు. ఏపీలో మరో రాజకీయపార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి ప్రజలు బుద్ధి చెప్పారని, వారు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్సీపీ నేతలు ఇకనైనా ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలనే అభిప్రాయాన్ని విజయసాయిరెడ్డి వ్యక్తం చేశారు.

## ప్రేమ పేరుతో కుమార్తెను తీసుకుపోయాడని..

# యువకుడి తండ్రి కిడ్నాప్.. ఆపై మూత్రపానం!

**భోపాల్, ఏప్రిల్ 22:** తమ కుమార్తెను ప్రేమ పెళ్లి చేసుకుని తీసుకెళ్లి పోయాడన్న కోపంతో యువతి కుటుంబసభ్యులు 70 యేళ్ల వృద్ధుడైన యువకుడి తండ్రిని కిడ్నాప్ చేసి, దారుణంగా కొట్టి, మద్యం సీసాలో మూత్రం పోసి బలవంతంగా తాగించారు. ఈ అమానుషాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్‌లో రైసెన్ జిల్లాకు చెందిన ఓ యువకుడు, విదిశ జిల్లాకు చెందిన యువతి మార్చి 5న ప్రేమ వివాహం చేసుకుని ఇళ్ల నుంచి వెళ్లిపోయారు.

మరుసటి రోజే దీనిపై కేసు నమోదైంది. మార్చి 7న యువతి కుటుంబ సభ్యులు సుమారు 12 మంది రెండు వాహనాల్లో రైసెన్‌కు చేరుకున్నారు. యువతి ఆచూకీ చెప్పాలంటూ ఆమె ప్రియుడి తండ్రి అయిన వృద్ధుడిపై దాడి చేశారు. అనంతరం, ప్రేమజంటను వెతుకుదామనే నెపంతో వృద్ధుడిని బలవంతంగా తమ వాహనాల్లో ఎక్కించుకుని రాజ్‌గఢ్ జిల్లాలోని మోతీపుర గ్రామంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ వారి ఆచూకీ చెప్పకపోవడంతో, వృద్ధుడిని తీవ్రంగా కొట్టి, మద్యం సీసాలో మూత్రం పోసి బలవంతంగా తాగించారు. ఈ మొత్తం ఘటనను వీడియో తీసి ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశారు. ఈ ఘటన గత నెలలో జరగ్గా బుధవారం వీడియో వైరల్ కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రంగంలోకి దిగిన రాజ్‌గఢ్ పోలీసులు, బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నామని తెలిపారు. వీడియో ఆధారంగా మిగిలిన నిందితులను గుర్తించి, వారిని అరెస్ట్ చేసేందుకు గాలిస్తున్నామని పోలీసులు వివరించారు.

# ఆంధ్రావని న్యాయపీఠంపై తొలి వనిత

**భారతీయత అంటేనే మహిళల ఔన్నత్యానికి పెట్టింది పేరు. ఉన్నత న్యాయ వ్యవస్థలో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా వేసిన ముందడుగులో జస్టిస్ లీసా గిల్ శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. మహిళా లోకానికే మణిదీపంగా రాణించిన ఆమెకు న్యాయం పట్ల వున్న నిబద్ధత ఇతరులకు స్ఫూర్తిదాయకం.**



కొత్త విధానం, కొత్తగా సర్వోన్నత పదవి, కొత్త హైకోర్టు, కొత్త ప్రాంతం, నవ్యాంధ్రప్రదేశ్ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా నియమితురాలై జస్టిస్ లీసా గిల్ చరిత్ర సృష్టించారు.

రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తొలి మహిళ ప్రధాన న్యాయమూర్తిగా లీసా గిల్ నియమితులవడం ఆ రాష్ట్రానికే వన్నె తెచ్చింది. పంజాబ్ హర్యానా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి.. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీ చేసిన కారణం కొలీజియం కొత్త వరవడి సృష్టించింది. ఆమెను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పట్టా కట్టాలని తలబోసి ఇక్కడికి పంపింది.

గత నెలలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్యూస్నే జడ్జిగా నియమితులైన జస్టిస్ గిల్, ఏప్రిల్ 25న ఆ కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరిస్తారు.

కొత్త విధానం ప్రకారం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టబోయే న్యాయమూర్తిని, ఆ ఖాళీ ఏర్పడటానికి ప్రాధాన్యంగా రెండు నెలల ముందే బదిలీ చేయవచ్చు. దీనివల్ల, కొత్తగా బాధ్యతలు స్వీకరించే ప్రధాన న్యాయమూర్తి అధికారికంగా బాధ్యతలు చేపట్టే ముందే హైకోర్టు పనితీరు, పరిపాలనా వ్యవహారాలపై అవగాహన పెంచుకోగలుగుతారు.

తద్వారా కొత్తగా వచ్చే న్యాయమూర్తి ఆయా హైకోర్టు పనితీరుతో పరిచయం పెంచుకోవడానికి వీలవుతుంది. జస్టిస్ గిల్‌ను మొదట బదిలీ చేసి, ఆ తర్వాత పదోన్నతి కల్పించాలన్న నిర్ణయాన్ని కొలీజియం తీసుకుంది.

జస్టిస్ గిల్ పంజాబ్ విశ్వవిద్యాలయంలోని న్యాయశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థిని. ఆమె అక్కడి నుంచే బీఏ ఎల్ఎల్‌బీ (మూడేళ్లు), ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. ఆమె 1990లో న్యాయవాదిగా నమోదు చేసుకుని, పంజాబ్, హర్యానా హైకోర్టులో తన న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. సంవత్సరాలుగా, ఆమె చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి, అనేక ప్రభుత్వ రంగ బోర్డులు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు..

ఆమె 2014 మార్చి 31న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.. అక్కడ ఆమె సీనియారిటీలో మూడవ స్థానంలో ఉన్నారు.

మాజీ న్యాయమూర్తి జస్టిస్ హర్‌ఫూల్ సింగ్ బ్రార్ కుమార్తె అయిన జస్టిస్ గిల్, న్యాయశాస్త్రపు పద్ధతులకు దగ్గరగా పెరిగారు.

ఈ సాన్నిహిత్యమే ఆ తర్వాత ఆమెకు స్థిరమైన, విస్తృతమైన న్యాయవాద వృత్తిని అందించింది.



చండీగఢ్ వాస్తవ్యురాలైన ఆమె, కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ప్రభుత్వ మహిళా కళాశాల నుండి హ్యూమానిటీస్‌లో డిగ్రీని పొందారు. ఆ తర్వాత పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి ఎల్.ఎల్.బి., ఎల్.ఎల్.ఎం. డిగ్రీలను అందుకున్నారు.

మార్చి 2014లో న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన ఆమె, గత నెలలో ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయ్యే ముందు దశాబ్దానికి పైగా న్యాయమూర్తిగా పనిచేశారు.

ఈ ముందస్తు మార్పు ఇప్పుడు ఆమెను ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నత స్థాయికి సజావుగా నడిపిస్తోంది.

భారతీయత అంటేనే మహిళల ఔన్నత్యానికి పెట్టింది పేరు. ఉన్నత న్యాయ వ్యవస్థలో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా వేసిన ముందడుగులో జస్టిస్ లీసా గిల్ శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్నారు.


న్యాయ రంగంలో దాదాపు 36 సంవత్సరాల అనుభవం, అందులో 11 సంవత్సరాలకు పైగా న్యాయమూర్తిగా పనిచేసిన అనుభవంతో, జస్టిస్ గిల్ ఇప్పుడు తన కొత్త పాత్రలోకి అడుగుపెడుతున్నారు.

## తరవాని

వేసవి కాలానికి ఎంతో సానుకూలమైన ద్రవ ఆహారం ఏదైనా ఉంటే అది తరవానియే. వంటికి చలువ చేస్తుంది. పూర్వీకుల నుండి వస్తున్న ఒక సాంప్రదాయ వంటకం గోదావరి జిల్లాలలో, తెలంగాణలోని కొన్ని మారుమూల ప్రాంతాలలో ప్రసిద్ధి చెందిన ఈ తరవాని లేని పల్లెటూరు లేదంటే నమ్మండి. దీనిని కొన్ని ప్రాంతాల్లో లక్ష్మీ చారు అని కూడా అంటారు. దీని కోసం ప్రతి ఇంట్లో వంటగదిలో ఒక మట్టి కుండను ఉంచుతారు. బియ్యం వండటానికి ముందు, బియ్యం కడిగిన గంజి నీటిని పక్కన పెట్టండి. ఆ నీటిని కుండలో రెండు మూడు రోజుల పాటు నిల్వ ఉంచండి. పులియబెట్టే ప్రక్రియలో, నీటిలో అప్పటికే ఉన్న విటమిన్ బి, కి ప్రోటీన్ కలుస్తుంది. ఇప్పుడు ఆ నీరు ప్రోటీన్లు, విటమిన్లతో సమృద్ధిగా ఉంటుంది.

కావలసినంత నీరు (తర్వానీ) తీసుకుని, వంకాయ, సొరకాయ వంటి కూరగాయ ముక్కలను వేయండి. కూరగాయలు మెత్తబడే వరకు కొద్దిసేపు ఉడకనివ్వండి. తరువాత పచ్చిమిర్చి, కారం, చింతపండు గుజ్జు, కొద్దిగా పంచదార లేదా బెల్లం, రుచి కోసం సరిపడా ఉప్పు వేయండి. దీనిని మళ్ళీ 2 నుండి 3 నిమిషాల పాటు ఉడకబెట్టండి. స్టవ్ ఆపివేయండి. దీనిలో పోపు కలపండి.

ఇది వేసవిలో బాగా పులుస్తుంది. ఎక్కువగా దీనిని వేసవి కాలంలోనే తయారు చేస్తారు. దీనిని వేడి వేడి అన్నంతో పాటు ముద్ద పప్పు, అప్పడాల మేళవింపుతో వడ్డించండి.



ఇంతకన్నా రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారం మరో విధంగా కానీ, మరో రూపంలో కానీ లేదండి.

## చిక్కుముడులు.. జీవన సత్యాలు..

చిన్నప్పుడు.. పరికిణీతో ఉన్నప్పుడు అమ్మ జడ వేస్తుంది. చింపిరి తలకు చిక్కు తీసి ప్రేమతో కమ్మని కబుర్లు చెప్పుకుంటూ కుదురుగా ఉండని చిట్టి తలను వెనక్కి లాక్కుంటూ అందంగా అలంకరిస్తుందని అందరికీ తెలిసిందే! అప్పుడు కూడా తల్లి తన కూతుర్ని ప్రేమతో ప్రేమగా మాట్లాడుతూనే వారి జుట్టు దువ్వెనతో దువ్వేటప్పుడు అలవోకగా నోటంట వచ్చే నీతి కథలను చెపుతుంటుంది. పిల్లలకు ఈ సమయంలో సున్నితమైన ప్రేమ కబుర్లు అవసరం.

జుట్టును మృదువుగా శుభ్రం చేయడమే కాదు. జీవితంలో ఎన్ని చిక్కులొచ్చిన ఒద్దికగా సమస్యల్ని కుదుట పరచుకునేలా కుదుళ్లను గట్టిగా కట్టుకోవల్లని చెబుతుంది. పాపిట తీస్తూ మంచి జీవితానికి పాపిట కలబోతాను గురించి వివరిస్తుంది. జుట్టును మృదువుగా కుంచే లేదా చిన్న దువ్వెనతో సున్నితంగా బ్రష్ చేస్తుంది. జుట్టు విపరీతంగా చిక్కుముడులు లేకుండా సున్నితంగా సరి చేస్తుంది.



కండిషనర్‌తో జుట్టును చేతుల్లోకి తీసుకుని ఒకటికి రెండు సార్లు దువ్వుతుంది.

ఇలా కేశాల విషయంలో తీసుకునే జాగ్రత్తలే ముందు ముందు అమ్మాయికి సొంతంగా జడ వేసే స్థాయికి నేర్పరితనం అబ్బుతుంది. పాప జుట్టును కాంబ్ చేసే సమయంలో, జుట్టును నాజూకుగా పిల్లల కోసం మరింత జాగ్రత్తగా దువ్వుతుంది. ఇలా చేసెటపుడు జీవన సత్యాలను రంగరించి చెప్పే కబుర్లు పాప మనసును తేలిక పరుస్తాయి. జుట్టులో చెవులు కప్పబడి ఉండకుండా, నీట్‌గా జడ వేయాలి. జుట్టు రేగకుండా గట్టిగా కట్టాలి. దువ్వే సమయంలో మెరుగైన హెయిర్ కేర్ నిర్వహణ అవసరం. ఆ సమయంలో ప్రేమ చూపిస్తూ జీవిత సత్యాలను కలగలుపు మాటలతో బోధిస్తూ ఉంటే మరీ మంచిది. ఇప్పుడు వాళ్లంతా ఆధునికంగా, కాస్త సింపుల్‌గా జడ వేసుకోవాలని అనుకుంటున్నారు. జారుముడితోనైనా పర్వాలేదని ధోరణికి వచ్చారు.

శారీరక సౌందర్యం మీద వారికి పెద్దగా జిజ్ఞాస ఉండడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో.. అలా ఎందుకు తయారవకూడదో, నలుగురిలోకి వెళ్లేటప్పుడు ఎలా మసలుకోవాలో తొలి గురువు అమ్మే చెబుతుంది. జీవితంలోని చిక్కుముడులకు అమ్మ చెప్పే మొదటి పాఠం పసి వయసు నుంచే మొదలవుతుంది.

**– ఎస్.వి.జ్యోతి**

## దానగుణం



అంగ దేశానికి రాజైన కర్ణుడు, మహాభారతంలో అత్యంత ఉదాత్తమైన గుణాలున్న వీరుడిగా ప్రసిద్ధి పొందాడు. అతని జీవితం పరీక్షలతో నిండిపోయినా, అతని హృదయం దయ, దానం, నిజాయితీతో ఎల్లప్పుడూ ప్రకాశించింది. ఒకసారి, ఉదయం సూర్యోదయ సమయంలో కర్ణుడు తన నిత్య దాన ధర్మాలను ఆచరిస్తూ ఉండేవాడు. అతని వ్రతం ఏమిటంటే తన దగ్గరకు వచ్చిన యాచకుడిని ఖాళీ చేతులతో పంపించకూడదు. అదే సమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు అతని ముందుకు వచ్చాడు. అతను బలహీనంగా కనిపించినా, అతని కళ్లలో ఒక విశేషమైన ప్రకాశం కనిపించింది. "మహారాజా, నాకు మీ సహాయం కావాలి" అని బ్రాహ్మణుడు అన్నాడు. కర్ణుడు సంతోషంగా, "మీరు కోరింది ఏమైతే అది నేను ఇస్తాను," అని సమాధానమిచ్చాడు.

బ్రాహ్మణుడు ఆలోచించి, "నాకు మీ కవచ కుండలాలు కావాలి" అన్నాడు.

ఇది సాధారణ అభ్యర్థన కాదు. కవచం, కుండలాలు కర్ణుడికి జన్మతః వచ్చినవి. అవి అతన్ని అజేయుడిగా కాపాడేవి. అవి లేకపోతే యుద్ధంలో అతనికి ప్రాణాపాయం ఉండేది.

అయినా, కర్ణుడు క్షణం కూడా ఆలోచించలేదు. "దానం అంటే త్యాగం. అది మనస్ఫూర్తిగా ఉండాలి" అని చెప్పి, తన కవచం, కుండలాలను తీసి బ్రాహ్మణునికి ఇచ్చాడు. ఆ బ్రాహ్మణుడు వాస్తవానికి దేవేంద్రుడు. కర్ణుని దానగుణాన్ని పరీక్షించడానికి వచ్చాడు. కర్ణుని త్యాగం చూసి అతను ఆశ్చర్యపోయాడు. వెంటనే తన అసలు రూపాన్ని చూపించి, "నీ దాన గుణం అపారమైనది. నీకు ప్రతిఫలంగా ఈ శక్తివంతమైన ఆయుధాన్ని ఇస్తున్నాను" అని వరం ఇచ్చాడు. కర్ణుడు ఆ వరాన్ని కూడా వినయంగా స్వీకరించాడు. అతనికి దానం చేయడం వల్ల ఏ నష్టం వచ్చినా పట్టించుకోలేదు. ఎందుకంటే అతని విశ్వాసం. "ధర్మం ఎప్పటికీ మనతో ఉంటుంది" అనే దానిలో ఉంది.

## చిట్కా..



అందానికి మరింత అందాన్నిచ్చేది దుస్తులు. మీ శరీర లావణ్యం ఎత్తు, లావును అనుసరించి దుస్తులు ఎంపిక చేసుకోండి.

– ఒకటి/రెండు బీట్రూట్ స్లైసులను ఉడికించి టొమాటో సూప్‌లో కలిపితే మంచి రంగు వస్తుంది.

## జెట్లీ షూటింగ్ అంతా ఫ్లైట్ లోనే చేశాం

మునుపెన్నడూ చూడని వినూత్నమైన కాన్సెప్టులతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న దర్శకుడు రితేష్ రానా, ఇప్పుడు జెట్లీతో మరో క్రేజీ ఎక్స్‌పెరిమెంట్‌కు సిద్ధమయ్యారు. కమెడియన్ సత్యను పూర్తిస్థాయి హీరోగా ఆవిష్కరిస్తూ, 80 శాతం షూటింగ్‌ను విమానంలోనే జరుపుకున్న ఈ చిత్రం.. హైవోల్టేజ్ సస్పెన్స్, కడుపుబ్బ నవ్వించే హ్యూమర్ కలయికగా రాబోతోంది. మే 1న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో, సినిమాలోని ఊహించని మలుపులు ఆడియన్స్‌ను థ్రిల్‌కు గురిచేస్తాయని రితేష్ రానా ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే..



దర్శకుడు రితేష్ రానా

'నిజానికి ఇది ఒక పెద్ద హీరోతో చేయాల్సిన ఇంటెన్స్ థ్రిల్లర్. కానీ, ఒకే లొకేషన్ (ఫ్లైట్)లో సినిమా అంటే రిస్క్ అనిపించింది. అదే సత్య అయితే హ్యూమర్ పండుతుంది. మార్కెట్ కూడా బాగుంటుందని తనని ఎంచుకున్నాను. తను మొదట షాక్ అయినా, కథ విన్నాక చాలా ఎక్సైట్ అయ్యాడు. కథ మొత్తం జెట్ (విమానం)లో జరుగుతుంది. అలాగే మనందరికీ తెలిసిన ఫేమస్ నటుడు జెట్ లీ పేరు కలిసొచ్చేలా ఉంటుందని ఈ టైటిల్ ఫిక్స్ చేశాం. షూటింగ్ అంతా ఫ్లైట్ లోనే చేయడం నిజానికి చాలా కష్టం. దీని కోసం ఒకే ఫ్లోర్ మీద ఎకానమీ, బిజినెస్ క్లాస్, కార్గో, కాక్పిట్ అని ఐదు రకాల సెట్స్ వేశాం. నా కెరీర్ లోనే ఇది టెక్నికల్ గా చాలా టఫ్ మూవీ. వెన్నెల కిషోర్ ఇందులో సుడోకు పిచ్చి ఉన్న వ్యక్తిగా కనిపిస్తారు. ఆయన చేసే కామెడీ చాలా కొత్తగా ఉంటుంది. ఇక అజయ్ గారు ప్రజాపతి అనే బ్యాంక్ స్కామ్ క్రిమినల్ పాత్రలో కనిపిస్తారు. ఆయన్ని పట్టుకోవడమే సినిమాలో మెయిన్ థ్రిల్. ఇందులో హ్యూమర్, సస్పెన్స్, థ్రిల్.. ఈ మూడు సమపాళ్లలో ఉంటాయి. ముఖ్యంగా సీజీ వర్క్ చేసిన రెండు యాక్షన్ సీక్వెన్సులు సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయి. ఇదొక కంప్లీట్ ఎంటర్‌టైనర్. నాకు హారర్ జానర్ అంటే చాలా ఇష్టం. నా నెక్స్ట్ సినిమా కచ్చితంగా హారర్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది.

## కమల్‌కు రాని అదృష్టం నాకు దక్కింది



వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను అలరించే తరుణ్ భాస్కర్, రైటర్, డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ గాయపడ్డ సింహం. పవన్ సాదినేని సమర్పణలో సప్తస్వ మీడియా వర్క్స్, పిఒవి స్టోరీస్ మరియు జీ స్టూడియోస్ బ్యానర్లపై ఈ చిత్రం రూపొందింది. మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, చిత్రంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు జేడీ చక్రవర్తి విలేకరులతో ముచ్చటించి సినిమా విశేషాలను పంచుకున్నారు. ఈ సినిమాలో నేను బ్రూటల్ ధర్మ అనే పాత్రను పోషించాను. క్యారెక్టర్ ఆర్క్‌లో ఏదైనా ఛాలెంజ్ ఉంటే నటుడిగా నాకు చాలా ఎక్సైటింగ్‌గా ఉంటుంది. కమల్ హాసన్ వంటి మహానటులు కూడా చేయని ఒక విభిన్నమైన పాత్ర చేసే అదృష్టం ఈ సినిమా ద్వారా నాకు కలిగింది. ఒకే గెటప్‌లో ఉంటూ ఫస్ట్ హాఫ్, సెకండ్ హాఫ్‌లో రెండు వేర్వేరు షేడ్స్ చూపించడం ఈ పాత్రలోని ప్రత్యేకత అని తెలిపారు.

సినిమా శైలి గురించి వివరిస్తూ, ఇది పూర్తిగా రియలిస్టిక్, హిలేరియస్ హ్యూమర్‌తో సాగే ఎంటర్‌టైనర్ అని పేర్కొన్నారు. పాత్ర పేరు బ్రూటల్‌గా ఉన్నప్పటికీ, స్క్రీన్‌పై తాను చేసే పనులు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయని జేడీ ధీమా వ్యక్తం చేశారు.

# తెర

## ప్రేమకి పులిహోర కలిపేశారు



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తరుణ్ భాస్కర్ హీరోగా, రైటర్, డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ ఎంటర్టైనర్ గాయపడ్డ సింహం. పవన్ సదినేని సమర్పణలో సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుండి ప్రేమకి పులిహోర అనే ఫోర్త్ సింగిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట సాధారణ మెలోడీలా కాకుండా, నేటి తరం యువతకు కనెక్ట్ అయ్యేలా ప్రేమకి పులిహోర పేరుతో చాలా ఫన్నీగా సాగుతుంది. మోడరన్ లవ్‌లో ఉండే అటుపోటులు, కన్ఫ్యూజన్, మరియు సరదా అంశాలను ఈ పాటలో హ్యూమరస్‌గా చూపించారు. ముఖ్యంగా నచ్చిన అమ్మాయిని ఇంప్రెస్ చేయడానికి హీరో చేసే ప్రయత్నాలు, ఆ క్రమంలో ఎదురయ్యే చిన్న చిన్న అడ్డంకులు రిలేటబుల్‌గా ఉన్నాయి. స్వీకర్ అగస్తి ఈ పాటకు లైట్ అండ్ బ్రీజీ ట్యూన్ అందించారు. అర్బన్ టచ్‌తో కూడిన ఈ స్టైలిష్ మ్యూజిక్ శ్రోతలను వెంటనే ఆకట్టుకునేలా ఉంది.

## చివరి దశలో పురుష చిత్రీకరణ



సరస్వతి బత్తుల సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తున్న తాజా చిత్రం పురుష. అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయమవుతున్నారు. వీరు వులవల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతూ తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ మరియు గ్లింప్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను నెలకొల్పాయి. ముఖ్యంగా శ్రవణ్ భరద్వాజ్ అందించిన పాటలు యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉండటం సినిమాపై ఉన్న క్రేజ్‌ను మరింత పెంచింది. ఈ చిత్రంలో సప్తగిరి, వెన్నెల కిషోర్, కసిరెడ్డి రాజ్‌కుమార్, అనంత్ శ్రీరామ్ వంటి భారీ తారాగణం నటిస్తుండటంతో, వినోదానికి లోటుండదని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. సతీష్ ముత్యాల విజువల్స్, కోటి ఎడిటింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

## రావణుడు వర్సెస్ కుబేరుడు



ఇండియన్ సినిమా నుంచి రాబోతున్న అవైటెడ్ భారీ సినిమాల్లో పాన్ వరల్డ్ లెవెల్లో ప్రెజెంట్ చేస్తున్న సినిమా రామాయణ కూడా ఒకటి. ఇందులో రణబీర్ కపూర్ రామునిగా, సీతగా సాయి పల్లవి అలానే రావణ పాత్రలో కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్నారు. యష్ ఎంట్రీ కోసం ఒక అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారని సమాచారం. రావణుడు తన సోదరుడైన కుబేరుడిని ఓడించి లంకను ఎలా కైవసం చేసుకున్నాడు అనే అంశంపై ఒక భారీ యుద్ధ సన్నివేశాన్ని షూట్ చేయబోతున్నారు. ఇది యష్ ఇమేజ్‌కు తగ్గట్టుగా చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం. రావణుడికి పది తలలు ఉండటాన్ని గ్రాఫిక్స్‌లో రొటీన్‌గా చూపించకుండా, ఒక వినూత్నమైన టెక్నాలజీతో చూపించబోతున్నారట. ఇది సినిమాలోనే అత్యంత ఆసక్తికరమైన అంశమని స్వయంగా యష్ పేర్కొన్నారు. దర్శకుడు నితీష్ తివారీ ఈ సినిమాలో రావణుడిని కేవలం ఒక క్రూరమైన విలన్‌గా కాకుండా, ఒక మల్టీడైమెన్షనల్ క్యారెక్టరిస్టిక్స్‌తో, అతనిలోని పాజిటివ్ కోణాలను కూడా సినిమాలో చూపించబోతున్నాం చూపిస్తున్నారు.

## మాస్ జాతరకు ముహూర్తం

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరో భారీ కాంబినేషన్ సెట్ అయింది. నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ క్రేజీ ప్రాజెక్ట్ పట్టాలెక్కబోతోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సినిమా (ఎన్‌బికె 111) సెట్స్‌పై ఉండగానే, బాలయ్య తన తదుపరి చిత్రాన్ని కొరటాల శివతో ఖరారు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ చిత్రాన్ని మే 1వ తేదీన ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభించనున్నారు. జూన్ నెల నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గతంలో బాలయ్య సూపర్ హిట్ చిత్రం సింహాకి రచయితగా పనిచేసిన కొరటాల శివ, ఇప్పుడు దర్శకుడిగా ఆయనను ఎలా ఎలివేట్ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. దేవరతో గ్లోబల్ హిట్ అందుకున్న కొరటాల, బాలయ్య మార్క్ పవర్ ఫుల్ మాస్ ఎలిమెంట్స్‌కు తనదైన శైలిలో సామాజిక సందేశాన్ని జోడించబోతున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే సస్పెన్స్‌పై త్వరలోనే స్పష్టత రానుంది.



## జూన్ నుంచి షూటింగ్ షురూ..




దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న తాజా మల్టీస్టారర్ చిత్రంలో విక్టరీ వెంకటేష్ నందమూరి కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వెంకటేష్ సరసన కీర్తి సురేష్, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి కథానాయికలుగా ఎంపికయ్యారు. వెంకటేష్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న 5వ సినిమా ఇది. కల్యాణ్ రామ్‌ను పటాస్ సినిమాతో దర్శకుడిగా పరిచయం చేసిన అనిల్ రావిపూడి, దాదాపు 10 ఏళ్ల తర్వాత మళ్లీ ఆయనతో కలిసి పనిచేస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జూన్ నెల నుంచి ప్రారంభం కానుంది. మొదటి షెడ్యూల్‌లో వెంకటేష్, కీర్తి సురేష్ పాల్గొంటారని సమాచారం. ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఇది అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, యాక్షన్, ఫ్యామిలీ డ్రామాతో కూడిన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. ప్రస్తుతం వెంకటేష్ తన తదుపరి చిత్రం (త్రివిక్రమ్ దర్శకత్వంలో లేదా ఏకే 47/ఆదర్శ కుటుంబం అనే ప్రచారంలో ఉన్న చిత్రాలు) పూర్తి చేసిన వెంటనే ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది.

## కరసామి గర్జన

వెర్సటైల్ స్టార్ ధనుష్ హీరోగా, మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా కర. విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని డా. ఇషారి కె. గణేష్ నిర్మించారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'పంటో.. గడ్డో.. పాపమో.. పుణ్యమో.. తను నాటింది తనే నరుక్కోవాలి. నేను నాటిన విత్తనం ఇప్పుడు కోతకొచ్చింది. అంతకంటే ముందు నా మీద పడ్డ మచ్చని తుడిచేయాలి అంటూ ధనుష్ చెప్పిన డైలాగ్స్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. కరసామి అనే యువకుడు తనపై పడ్డ నిందను ఎలా ఎదుర్కొన్నాడు? తనను నమ్ముకున్న వారి కోసం ఎలా పోరాడాడు? అనే అంశాలను టీజర్‌లో చాలా ఇంటెన్స్‌గా చూపించారు.

ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ బ్యానర్లపై సిహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం, థేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న కర చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. త్వరలోనే చిత్ర యూనిట్ ట్రైలర్‌ను కూడా విడుదల చేయనుంది.



## మెక్సికోలో వారణాసి ప్రచారం



దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం వారణాసి. గ్లోబల్ అడ్వెంచరస్ మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమా గురించి ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా ప్రచారానికి సంబంధించి ఒక భారీ అప్డేట్ బయటకు వచ్చింది. సినిమాను కేవలం భారత్‌లోనే కాకుండా ప్రపంచ స్థాయిలో ప్రమోట్ చేయడంలో మాస్టర్ అనిపించుకున్న రాజమౌళి, వారణాసి కోసం గ్లోబల్ స్కెచ్ సిద్ధం చేశారు. మెక్సికోలో శుక్రవారం నుంచి 26 వరకు జరగనున్న ప్రతిష్టాత్మక కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్ ఈవెంట్‌లో ఈ సినిమా ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించబోతున్నారు. ఇందులో సినిమా మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్ క్లిప్పింగ్స్‌తో పాటు కొన్ని కీలక సన్నివేశాల గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ ఈవెంట్‌కు చిత్ర నిర్మాతల్లో ఒకరైన ఎస్.ఎస్. కార్తికేయ స్వయంగా హాజరుకానున్నారు. దర్శకుడు రాజమౌళి ఒక ప్రత్యేక వీడియో సందేశం ద్వారా అక్కడి ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడనున్నారు.

# క్లైమాక్స్‌కు ప్లే ఆఫ్ రేస్




(వార్తా క్రీడా విభాగం)

ఐపీఎల్ 2026 ప్లే ఆఫ్ రేసు ఉత్కంఠభరితంగా మారిం ది. పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు ముందంజలో ఉండగా... చెన్నై, గుజరాత్ వంటి జట్లు పుంజుకుని రేసులో నిలుస్తున్నాయి. మరోవైపు ముంబై, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్లు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయి. లీగ్ తొలి దశలో నిరాశజనక ఆటతీరు కనబరిచాయి. ఇకపై ప్రతి మ్యాచ్ ప్లే ఆఫ్ సమీకరణాలను మార్చే కీలకఘట్టంగా మారనుంది.

**దాదాపు ప్లే ఆఫ్ ఖాయం**

పంజాబ్ కింగ్స్ స్థిరమైన ప్రదర్శనతో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో అజేయంగా కొనసాగుతోంది. అయిదు మ్యాచ్‌ల్లో గెలుపొందగా, ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. 11 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుత ఫామ్ చూస్తే శ్రేయాస్ సేన ప్లే ఆఫ్ స్థానం గ్యారంటీగా మారింది. ఆడాల్సిన 8 మ్యాచ్‌ల్లో ఓ మూడు మ్యాచ్‌లు నెగ్గినా ప్లే ఆఫ్‌కు ఢోకా ఉండదు. 2025 సీజన్‌లోనూ టాప్ ప్లేస్‌తో ప్లే ఆఫ్ చేరిన పంజాబ్ కింగ్స్... ఈసారి కప్ అందుకోవడమే లక్ష్యంగా కొనసాగుతోంది.

**రాయల్‌దీ అదే రూట్**

స్వదేశీ యంగ్ గన్స్ రాజస్థాన్ రాయల్స్ ఆడే మ్యాచ్‌ల్లో 5 విజయాలు, 2 ఓటములు.. మొత్తం పది పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. చక్కని నెట్‌రన్‌రేట్ కలిగి ఉంది. ప్రస్తుతం బెటర్ పొజిషన్‌లో ఉన్నా... లీగ్ రెండో స్టేజ్‌లో కూడా ఇదే తరహా ఆటతీరు కనబరిస్తే ప్లేఆఫ్‌కు చేరవచ్చు. వరుసగా నాలుగు విజయాల తర్వాత అనూహ్యంగా రెండు ఓటములు ఎదుర్కొన్న రాజస్థాన్ రాయల్స్... చివరి మ్యాచ్‌లో గెలిచి పుంజుకుంది.

**కమాండింగ్ పొజిషన్‌లో ఆర్సీబీ**

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్... పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. ప్లే ఆఫ్ రేసులో బలమైన కంటెండర్‌గా ఉంది. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 2 ఓటములు.. మొత్తం 8 పాయింట్లతో ఉంది. టాప్ ఫేవరెట్‌గా ఐపీఎల్ ఆరంభించినా.. అనూహ్యంగా ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓడింది. ఎంతవేగంగా బౌన్స్ బ్యాక్ అవుతుండనడం పైనే ప్లే ఆఫ్ అవకాశాలు ఉంటాయి.

**దూసుకొచ్చిన సన్‌రైజింగ్**

సొంతగడ్డపై జోరు చూపిన సన్ రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్ విజయాలతో ప్లే ఆఫ్ రేసులో దూసుకొచ్చింది. ఆడిన 7 మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో 8 పాయింట్లతో టాప్-4లో ఉంది. లీగ్ రెండో స్టేజ్‌లో గెలుపు ట్రాక్ కొనసాగిస్తే ప్లే ఆఫ్ చేరుకోవడం ఖాయం. ఆడాల్సిన 7 మ్యాచ్‌ల్లో కనీసం 5 మ్యాచ్‌లు నెగ్గితే ఈజీ. లేదంటే సమీకరణాలపై ఆధారపడాల్సి ఉంటుంది.

**హాట్ రేస్.. ఒక్క ఓటమీ డేంజరే**

అయిదు నుంచి 7 స్థానాల్లో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్‌కు సెకండ్ స్టేజ్‌లో ప్రతి మ్యాచ్ డూ ఆర్ డై లాంటిదే. గెలిస్తేనే ప్లే ఆఫ్ రేసులో నిలుస్తారు. చెన్నై ఆరంభంలో వరుస పరాజయాలు వెక్కిరించినా సంజూ జోరుగా గెలుపు ట్రాక్‌లో పడింది. గత నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు అందుకుంది. ఇదే జోరు కొనసాగిసేనత ప్లే ఆఫ్ అవకాశాలుంటాయి. మిగతా జట్లకు కూడా డూ ఆర్ డై పరిస్థితే.

## POINTS TABLE

| RANK | TEAM | P | W | L | PTS | NRR |
|---|---|---|---|---|---|---|
| 1 | PBKS | 6 | 5 | 0 | 11 | 1.42 |
| 2 | RR | 7 | 5 | 2 | 10 | 0.79 |
| 3 | RCB | 6 | 4 | 2 | 8 | 1.17 |
| 4 | SRH | 7 | 4 | 3 | 8 | 0.82 |
| 5 | CSK | 7 | 3 | 4 | 6 | 0.12 |
| 6 | DC | 6 | 3 | 3 | 6 | -0.13 |
| 7 | GT | 6 | 3 | 3 | 6 | -0.82 |
| 8 | MI | 7 | 2 | 5 | 4 | -0.74 |
| 9 | LSG | 7 | 2 | 5 | 4 | -1.28 |
| 10 | KKR | 7 | 1 | 5 | 3 | -0.88 |

**డబుల్ ధమాకా**
**ఐపీఎల్‌లో నేటి మ్యాచ్‌లు**

| ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం | |
|---|---|
| పంజాబ్ కింగ్స్ V/S ఢిల్లీ క్యాపిటల్స్ | మధ్యాహ్నం 3.30 గం.లకు |
| **జైపూర్ మాన్‌సింగ్ స్టేడియం** | |
| సన్‌రైజర్స్ హైదరాబాద్ V/S రాజస్థాన్ రాయల్స్ | రాత్రి 7.30 గం.లకు |

# రాయల్స్‌పై సన్‌రైజర్స్ రిపీట్ చేసేనా?

**జైపూర్:** ఐపీఎల్‌లో నేడు మరో ఆసిక్తికర్ పోరు జరగనుంది. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడుతుంది. తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించాలని ఉవ్విళ్లూరుతోంది. ముఖ్యంగా సొంతగడ్డపై రాజస్థాన్ రాయల్స్‌పై నెగ్గిన ఆరేంజ్ ఆర్మీ... జైపూర్‌లోనూ రిపీట్ చేయాలని చేస్తోంది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అన్ని విభాగాల్లోనూ నిలకడైన ప్రదర్శనలు ఇస్తూ అత్యుత్తమ జట్లలో ఒకటిగా నిలిచింది. వరుసగా మూడు మ్యాచ్‌లు నెగ్గింది. ముఖ్యంగా డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్‌లోకి రావడం సన్‌రైజర్స్‌కు కలిసివచ్చే అంశం. ఇషాన్ కిషన్‌తో పాటు ట్రావిడ్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, నితిష్ కుమార్ రెడ్డి పరుగుల వేటలో ఉన్నారు. పాట్ కమిన్స్ జట్టులోకి రావడంతో బౌలింగ్ మరింత పటిష్టంగా మారింది.

ఇక రాజస్థాన్ రాయల్స్‌కు వస్తే.. రెండు ఓటముల తర్వాత తిరిగి విజయాల గాడిలో పడింది. గత ఓటమికి రివేంజ్ తీర్చుకోవాలని చూస్తోంది. యువ ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వీ జైశ్వాల్‌ల సంచలనాత్మక ఫామ్ బలాన్ని చేకూరుస్తోంది. అయితే మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమవడం రాయల్స్‌ను ఆందోళన పరుస్తోంది. జోఫ్రా ఆర్చర్ నేతృత్వంలోని బౌలింగ్ దళం కీలక సమయాల్లో రాణించింది. లక్నో సూపర్ జెయింట్స్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన రాజస్థాన్, తమ జోరును కొనసాగించగలమని ఆత్మవిశ్వాసంతో ఉంది. రెండుజట్లు మంచి ఫామ్‌లో ఉండి, పాయింట్ల పట్టికలో కీలక పాయింట్లపై కన్నేసి ఉండటంతో, జైపూర్‌లో జరిగే ఈమ్యాచ్ ఉత్కంఠరేపుతోంది.



**రాజస్థాన్ రాయల్స్:** యశస్వీ జైస్వాల్, ధృవ్ జురెల్(వికెట్ కీపర్), రియాన్ పరాగ్(కెప్టెన్), హెట్మైర్, ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, రవి బిష్ణోయ్, బ్రిజేష్ శర్మ, బర్గర్, సందీప్ శర్మ; **ఇంఫాక్ట్ ప్లేయర్:** వైభవ్ సూర్యవంశీ

**సన్‌రైజర్స్ హైదరాబాద్:** అభిషేక్, హెడ్, ఇషాన్, క్లాసెన్, అంకిత్, నితిష్ కుమార్, కమిన్స్(కెప్టెన్), శివాంగ్, దూబే, సాకిబ్ హుస్సేన్, మలింగ; **ఇంఫాక్ట్ ప్లేయర్:** సలీల్ అరోరా

# సాయి సుదర్శన్ సెంచరీ మోత



**బెంగళూర్:** చిన్నస్వామి స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్(58 బంతుల్లో 100) శతకంతో గర్జించాడు. గత మ్యాచ్‌లో గోల్డెన్ డక్ అయిన సుదర్శన్... ఆ కసినంతా ఆర్సీబీ బౌలర్లపై చూపెట్టాడు. ఎడాపెడా ఉతికేసిన సాయి ఈ ఐపీఎల్ సీజన్‌లో తొలి సెంచరీ, ఓవరాల్‌గా మూడోసెంచరీ సాధించాడు. తొలి ఫిఫ్టీకి 33బంతులు తీసుకున్న సాయి.. రెండో ఫిఫ్టీని 24 బంతుల్లోనే పూర్తిచేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 11ఫోర్లు, 5 సిక్స్‌లు ఉన్నాయి. సింగిల్‌తో ఖాతా మొదలు పెట్టిన సాయి... భువీ నాలుగో బంతికి బౌండరీ బాదాడు. ఇక అక్కడినుండి వేగం పెంచాడు. భువీ మరో ఓవర్లో రెండు ఫోర్లు.. రసిఖ్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు.. హాజిల్‌వుడ్‌కైతే 4, 6, 4తో 14 రన్స్ ఇచ్చేసిన సాయి సుదర్శన్ షెఫర్డ్ బంతిని స్టాండ్స్‌లోకి పంపి ఫిఫ్టీ నమోదుచేశాడు. ఆ తర్వాత కృనాల్ ఓవర్లో రెండు సిక్స్‌లతో 16 రన్స్ పిండుకున్న సాయి.. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లతో శతక్కొట్టాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(32)తో కలిసి తొలివికెట్‌కు 128రన్స్, బట్లర్(25)తో కలిసి రెండో వికెట్‌కు 32 రన్స్ అందించాడు. సాయి సుదర్శన్ తన ఇన్నింగ్స్‌తో ఐపీఎల్‌లో అత్యంత వేగంగా 2వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. సుదర్శన్ శతకం.. ఈ ఐపీఎల్‌లో అయిదో సెంచరీ.

గుజరాత్ టైటాన్స్ 205/3 స్కోరు సాధించగా... లక్ష్య చేధనలో కోహ్లి(44 బంతుల్లో 81), పడిక్కల్(27 బంతుల్లో 55) రాణించడంతో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

# 4 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి




## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతపురోజు భారీ నష్టాల్లో ముగిసాయి. సుమారుగా నాలుగు లక్షలకోట్లు ఇన్వెస్టర్ల సంపద ఆవిరి అయినట్లుట్రేడింగ్ ధోరణులు చెపుతున్నాయి. మూడురోజుల నష్టాల్లోనే సుమారు 8నుంచి రూ.10లక్షలకోట్లు ఆవిరి అయినట్లు డేటా స్పష్టం చేస్తోంది. బిఎస్ఇ సెన్సెక్స్ 9999.79పాయింట్లు క్షీణించి 76,664.21 పాయింట్లవద్దముగిస్తే నిఫ్టీ 50 సూచీ 275.10 పాయింట్లు క్షీణించి 23,897.95 పాయింట్ల వద్ద ముగిసింది. మూడు సెషన్లలోను సెన్సెక్స్ నిఫ్టీలు వరుసగా 3.29శాతం, 2.76శాతం చొప్పున నష్టపోయాయి. ఐటిస్టాక్స్‌లో అమ్మకాలజోరు సాగింది. అన్ని విభాగ సూచీలు కూడా ఎన్ఎస్ఇలో ప్రతికూలంగానే ముగిసాయి. ట్రేడర్లు నాలుగోత్రైమాసిక వివరాలను పరిశీలిస్తూ, మరో పక్క గ్లోబల్ ధోరణులపైనా నజర్ వేసారు. ముడిచమురు కూడా బ్యారెల్‌కు 107 డాలర్లకుపైబడింది. ఇక బిఎస్ఇలో మిడ్‌క్యాప్0.94శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.17శాతం క్షీణించాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 1326 కంపెనీల షేర్లు పెరిగితే 2905 కంపెనీలషేర్లు క్షీణించాయి. 165 కంపెనీలషేర్లుమాత్రం యధాతథంగా కొనసాగాయి.

విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి దిగువస్థాయిలోనే ముగిసింది. 94.23వద్ద ట్రేడింగ్ ముగించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదోతేదీ సెటిల్‌మెంట్లు 0.20శాతం క్షీణించి రూ.151,450గా కొనసాగాయి. కమోడిటీ మార్కెట్లపరంగా బ్రెంట్ ముడిచమురు రెండు డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 107.07 డాలర్లుగా కొనసాగింది. ఇక నిఫ్టీలో అయితే ఐటి సూచీ ఐదుశాతం దిగజారింది. ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్‌టెక్ సంస్థలషేర్లుకూడా క్షీణించాయి. బ్యాంకింగ్, ఆటోమొబైల్స్, ఎఫ్ఎంసిజి రంగాల్లో భారీ క్షీణతను ఎదుర్కొన్నట్లు ట్రేడర్లు వెల్లడించారు.

వారం మొత్తంగాచూస్తే సెన్సెక్స్, నిఫ్టీలు రెండూ కూడా నష్టాలే చవిచైసాయి. వచ్చేవారం కూడా కార్పొరేట్ ఫలితాలు, ముడి చమురుధరలు, భౌగోళిక ఉద్రిక్తతలు, డాలర్ రూపాయి మారకం విలువలు కూడా సెన్సెక్స్, నిఫ్టీలను ప్రభావితంచేస్తాయని ట్రేడింగ్ నిపుణులు అంచనావేస్తున్నారు.

## భారత్, న్యూజిలాండ్ మధ్య


# 27న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:** భారత్ న్యూజిలాండ్‌లమధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈనెల 27వ తేదీ జరుగుతుందని ఇరువైపులా ప్రతినిధులు ప్రకటించారు. వాణిజ్య సంబంధాలు పెరగడంతోపాటుమరింతగా మార్కెట్లకు చేరువయ్యేందుకు ఈ వాణిజ్య ఒప్పందం తోడవుతుందని న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టఫర్ లక్సన్ వెల్లడించారు. భారత్‌తో మేం స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం ఈనెల 27వ తేదీ సోమవారం సంతకాలు చేయనున్నట్లు తెలిపారు. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు మెరైన్ జెట్ వ్యవస్థలు 70 దేశాలకు ఎగుమతిచేసేందుకు కూడా వీలవుతుందని ఆయన తెలిపారు.

ఈ ఒప్పందం వల్ల వాణిజ్యపరమైన అడ్డంకులన్నింటినీ అధిగమించడంతోపాటు రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం మరింత పెరుగుతుందని అన్నారు. బిజినెస్ కార్యకలాపాలు పెరగడంతోపాటు ఉపాధి అవకాశాలను కూడా పెంచుతుందని అన్నారు. ఎక్కువ వేతనాలతో మరిన్ని ఉపాధి కొలువులు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఎఫ్టీయేతో మరిన్ని అవకాశాలు, వాణిజ్య సంబంధాలు పటిష్టం అవుతాయన్నారు.

ఈనెల తొలివారంలోనే న్యాయపరంగా అన్నింటినీ పరిశీలన పూర్తిచేసారు. ఈనెల 27వ తేదీ న్యూజిలాండ్ ప్రతినిధి బృందంతోపాటు వాణిజ్య పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్‌క్లే కూడా ఉంటారు. భౌగోళిక ఉద్రిక్తతలు ఓపక్క ఎక్కువ ఉన్నప్పటికీ వాణిజ్య ఒప్పందం ఖరారు అవుతుండటం గొప్ప విశేషమని, రెండు దేశాలకు అందివచ్చిన మంచి అవకాశంగా చెప్పారు. మెక్‌క్లే ఎఫ్‌టిఎకారణంగా న్యూజిలాండ్‌కు పార్లమెంటరీ ఒప్పంద పరిశీలన వీలవుతుందని దీనివల్ల రెండుదేశాలు కూడా ఎఫ్టీయేను స్క్రూటినీ చేసుకుంటాయని అన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.